
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
శుక్రవారం 26, జూలై 2024


గ్రామ - వార్డు సచివాలయ శాఖ
APESD AA 30435704
CERTIFICATE FOR PERSON WITH DISABILITY
Issued under the authority vide G.O.Ms.No.35 HEALTH, MEDICAL AND FAMILY WELFARE (A) DEPARTMENT dt.10.04.2019
Medical Board: District Hospital, Tenali
ID No.of Person with Disability: 08020190415000019
Date of Issue: 15/08/2023
- This is certified that Shri Rachagorla Atchaiah, S/o Rachagorla Veeraiah, Male, age 35 years, Siddina Palem Habitation, Tripuranthakam Village, Pullalacheruvu Mandal, Prakasam District is suffering from Permanent disability of the following category:- Mental Illness (Moderate).
Global Disability Score : 13 (Thirteen).
Mental Illness.
- Re-assessment of this case is not recommended.
- Percentage of disability in his case is 70% (Seventy percent)
- Identification Marks of Person with Disability:
i)A MOLE ON THE CHEST
ii)A MOLE ON THE LEFT HAND
Signature — Dr.Manjeera Chintapalli, MBBS,DNB-PSYCHIATRY, Civil Assistant Surgeon
Signature — Dr.P Venkateswara Rao, MBBS,DO, Civil Surgeon Specialist
Signature — Dr.P.Ankineedu Prasad, DD, MD(FM), Chairman, Medical Board

రాచగొర్ల అచ్చయ్య తెనాలి వైద్యశాలలో పొందిన సదరం సర్టిఫికెట్

వై.కొత్తపల్లిలో 20కుపైగా..



ఎర్రగొండపాలెం పంచాయతీ పరిధిలోని వై.కొత్తపల్లిలో 20కిపైగా దొంగ పింఛన్లు ఉన్నాయి. అందులో 10మందికిపైగా తక్కువ వయస్సు ఉన్న వ్యక్తులు వృద్ధాప్య పింఛన్లు, మరో 10 మంది నకిలీ దివ్యాంగుల సర్టిఫికెట్స్ పుట్టించి యథేచ్ఛగా పొందుతున్నారు.

- సిద్దన్నపాలేనికి చెందిన 35ఏళ్ల రాచగొర్ల అచ్చయ్య అనే వైసీపీ నాయకుడు తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో మానసిక వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణపత్రం పొందాడు. దాని ద్వారా రెండేళ్లగా పింఛన్ పొందుతున్నాడు.
- ఐటీవరానికి చెందిన గంపనబోయిన ఆంజనేయులు(30) మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో అంగవైకల్యం(51 శాతం) ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకున్నాడు. రెండేళ్లగా పింఛన్ పొందుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన మరో నాయకుడి భార్యకు ఒంటరి మహిళ పింఛన్ అందుతోంది.
- పుల్లలచెరువు మండలంతోపాటు ఎర్రగొండపాలెం నియోజకర్గంలోని ప్రతి మేజర్ పంచాయతీలో 100 పైగా దొంగ పింఛన్లు ఉన్నాయి. అధికారులు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా యథేచ్ఛగా పింఛన్లు ఇస్తున్నారు.

వీరభద్రాపురం వారికి మల్లాపాలెంలో పింఛన్లు



ఎర్రగొండపాలెం మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందిన ముగ్గురు పుల్లలచెరువు మండలం మల్లాపాలెంలో దొంగ పింఛన్లు పొందుతున్నారు. అందులో ఒకటి వితంతు, మరో రెండు వృద్ధాప్య పింఛన్లు తీసుకుంటున్నారు. ఒక్క మల్లాపాలెంలోనే సుమారు 50కిపైగా దొంగ పింఛన్లు పొందుతున్నారు. వైపాలెం నియోజకవర్గంలోనే 7వేల దొంగ పింఛన్‌లు ఉంటే.. జిల్లాలో ఇలాంటివి ఎన్ని ఉన్నాయోనన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా కలెక్టరు, ఉన్నతాధికారులు స్పందించి విచారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పుల్లలచెరువు మండలం సిద్ధన్నపాలెంలో మానసికస్థితి బాగలేదని పింఛన్ తీసుకుంటున్న వైసీపీ నేత రాచగొర్ల అచ్చయ్య(ఫైల్)

పింఛన్ దొంగలు!

ప్రభుత్వ సాయం ఫలహారంలా భోజ్యం

నియోజకవర్గంలో భారీగా దొంగ పెన్షన్లు

ఆధార్‌కార్డులో వయసు మార్చి మరీ లబ్ధి

గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు సంక్షేమ దోపిడీ


విచారించి అనర్హులను తొలగించాలని సర్వత్రా డిమాండ్

అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించడమే కాకుండా సహజవనరులతో పాటు సర్వం దోచేసిన వైసీపీ నాయకులు చివరకు పేద అభాగ్యుల ఆసరా కోసం ఇస్తున్న పింఛన్లను వదల్లేదు. ఏకంగా వేల సంఖ్యలో వృద్ధాప్య, వితంతు పింఛన్లతోపాటు విభిన్న ప్రతిభావంతుల కోటాను కొట్టేశారు. ఆధార్ కార్డులో వయసు మార్పించుకొని కొందరు ఐదేళ్లుగా సాయాన్ని స్వాహా చేస్తున్నారు. ఆస్పత్రులలో సిబ్బందికి మామూళ్లు ఇచ్చి దొంగ ధ్రువీకరణ పత్రాలు, సదరమ్ సర్టిఫికెట్లు పొందారు. వాటితో నెలనెలా పింఛన్లు పొందుతున్నారు. ఒక్క ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోనే 7వేల దొంగ పింఛన్లు ఉన్నాయంటే ఇక జిల్లావ్యాప్తంగా ఎంతమంది ఉన్నారో తేలాల్సి ఉంది. అధికారులు స్పందించి పరిశీలన చేసి దొంగ పింఛన్‌దారుల ఆట కట్టించాల్సి ఉంది.

పుల్లలచెరువు, జూలై 25: వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా దొంగ పింఛన్లు పుట్టుకొచ్చాయి. ఆధార్ కార్డులో వయసు మార్చి కొందరు, వైద్యశాలల్లో భారీగా మామూళ్లు ఇచ్చి సదరమ్ సర్టిఫికెట్లు పొంది మరికొందరు.. ఇలా అనర్హులు వృద్ధాప్య, విభిన్న ప్రతిభావంతుల పింఛన్లు పొందుతున్నారు. ఒక్క ఎర్రగొండపాలెంలోనే ఇలాంటి వారు 7వేల మందికిపైగా ఉన్నట్లు సమాచారం. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, మార్కాపురం, వినుకొండ, గుంటూరు కేంద్రంగా ఆధార్‌సెంటర్లలో ఆధార్ కార్డుల్లో వయసు మార్చారు. తద్వారా 40ఏళ్ల వయసు ఉన్న అనర్హులు యథేచ్ఛగా పింఛన్లు పొందుతున్నారు. ఆధార్ నిర్వాహకులు వారి నుంచి రూ.5వేలు వసూలు చేసి వయసు మారుస్తున్నారు. మరికొందరు యువకులు ఎర్రగొండపాలెం, మార్కాపురం, గుంటూరు, ఒంగోలు, తెనాలి వైద్యశాలల్లో వైద్యులకు రూ.30వేలకుపైగా మామూళ్లు ఇచ్చి మానసిక, ఇతర దివ్యాంగులుగా సదరం సర్టిఫికెట్లు పొంది అక్రమంగా పింఛన్లు పొందుతున్నారు.

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 36,581 మంది పింఛన్‌దారులు ఉన్నారు. పుల్లలచెరువు మండలంలో 7,867, ఎర్రగొండపాలెం మండలంలో 8,411, దోర్నాల మండలంలో 5,615, త్రిపురాంతకం మండలంలో 8,642, పెద్దారవీడు మండలంలో 6,046 మంది నెలనెలా పింఛన్‌లు తీసుకుంటున్నారు. వీరిలో సూమారు 20 శాతం అంటే ఇంచుమించు 7,000 దొంగ పింఛన్లు ఉన్నాయి. దీంతో నెలకు సూమారు రూ.2.80 కోట్లు అనర్హులు మెక్కేస్తున్నారు. అయితే అడ్డుకోవాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా యథేచ్ఛగా నిధులు మంజూరు చేస్తున్నారు.

పింఛన్ మంజూరుకు వెల్ఫేర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోల సర్టిఫికెట్‌తోపాటు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇవ్వాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా ఆధార్‌లో వయసు మార్చుకున్న అనర్హులు, నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొందినవారి నుంచి రూ.10 వేలు తీసుకొని అడ్డగోలుగా పింఛన్లు మంజూరు చేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఒక్క ఐటీవవరం పంచాయతీలోనే సూమారు 50కి పైగా దొంగ పింఛన్లు ఉన్నట్లు సమాచారం.



ఐటీవరానికి చెందిన గంపనబోయిన ఆంజనేయులు మార్కాపురం వైద్యశాలలో పొందిన ధ్రువీకరణపత్రం

వైద్యారోగ్యశాఖలో విచారణ

హెల్త్ అసిస్టెంట్ల నియామకంపై ఆరోపణలు

ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన ఆర్డీ


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ఆర్డీ, ఇతర అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 25 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 2002 నుంచి ఇప్పటివరకు జరిగిన హెల్త్ అసిస్టెంట్ల నియామకాలపై గుంటూరు జోనల్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి విచారణ చేపట్టారు. 2002లో జరిగిన హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో భారీ అక్రమాలు జరిగాయని ఐదేళ్ల క్రితం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో గుంటూరు జోన్ పరిధిలోని గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఆ నియామకాలపై విచారణకు శ్రీకారంచుట్టారు. ఇప్పటికే గుంటూరు, నెల్లూరు జిల్లాల విచారణ పూర్తయింది. గురువారం కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ల నియామకాలపై విచారణ చేశారు. ఉద్యోగాలు ఎప్పుడు ఇచ్చారు, ఎన్ని పోస్టులకు ఇచ్చారు, ఆ ఉద్యోగికి అర్హత ఉందా లేదా తదితర అంశాలను పరిశీలించారు. జిల్లాలో పనిచేస్తున్న 160మంది హెల్త్ అసిస్టెంట్లు పనిచేస్తుండగా వారిలో వంద మంది రెగ్యులర్ కాగా మిగిలిన వారు కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నారు. వారందరినీ విచారణకు హాజరుకావాలని డీఎంహెచ్‌వో ఆదేశాలు జారీచేయడంతో అందరూ వచ్చారు. విచారణలో అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. అనంతరం డిక్లరేషన్ పత్రాలను తీసుకున్నారు. మూడు జిల్లాల్లో నిర్వహించిన విచారణ నివేదికను త్వరలో వైద్యశాఖకు సమర్పిస్తామని ఆర్‌డీ శోభారాణి తెలిపారు. ఈ విచారణలో గుంటూరు డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ, డాక్టర్ వాణిశ్రీ, వైద్యశాఖ పరిపాలనాధికారి గీతాంజలి, సూపరింటెండెంట్ రాజేష్ తదితరులు ఉన్నారు.

పాఠశాల విద్యా పరీక్షల షెడ్యూల్

ఒంగోలు(విద్య), జూలై 25 : ఈ విద్యా సంవత్సరం పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నిర్వహించనున్న పరీక్షల తేదీలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది.

- ఫార్మెటివ్-1: ఆగస్టు 1 నుంచి 5 వరకు నిర్వహిస్తారు.
- ఫార్మెటివ్-2: సెప్టెంబరు 26 నుంచి 30 వరకు జరుగుతాయి.
- సమ్మెటివ్-1: పరీక్షలు నవంబరు 1 నుంచి 15 వరకు జరుగుతాయి
- ఫార్మెటివ్-3: 2025 జనవరి 2నుంచి 6 వరకు జరుగుతాయి
- పదవతరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు: 2025 ఫిబ్రవరి 10నుంచి 20 వరకు జరుగుతాయి.
- ఫార్మెటివ్-4 : వచ్చే ఏడాది మార్చి 3నుంచి6 వరకు జరుగుతాయి
- సమ్మెటివ్-2: ఏప్రిల్ 7నుంచి18 వరకు జరుగుతాయి
- విద్యార్థులకు దసరా సెలవులు అక్టోబరు 4నుంచి 13 వరకు ఉంటాయి.
- మైనార్టీ విద్యాసంస్థలకు దసరా సెలవులు అక్టోబరు 11 నుంచి 13 వరకు ఉంటాయి.
- పాఠశాలలకు సంక్రాంతి సెలవులు 2025 జనవరి 11 నుంచి 19 వరకు, క్రిస్మస్ సెలవులు డిసెంబరు 20 నుంచి 29 వరకు వరకు ఉంటాయి.



అధికోత్పత్తి కొనుగోళ్లకు కేంద్రం అనుమతి

పొగాకుకు అపరాధ రుసుం కూడా రద్దు

నేటి నుంచి వేలంకేంద్రాలు

పునఃప్రారంభం

ఒంగోలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది వేలంకేంద్రాలలో పొగాకు కొనుగోళ్లు శుక్రవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి అధికంగా ఉత్పత్తి అయిన పంట కొనుగోలుకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ అనుమతించిన నేపథ్యంలో తిరిగి వేలాన్ని బోర్డు అధికారులు చేపడుతున్నారు. దీంతో దాదాపు మూడు వారాలుగా ఆగిపోయిన పొగాకు వేలం తిరిగి ప్రారంభం కానుంది. ప్రస్తుత ఏడాది దక్షిణాదిలో 88.69 మిలియన్ కిలోలు పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా రైతులు దాదాపు 140 మిలియన్ కిలోలు పంట పండించిన విషయం విదితమే. వాతావరణం అనుకూలతతో పాటు మార్కెట్‌లో అంతకు ముందు ఏడాది పంటకు ఉన్న డిమాండ్, లభించిన ఆదాయం ఇతరత్రా అంశాలతో సాగు విస్తారంగా జరిగింది. ఆ మేర ఉత్పత్తి కూడా పెరగ్గా ఫిబ్రవరి 29న తొలి విడత, మార్చి 6న రెండవ విడత వేలం ప్రారంభమైంది. గతంలో ఎన్నడూ లేనంతగా మార్కెట్లో డిమాండ్‌తో పాటు భారీగా ధరలు లభించాయి. గరిష్ఠంగా కిలో రూ.366 ధర లభించడంతోపాటు మీడియం, మేలు రకం తేడా లేకుండా కొన్నారు. అలా ఈనెల తొలివారానికి 91 మిలియన్ కిలోలు కొనుగోళ్లు జరగ్గా కిలోకు సగటున రూ.252 ధర లభించింది. ఇది పొగాకు బోర్డు చరిత్రలో దక్షిణాదిలో ఆల్‌టైమ్‌ల రికార్డు. ఆ విషయం అలా ఉంచితే ఇప్పటికే ఆయా వేలం కేంద్రాలలో అనుమతించిన కొనుగోళ్లు పూర్తికాగా అదనపు పంట విక్రయాలకు కేంద్ర వాణిజ్యమంత్రిత్వశాఖ నుంచి ముందుగా అనుమతిని బోర్డు అధికారులు తీసుకోలేకపోయారు. అధిక పంట ఉత్పత్తిపై అపరాధ రుసుం విషయంలో కేంద్రం నిర్ణయం జాప్యం జరగడంతో ఆ పరిస్థితి ఏర్పడగా వేలం కేంద్రాలలో కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఆ సమయానికి రైతుల వద్ద 49 మిలియన్ కిలోల పంట ఉంది. మూడు వారాల నుంచి వేలం ఆగిపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది. ఈ విషయాన్ని పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చొరవతో రాష్ట్రానికి చెందిన ఎంపీలు శ్రీకృష్ణదేవరాయులు, పురందేశ్వరిలు బుధవారం కేంద్రమంత్రి పియూష్ గోయల్ దృష్టికి తీసుకెళ్లారు. అధిక పంట కొనుగోలు ఉత్తర్వుల తోపాటు అపరాధ రుసుం కూడా గతంలో వలే రద్దుచేయాలని కోరారు. ఆ వెంటనే ఉన్నతాధికారులలో కదలిక వచ్చి అపరాధరుసుం రద్దు చేయడంతోపాటు కొనుగోళ్లకు అనుమతిస్తూ అర్ధరాత్రికి గెజిట్ విడుదలైంది. దీంతో తక్షణం వేలంకేంద్రాల పునఃప్రారంభానికి బోర్డు అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం నుంచి దక్షిణాది వేలం కేంద్రాలలో కొనుగోళ్లు తిరిగి ప్రారంభం కానున్నాయి.

ఇతర జిల్లాల తహసీల్దార్లు రిలీవ్

34 మంది సొంత జిల్లాలకు కేటాయింపు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన 34మంది తహసీల్దార్లను రిలీవ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల సమయంలో సొంత జిల్లాల్లో పనిచేస్తున్న వారు ఒకే స్థానంలో మూడేళ్లకుపైగా పనిచేస్తున్న తహసీల్దార్లు 34 మందిని ఇతర జిల్లాల నుంచి ప్రకాశం జిల్లాకు బదిలీ చేస్తూ భూపరిపాలనా కమిషనర్ అప్పట్లో ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం వారిని సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ 34మంది బుధవారం సాయంత్రమే రిలీవ్ అయ్యారు. ప్రత్యామ్నాయం కోసం చూడకుండా కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్న డిప్యూటీ తహసీల్దార్లకు చార్జ్ అప్పగించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం రిలీవ్ అయిన తహసీల్దార్లు పోస్టింగ్‌ల కోసం సంబంధిత జిల్లా కలెక్టర్లను సంప్రదించాల్సి ఉంది. ఈ తహసీల్దార్లు ఎవరిని వారి వారి సొంత రెవెన్యూ డివిజన్లలో నియమించవద్దని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.





టీచర్ల సిఫార్సు బదిలీలు రద్దు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

108 మందికి నష్టం

ఒంగోలు(విద్య), జూలై 25 : సాధారణ ఎన్నికల ముందు గత ప్రభుత్వం హడావుడిగా జారీ చేసిన ఉపాధ్యాయుల బదిలీలు రద్దయ్యాయి. ఈ మేరకు పాఠశాల విద్యా ముఖ్యకార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులతో జిల్లాలో 108మంది ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు రద్దయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీచర్ల అక్రమ బదిలీలపై దృష్టిపెట్టింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొద్దిరోజుల ముందు గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధుల సిఫార్సులతో టీచర్ల బదిలీలకు తెరలేపింది. రాజకీయ నాయకుల సిఫార్సులతో పాటు కొందరు ముఖ్య దళారులు బదిలీకి ఒక్కొక్క టీచర్ నుంచి రూ.4 లక్షల వరకు అక్రమంగా వసూలు చేశారు. ఈ బదిలీల్లో పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయంలో కీలకంగా వ్యవహరించే ఒక అధికారిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. అప్పటి విద్యాశాఖ మంత్రి, ఈ కీలక అధికారి టీచర్ల బదిలీల్లో కోట్లు కొల్లగొట్టారన్న విమర్శలు వెల్లువెత్తాయి. కొందరైతే మంత్రి, ఆ అధికారిపై నేరుగానే ఆరోపణలు గుప్పించారు. సాధారణ బదిలీల్లో దూరం పోవాల్సి వస్తుందన్న భయంతో సిఫార్సుల కోసం కక్కుర్తిపడితే డబ్బులకు డబ్బులు పోయినా ఫలితం దక్కకుండాపోయింది. జిల్లాలో హెచ్‌ఎంలు, స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు మొత్తం 108మంది ఈ బదిలీల అక్రమ దందాలో ఉన్నారు.

కౌన్సెలింగ్ లేకుండా...

నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ విధానంలోనే బదిలీ చేయాలి. దానికి తూట్లు పొడిచి గత ప్రభుత్వం ఇష్టారీతిన టీచర్లను బదిలీ చేసింది. దీనిపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ఈ బదిలీలన్నింటినీ రద్దుచేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు గురువారం ఇక్కడి డీఈవో కార్యాలయానికి అందాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టీచర్ల బదిలీ ఉత్తర్వులు రద్దయిన విషయాన్ని సంబంధిత మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, హైస్కూలు హెడ్మాస్టర్లకు ఉత్తర్వుల నకలును పంపినట్లు డీఈవో సుభద్ర తెలిపారు. తాము గతంలో జారీచేసిన నియామక ఉత్తర్వులను నిలిపివేయాలని అధికారులను డీఈవో ఆదేశించారు.

జిల్లా డెయిరీని పునరుద్ధరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య, పక్కన రంగారావు, నారాయణ తదితరులు

అందుకోసం సీఎం వద్దకు రాయబారం

పూర్వవైభవానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి

రూ.వెయ్యికోట్ల విలువైన ఆస్తులకు రక్షణ కల్పించాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 25 : ఒంగోలు పాల డెయి రీ పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులు కేటాయించి వెంటనే ప్రారంభించాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సీపీఐ జిల్లాసమితి ఆధ్వర్యంలో గురువారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఈ శ్వరయ్య మాట్లాడుతూ పాడిరైతులు రూపాయి రూపాయి కూడబెట్టి ఒంగోలు డెయిరీని ఏర్పాటు చేసుకున్నారన్నారు. 1987లో పాలపొడి ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరగ్గా స్థలానికి పాడిరైతులు రూ. 19 లక్షలు విరాళం కూడా ఇచ్చారన్నారు. 2014వరకు లాభాల బాటలో నడిచిన డెయిరీని సహకారరంగం నుంచి కంపెనీ యాక్టులోకి తీసుకురావడంతో సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఆ తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నాశనం చేసిందని విమర్శించారు. డెయిరీని ప్రభుత్వం నిర్వహించాలని అందుకో సం సీఎం చంద్రబాబు వద్దకు రాయబారానికి సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. వెయ్యి కోట్ల ఆస్తులకు రక్షణ కల్పించాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఒంగోలు డె యిరీ పూర్వాధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ డెయిరీ పాలన సహకారం నుంచి కంపెనీ యాక్టులోకి వెళ్లిన నాటి నుంచి వ్యక్తుల చేతుల్లోకి పోయి పూర్తిస్థాయిలో నాశనమైందన్నారు. రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్‌లు మాట్లాడుతూ ఒంగోలు డెయిరీ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవీఎన్ స్వామి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పీవీఆర్ చౌదరి, ఎస్.లలితకుమారి, కొత్తకోట వెంకటేశ్వర్లు, పమిడి వెంకట్రావు, వల్లంరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు


మాట్లాడుతున్న దినకర్, పక్కన శివారెడ్డి, ఆంజనేయులు, కల్యాణచక్రవర్తి

వికసిత ప్రకాశం దిశగా కేంద్ర బడ్జెట్

వెనుకబడిన జిల్లాల జాబితాలో చోటుదక్కడంతో అభివృద్ధి పరుగు

కనిగిరి నిమ్జ్, దొనకొండ కారిడార్‌కు మహర్దశ

బీజేపీ నేత దినకర్ వెల్లడి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 25: వికసిత ప్రకాశం దిశగా కేంద్ర బడ్జెట్ ఉందని బీజేపీ రాష్ట్ర ముఖ్యఅధికార ప్రతినిధి లంకా దినకర్ వెల్లడించారు. స్థానిక ఓ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకాశంను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చడం ద్వారా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సాధ్యమవుతుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దొనకొండ కారిడార్, కనిగిరి నిమ్జ్‌లతో పాటు భూగర్భజలాల వృద్ధి, రహదారుల అభివృద్ధి వంటి వాటికి నిధులు వస్తాయన్నారు. కేంద్రప్రభుత్వం ఎటువంటి పారిశ్రామిక రాయితీలు ప్రకటించినా ముందుగా అవి వెనుకబడిన జిల్లాలకు వస్తాయని చెప్పారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కేంద్రప్రభుత్వాన్ని కోరడంతో ఈవన్నీ కలిసి వచ్చాయన్నారు. పూర్వోదయ పథకంలో ఆంధ్రప్రదేశ్‌ను పెట్టడం ద్వారా రోడ్డు, రైల్వే, ఎనర్జీ రంగాలతో తీరప్రాంత జిల్లాల అభివృద్ధి చెందుతాయని చెప్పారు. మాజీ సీఎం జగన్ వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టును సందర్శించి వాస్తవాలతో కూడిన నివేదికను సీఎంకు అందజేస్తామన్నారు. మార్కాపురం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయడంతోపాటు ఒంగోలు జిల్లాలో కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలు కలపాలని మొదటి నుంచి బీజేపీ డిమాండ్ చేస్తోందని చెప్పారు. ఒంగోలుకు అమృత పథకంతో పాటు పీఎంఏవై గృహాలు, జల్‌జీవన్‌మిషన్ వంటి పథకాలను కేంద్రం ఇచ్చినా వాటిని వినియోగించుకోవడంలో జగన్ సర్కార్ విఫలమైందని దినకర్ మండిపడ్డారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చడంతోపాటు అమరావతికి రూ.15వేల కోట్లను కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించడం అభినందనీయమన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు రవిశంకర్, డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్‌చక్రవర్తి, పి.వి.కృష్ణారెడ్డి, గుర్రం సత్యనారాయణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు

- రాత్రుళ్లు మందుబాబుల చిందులు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- కానరాని పోలీసు గస్తీ

ఒంగోలు(క్రైం), జూలై 25: ఒంగోలు నగర శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారుతున్నాయి. చికటి పడితే మందుబాబుల ఆగడాలు, రహదారుల పక్కన నిలబడి విటులను ఆకర్షించే ముఠాలు సంచరించడం పరిపాటిగా మారింది. అదేక్రమంలో గంజాయ్ బ్యాచ్‌లకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రోడ్ల పక్కన గుంపులుగుంపులుగా చేరి యువకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు పోలీసు గస్తీ తగ్గడంతో ఆకతాయిలు మరింతగా రెచ్చిపోతున్నారు. స్థానిక మంగమూరు రోడ్డు ఆశ్రమం దగ్గర నుంచి ఖాళీగా ఉండే వెంచర్లలో మందుబాబులు చేరి అర్ధరాత్రి వరకు నానా హైరానా చేస్తున్నారు. దీంతో అక్కడ నివాస ప్రాంతాల వారితో పాటు రహదారులపై రాకపోకలు సాగించే ప్రయాణికులు సైతం వారిని చూసి భయపడుతున్నారు. ప్రధానంగా నగర శివారు ప్రాంతాల్లో మందుబాబులు కాస్త పొద్దువాలితే చాలు మద్యం సేవించేందుకు బృందాలుగా తరలి వెళుతున్నారు. ముఖ్యంగా మంగమూరు రోడ్డులో ఆశ్రమం సమీపంలో రోడ్లకు ఇరువైపులా గుంపులుగా చేరి గొడవలకు దిగడం పరిపాటిగా మారింది. కొంతమంది గంజాయి బ్యాచ్‌లు కూడా అటు వైపు చేరుతున్నారు. గాంధీనగర్‌లో గంజాయి లభ్యమవుతుందని చెబుతున్నారు.

రోడ్ల పక్కన గంజాయి దమ్ము

నగరంలోని కమ్మపాలెం నుంచి దశరాజుపాలెం వెళ్లే రోడ్డులో గంజాయి బ్యాచ్‌లు చేరుతున్నారు. కాస్త చీకటి పడితే ఆ రోడ్డులో మహిళలు వెళ్లాలంటే భయపడుతున్నారు. గంజాయి తెచ్చుకొని బ్యాచ్‌లుగా తాగడం, అక్కడే గొడవలు చేయడం చేస్తున్నారు. అంతేగాకుండా మహిళలు ఒంటరిగా వెళుతున్నా, లేక భార్యాభర్తలు వెళుతున్నా కామెంట్స్ చేస్తూ మానసిక వేధింపులకు గురిచేస్తున్నారు. ఇక పట్టపగలు గంజాయి తాగేందుకు మంగమూరురోడ్డు వైపు కళాశాల విద్యార్థులు సైతం వెళుతున్నారు.

విటుల కోసం వేట

రహదారుల వెంట రాత్రులు విటులను ఆకర్షించేందుకు హిజ్రాల హంగామా ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగిపోయింది. ముఖ్యంగా కిమ్స్ సెంటర్‌లో రాత్రుళ్లు వాహనాలపై వెళ్లే వారి వెంట పడుతున్నారు. అక్కడ ఆరు నెలల క్రితం హిజ్రాల కోసం వెళ్ళిన యువకుడిని డబ్బులు విషయంలో తేడా వచ్చి కిడ్నాప్ చేసిన ఉదంతం జరిగింది. అదేవిధంగా హైవే పక్కన కొప్పోలు ఫ్లైఓవర్ వద్ద ఇలాంటి కార్యకలాపాలు జోరుగా జరుగుతున్నాయి.

పోలీసు గస్తీ పెంచితేనే..

నగర శివారు ప్రాంతంలో గస్తీ ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. గతంలో అగ్రహారం అండర్ పాస్ సమీపంలో బాతులు కాపరుల గుడారంలో ఉన్న చిన్నబిడ్డను అపహరించిన ఘటన గుర్తుచేసుకుంటున్నారు. ఇప్పటికీ ఆ చిన్నారి ఆచూకీ లేకపోవడం గమనార్హం. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నా పోలీసులు శివారు ప్రాంతాలపై దృష్టి సారించికపోవడం పట్ల పలు విమర్శలు వినబడుతున్నాయి. ఇప్పటికైన పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నగర శివారు ప్రాంతాలపై దృష్టి సారించి శాంతిభద్రతలను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు : డీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

మద్దిపాడు, జూలై 25: ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా పనిచేస్తున్నాయని డీఈవో సుభద్ర పేర్కొన్నారు. గురువారం మద్దిపాడు కడియాల యానాదయ్య హైస్కూలులో జరిగిన శిక్ష సప్తాహ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధి కల్పన నైపుణ్యాల్లో శిక్షణ అందించాలన్నారు. నూతన విద్యావిధానంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, శరీర సౌష్టవ ఆవశ్యకత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన పెంచాలని, ఎన్‌సీపీఆర్ కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించాలని చెప్పారు. పాఠశాలల్లో డ్రగ్స్, మద్యంలాంటి కార్యక్రమాలను ఉక్కుపాదంతో రూపుమాపే విధంగా అధికారం యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు, ఎంఈవో-2 మెడబలిమి శ్రీనివాసరావు, ఎంహెచ్ఈ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు పెద్దిరెడ్డి కోటిరెడ్డి, నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లా ప్రథమ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ మూర్తి తదితరులు

ఒంగోలు(విద్య), జూలై 25: ఆంధ్రకేసరి యూనివర్సిటీ లా విభాగం మొదటి సెమిస్టర్ ఫలితాలను గురువారం వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ డీవీఆర్.మూర్తి విడుదల చేశారు. యూనివర్సిటీ పరిధిలోని రెండు న్యాయ కళాశాలల నుంచి 320 మంది విద్యార్థులు మొదటి సెమిస్టర్ పరీక్షలకు హాజరుకాగా 223 మంది పాసై 69.7శాతం ఉత్తీర్ణత సాధించారు. ఐదు సంవత్సరాల లా కోర్సుకు 64మంది పరీక్షలకు హాజరుకాగా 40మంది పాసయ్యారు. 62.5శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం పీజీ లా కోర్సుకు 44 మంది విద్యార్థులు హాజరు కాగా 40 మంది పాసై 91శాతం ఉత్తీర్ణత సాధించారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చూపి యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకులు సాధించారు. లా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను చూపి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వీసీ మూర్తి, రిజిస్ట్రార్ బిహరిబాబు, సీఈ రాజు అభినందించారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, ఎస్‌టీఏఆర్ శ్రీనివాస్, పరీక్షల పర్యవేక్షకులు శివరామయ్య పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ రామరాజు

టంగుటూరు, జూలై 25 : టంగుటూరు వాణీనగర్‌లో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ ఇత్తడి విజయ్‌కుమార్‌ను గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నార్త్‌బైపాస్ రోడ్డులో అరెస్ట్ చేశామని కనిగిరి డీఎస్పీ ఆర్. రామరాజు ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆయన విచారణాధికారిగా ఇక్కడకు వచ్చారు. అత్యాచారం జరిగిన ఇంటిని గురువారం ఉదయం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ వివరించారు.

కొండపి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాగరాజు



బాధ్యతలు చేపడుతున్న నాగరాజు

కొండపి, జూలై 25 : కొండపి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఎలక్షన్ డీటీ పి.నాగరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎన్నికల విధుల్లో భాగంగా పల్నాడు జిల్లా నుంచి వచ్చిన బి. కిరణ్‌కుమార్ తహసీల్దార్‌గా పనిచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల విధులు అనంతరం కిరణ్‌కుమార్ రిలీవ్ కాగా, ఇన్‌చార్జిగా నాగరాజు బాధ్యతలు చేపట్టారు.

జరుగుమల్లి ఇన్‌చార్జిగా అరుణ.. జరుగుమల్లి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా తహసీల్దార్ కార్యాలయం డీటీ అరుణ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా పనిచేసిన చక్రవర్తి గురువారం బాధ్యతల నుంచి రిలీవయ్యారు.

పొన్నలూరు ఇన్‌చార్జిగా స్రవంతి.. పొన్నలూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కార్యాలయం డీటీ ఎం.స్రవంతి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎన్నికల విధుల్లో భాగంగా తహసీల్దార్‌గా పనిచేసిన సుధాకర్‌రావు రిలీవయ్యారు.

ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు ముగిసిన కౌన్సెలింగ్



అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న అధికారులు

వేంపల్లె, జూలై 25: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఒంగోలు ట్రిపుల్‌ఐటీ అడ్మిషన్ కౌన్సెలింగ్ గురువారం ముగిసింది. రెండవ రోజు డైరెక్టర్లు కుమారస్వామి గుప్త, భాస్కర్‌పటేల్ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరిగింది. మొత్తం 1035 మందికి కాల్‌లెటర్లు పంపగా 792 మంది హాజరై అడ్మిషన్లు పొందారు. మిగిలిన 242 సీట్లకు ఆగస్టు మొదటి వారంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్రకుమార్ సంద్ర తెలిపారు.

యువకుడి హత్యకేసులో ముగ్గురికి జీవిత ఖైదు

- ముద్దాయిలుగా హతుడి భార్య, అత్త, మరో యువకుడు
- ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి తీర్పు

ఒంగోలు(క్రైం), జూలై 25: వివాహేతర సంబంధం కారణంగా యువకుడిని హత్య చేసిన ముగ్గురికి యావజ్జీవ కారగార శిక్ష విధిస్తూ ఒంగోలులోని ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి రాజా వెంకటాద్రి గురువారం తీర్పు నిచ్చారు. నిందితులు త్రిపురాతకం మండంల అన్నసముద్రం గ్రామానికి చెందిన శెట్టి బాలచెన్నయ్య, కురిచేడు మండలం దేకనకొండకు చెందిన చామల వెంకటసుబ్బులు, త్రిపురాంతకం మండలం గుట్లల ఉమ్మడివరంనకు చెందిన మెడబలిమి నాగలక్ష్మిలపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు తోపాటుగా వెయ్యిరూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాషిక్యూషన్ కథనం మేరకు 2015 సంవత్సరలో త్రిపురాంతకం మండలం గుంటల ఉమ్మడివరంనకు చెందిన మెడబలిమి చినఆంజనేయులుకు, అన్నసముద్రంనకు చెందిన శెట్టి బాలచెన్నయ్య మద్యం తాగించి మందలబైలు వద్దకు తీసుకెళ్ళి హత్య చేశాడు. చిన ఆంజనేయులును హత్య చేసేందుకు అతని భార్య నాగలక్ష్మి, అత్త వెంకటసుబ్బులు, బాలచెన్నయ్యతో కలిసి పథకం రూపొందించారు. బాలచెన్నయ్యతో నాగలక్ష్మి, వెంకటసుబ్బులుకు ఉన్న వివాహేతర సంబంధానికి అడ్డులేకుండా చేసుకునేందుకు భర్తను హత్య చేసేందుకు కుట్ర పన్నారు. ఈక్రమంలో నాగలక్ష్మి తన తల్లి, ప్రియుడుతో కలిసి ప్రణాళిక ప్రకారం భర్తను దారుణంగా హత్య చేయించిది.

ఈ మేరకు హత్యా నేరం రుజువు కావడంతో న్యాయాధికారి ముగ్గురికి జీవిత ఖైదీ విధించారు. ప్రాషిక్యూషన్ తరుపున అదనపు పీపీ సి.శ్రీనివాస మూర్తి, న్యాయాధికారి జేహెచ్.జోష్విన్ తమ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా హత్య కేసులో నిందితులకు శిక్షలు పడే విధంగా సాక్షాధారాలు సేకరించిన పోలీసు అధికారులు అప్పటి దర్శి డీఎస్పీ రాంబాబు, ప్రస్తుతం దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, అప్పటి దర్శి సీఐ రాఘవేంద్రరావులను ఎస్పీ దామోదర్ అభినందించారు.

గంజాయి విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం

- నేరాల నియంత్రణపై నిరంతర నిఘా
- అసాంఘిక కార్యకలాపాలపై కొరడా
- ఎస్పీ దామోదర్
- పలు పోలీస్‌స్టేషన్ల తనిఖీ



చీమకుర్తిలో సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్న ఎస్పీ దామోదర్

చీమకుర్తి, జూలై25 : గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ అంతా పరిశీలించారు. పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి తెలిపారు. లాకప్, రికార్డుల గదిని పరిశీలించారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై కొరడా ఝుళిపించాలని చెప్పారు. నేరాల నియంత్రణపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది గౌరవప్రదంగా వ్యవహరించాలని సూచించారు. విజిబుల్ పోలిసింగ్‌ను చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవలని ఆదేశించారు. రోడ్డుప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన చేపట్టాలన్నారు. ప్రతిగ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సిబ్బంది సమయపాలన పాటించటంతో పాటు క్రమశిక్షణతో నడుచుకోవాలన్నారు. పోలీసుసిబ్బంది సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటకృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరిస్తాం

దర్శి: పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరిస్తామని, శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ దామోదర్ అన్నారు. గురువారం దర్శి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను పూర్తిగా అరికట్టేందుకు, దొంగతనాలు జరగకుండా నివారించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సామాన్య ప్రజలకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసులమని, నేరస్థులకు, రౌడీలకు కాదని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా టీడీపీ వర్గీయులపై దాడులు జరిగినప్పటికీ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి పట్టించుకోలేదని వస్తున్న విమర్శల గురించి విలేకరులు ప్రశ్నించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా జరిగిన అన్ని సంఘటనలను క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో దర్శి ఎస్సై సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

తాళ్లూరు: త్వరితగతిన పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్పీ దామోదర్ సిబ్బందికి సూచించారు. గురువారం తాళ్లూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులు అధికంగా జరుగుతున్నందున పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. దుండగులను గుర్తించేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.విజయ్‌కుమార్, ఏఎస్ఐ మోహన్‌రావు పాల్గొన్నారు.

చోరీలపై పీడీ యాక్ట్..

ముండ్లమూరు: నేరాల అదుపునకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న గేదెల దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దొంగతనాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీలకు పాల్పడుతున్న నిందితులను పట్టుకొనేందుకు ఏఎస్పీ స్థాయి అధికారిని నియమిస్తామని చెప్పారు. మండలంలోని ఉల్లగల్లు పంచాయతీలోని రెడ్డినగర్‌లో 2019లో అదృశ్యమైన మేడం ఆరూష్‌రెడ్డి అదృశ్యం కేసు నమోదుపై సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో రైటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఎం.మరియబాబు, పి.పున్నారావు, సూరిబాబు, మహేష్, ప్రేమానిధి పాల్గొన్నారు.

ఆటో, మినీ వ్యాన్ ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తిరుపతయ్య



బోల్తాపడిన వాహనం

కనిగిరి, జూలై 25: ఆటో, మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈఘటన గురువారం కనిగిరి పట్టణ సమీపంలోని కొత్తూరు వద్ద చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మర్రిపూడి మండలం వేమవరంనకు చెందిన ఏడుగురు ఆటోలో నెల్లూరు జిల్లా నర్రవాడ దేవాలయానికి వెళ్ళి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో కొత్తూరు వద్ద చాకిరాల వైపు నుంచి వస్తున్న మినీవ్యాన్ డ్రైవర్ ఒక్కసారిగా పామూరు రోడ్డులోకి మళ్ళించాడు. దీంతో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఆటో డ్రైవర్ ప్రమాదాన్ని తప్పించేక్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మందాడి తిరుపతయ్య, శేషమ్మ, తిరుపతమ్మకు తీవ్రగాయాలు కాగా, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో మందాడి తిరుపతయ్య, తిరుపతమ్మల పరిస్థితి విషయమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే తాటిపర్తి..నోరు అదుపులో పెట్టుకో : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుయువత నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 25 : అన్నక్యాంటీన్లపై అనుచిత వాఖ్యలు చేసిన యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని తెలుగు యువత నాయకులు హెచ్చరించారు. గురువారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లో భోజనం చేసేవారంతా బిక్షగాళ్ళే అంటూ మాట్లాడటాన్ని పేద ప్రజలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు తప్పు పడుతున్నారని అన్నారు. బిర్యానీ హోటల్ పెట్టి వందల్లో దోచుకునే ఎమ్మెల్యే, తన నోటికొచ్చినట్లు మాట్లాడితే ఆయన ఇల్లు ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ప్రజలకు చంద్రశేఖర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలుగుయువత ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావు, నల్లమోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబానికి చెక్‌ను ఇస్తున్న ఆర్ఎం, సంఘ నాయకులు

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 25 : స్టేట్ బ్యాంక్ ఇండియాలో తాత్కాలిక పద్ధతిన పనిచేస్తూ క్యాన్సర్ వ్యాధితో మరణించిన బి.పెద్దఅల్లూర్యకు ఎస్‌బీఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేశారు. గురువారం ఒంగోలు నగరం కర్నూలురోడ్‌లోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అసోసియేషన్ ఉపాధ్యక్షులు దుగ్గిరాల కార్తీక్ అధ్యక్షత వహించగా, రీజనల్ మేనేజరు గున్నేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్లూరయ్య కుటుంబానికి అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.3.5లక్షలు ఆర్థికసహాయాన్ని ఆర్ఎం చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అండగా నిలబడటం అభినందనీయమన్నారు. దుగ్గిరాల కార్తీక్ మాట్లాడుతూ ఎస్ఎంఈ బ్రాంచ్‌లో ఎన్ఎంఆర్ పద్ధతని మెస్సెంజర్‌గా పనిచేస్తూ బ్యాంకులో తన సేవలను అందించారన్నారు. ఆయన మరణం బాధకరమని తెలిపిన, అల్లూరయ్య కుటుంబానికి అండగా నిలవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎస్‌లు జి.కిరణ్‌కుమార్, తేజశ్వి, ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు ఆర్ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు(విద్య), జూలై 25: ప్రభుత్వ, ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలల్లో పాలిసెట్-24 తుదిదశ కౌన్సెలింగ్ మగిసిన తర్వాత మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ గురువారం తెలిపారు. ఏ కళాశాలలో ఎన్ని సీట్లు ఖాళీ ఉంది, బ్రాంచి వారీగా ఈనెల 27న నోటీసుబోర్డులో ప్రకటిస్తారు. నోటీసుబోర్డులోని ఖాళీల ఆధారంగా విద్యార్థులు ఏ కళాశాలలో, ఏ బ్రాంచిలో చేరతారో నిర్ణయించుకుంటారు. విద్యార్థులు ఈనెల 31న తమ ఒరిజనల్ విద్యార్హతల సర్టిఫికెట్లతో తాము చేరదల్చుకున్న కళాశాలలో హాజరుకావాలి. ప్రవేశ రుసుం లేకుండా అప్పుడే చెల్లించాలి. విద్యార్థులు ట్యూషన్ ఫీజుగా రూ.4700 చెల్లించాలి. కౌన్సెలింగ్ ఫీజు కింద ఓసీ, బీసీ విద్యార్థులు పాలిసెట్‌లో ర్యాంకు సాధించిన వారు రూ.700, ర్యాంకు సాధించని వారు రూ.1100, ఎస్సీ, ఎస్టీలు అయితే ర్యాంకు సాధించిన వారు రూ.250, ర్యాంకు సాధించని వారు రూ.350 ఫీజు చెల్లించాలి. స్పాట్ అడ్మిషన్లలో పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం పొందిన వారు ఫీజు రీఎంబర్స్‌మెంట్ వర్తించదని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

సాంస్కృతిక సముదాయాలపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 25: ఆంధ్రప్రదేశ్‌లోని ఠాగూర్ సాంస్కృతిక సముదాయాల పనితీరు, కొత్త వాటి ఏర్పాటు, అథారిటీ నియామకాలపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం ప్రశ్నించారు. దీనిపై కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ(స్వతంత్ర) సహాయకమంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ సమాధానం ఇస్తూ ఈ పథకం కింద సంగీతం, నృత్యం, సాహిత్యం, లలితకళలు తదితర సాంస్కృతిక రంగాల్లో ప్రజల జీవన నాణ్యతను మెరుగుపర్చేందుకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దేశంలో ఐదు సంవత్సరాలలో రాష్ట్రాల నుంచి 26 ఠాగూర్ సాంస్కృతిక సముదాయాల ఏర్పాటుకు వచ్చిన ప్రతిపాదనలను ఆమోదించడం జరిగిందన్నారు. అందులో ఆర్థిక సహాయం ఎనిమిది ఉన్నాయన్నారు. తిరుపతిలో దీని ఏర్పాటుకు వచ్చిన ప్రతిపాదనలను సిఫార్సు చేసి ఆమోదించాల్సి ఉందని మాగుంట ప్రశ్నకు కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

కృత్రిమ సంతానోత్పత్తిపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వైద్యులు

ఒంగోలు(కల్చరల్), జూలై 25: ఒకప్పుడు కొన్ని పాశ్చాత్య దేశాలకే పరిమితమైన కృత్రిమ సంతానోత్పత్తి (ఐవీఎఫ్) విధానం నేడు మనదేశంలో సైతం విస్తృతంగా వ్యాపించిందని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం అవసరమని వైద్యులు ఉజ్వల జాస్తి, శ్రావణిరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా గురువారం ఒంగోలు ఫెర్టికేర్ సెంటర్‌లో వారు మాట్లాడుతూ సంతానంలేని దంపతులకు ఎంతో సురక్షితమైన ఐవీఎఫ్ విధానం ఒక వరమన్నారు. తొలి టెస్ట్ ట్యూబ్ బేబీ జన్మించిన జూలై 25ను ప్రతి సంవత్సరం ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అందుబాటులో ఉన్న ఐవీఎఫ్ విధానం ఎంతో సురక్షితమైనదని, కచ్చితమైన ఫలితాలు ఇస్తుందన్నారు. సంతానలేమితో బాధపడే ప్రతి ఒక్కరు ఐవీఎఫ్ విధానం ఉపయోగించుకుని సంతానం పొందవచ్చని వైద్యులు తెలిపారు.

4లోపు డీఈఎల్‌ఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు(విద్య), జూలై 25 : జిల్లాలోని ప్రైవేటు డిప్లమో ఇన్‌ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) కళాశాలల్లో చదువుతున్న 2018-20 బ్యాచ్ మేనేజ్‌మెంట్ కోటా, స్పాట్ అడ్మిషన్ మొదటి సంవత్సరం విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు ఎటువంటి అపరాధరుసుం లేకుండా ఆగస్టు 4లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 రుసుంతో ఆగస్టు 15 వరకు పరీక్ష ఫీజుచెల్లించవచ్చు. నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.140, రెండు సబ్జెక్టులకు రూ.120, ఒక సబ్జెక్టుకు రూ.100 పరీక్ష ఫీజు చెల్లించాలి. విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరుకావాలని డీఈవో కోరారు.

వెబ్‌సైట్‌లో పీఏటీ పరీక్షా ఫలితాలు

జిల్లాలో ఈ ఏడాది మార్చి 3న జరిగిన ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్ (పీఏటీ) పరక్షా ఫలితాలు బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెబ్‌సైటలో ఉంచినట్లు డీఈవో సుభద్ర తెలిపారు. అభ్యర్థులు తమ ఫలితాలను చూసుకోవాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

ఒంగోలు(క్రైం), జూలై 25: ఒంగోలు నగరం మామిడిపాలెం చెరువు సమీపంలో రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వెలుగులోకి వచ్చింది. గురువారం సాయంత్రం సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెంది ఉన్నాడు. అయితే మృతదేహం పరిశీలించిన తరువాత రెండు లేదా మూడు రోజులు క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అయితే మృతికి గల కారణం తెలియాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. పోస్టుమార్టం అనంతరం వివరాలు తెలిసే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.


3వ తేదీలోపు వేతన బకాయిలు చెల్లించాలి



నాయకులతో చర్చలు జరుపుతున్న కమిషనర్ కనకదుర్గాభవాని

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 25 : ఆర్టీసీలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వేతన బకాయిలను ఆగస్టు 3లోపు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్మికశాఖ కమిషనర్ కె.కనకదుర్గాభవాని ఆదేశించారు. ఒంగోలులోని కార్మికశాఖ కార్యాలయంలో ఆర్టీసీ డిపోమేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఎల్.కోటేశ్వరరావు, కార్మికుల పక్షాన సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, స్టాఫ్ అండ్ వర్కర్స్ రీజియన్ అధ్యక్షుడు బీవీ.రావులతో గురువారం చర్చలు జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న కనకదుర్గాభవాని మాట్లాడుతూ ఆర్టీసిలోని గ్యారేజీలలో పనిచేస్తున్న కార్మికులకు ఏడాది కాలంగా వేతనాలు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ బకాయిలను చెల్లించడంతో పాటు ఆరునెలలకు ఒకసారి డీఏ లెక్కకట్టి వేతనాలు ఇవ్వాలని ఆదేశించారు.

డిజిటల్ ఎడ్యుకేషన్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న భరధ్వాజ

సంతనూతలపాడు, జూలై 25: చాత్రోపాధ్యాయులు డిజిటల్ ఎడ్యుకేషన్, స్కిల్ డెవలెప్‌మెంట్‌పై అవగాహన కలిఉండాలని జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి భరధ్వాజ, జిల్లా నైపుణ్యాధికారి రవితేజయాదవ్ పేర్కొన్నారు. గురువారం మైనంపాడు డైట్ కళాశాలలో చాత్రోపాధ్యాయులకు డిజిటల్ ఎడ్యుకేషన్, స్కిల్ డెవలెప్‌మెంట్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ప్రపంచంలో మారుతున్న పరిస్థితులకు అనువుగా ఎప్పటికప్పుడు కొత్త స్కిల్స్‌ను నేర్చుకుని ఉండాలన్నారు. కార్యక్రమానికి డైట్ కళాశాల ఇన్‌చార్జ్ అధికారి ఎస్.సుబ్బారావు అధ్యక్షత వహించారు. డైట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ అధ్యక్షుడి మృతికి పలువురు నివాళి

కొండపి, జూలై 25 : మండలంలోని అనకర్లపూడి గ్రామ టీడీపీ అధ్యక్షుడు చెరుకూరి బ్రహ్మయ్య(75) గురువారం ఉదయం గ్రామంలోని స్వగృహంలో అనారోగ్యంతో మరణించారు. బ్రహ్మయ్య దాదాపు 30 ఏళ్లుగా టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా పనిచేశారు. బ్రహ్మయ్య మరణవార్త తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు వెంటనే గ్రామానికి వెళ్లి అతని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే టీడీపీ ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, నాయకులు బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, చాగంరెడ్డి నరసారెడ్డి, కొర్రపాటి వసంతరాయుడు నివాళులర్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ ఆనంద్‌మోహన్

మద్దిపాడు, జూలై 25: ప్రజలు సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ఆనంద్ మోహన్ పేర్కొన్నారు. గురువారం మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. ప్రధానంగా దోమల దోమకాటు ద్వారా డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు సంభవిస్తాయన్నారు. దోమతెరలు వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో లలితమ్మ, రజికకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.





అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల అలంకరణలు

ఘనంగా శ్రీనాంచారమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణ వాహనంలో గ్రామంలో విహరిస్తున్న అమ్మవారు

కొత్తపట్నం(ఒంగోలు నగరం) జూలై 25: కొత్తపట్నంలో వేంచేసి ఉన్న శ్రీ నాంచారమ్మ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామంలో ఈ సందర్భంగా పెద్దఎత్తున విద్యుత్ వెలుగులతో వీధులన్నీ శోభాయమానంగా వెలిగిపోతున్నాయి. శ్రీనాంచారమ్మ తిరునాళ్ల ఈనెల 24వ తేదీన ప్రారంభం కాగా 28వ తేదీ వరకు జరగనుంది. శ్రీనాంచారమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రతి రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయాన్ని శోభామానంగ అలంకరించారు. గురువారం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. గ్రామ ప్రజలు అడుగడుగునా హారతి పట్టారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు కొత్తపట్నం విచ్చేశారు. తమ బంధువర్గాలను కూడా కొత్తపట్నంవాసులు తమ గ్రామానికి ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం అంగరంగ వైభవంగా అమ్మవారిని సేవలతో అలరింపు జేయనున్నారు. పొంగళ్లు, పసుపు బండ్లు ఏర్పాటు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



దేవతామూర్తుల వేషధారణలో కళాకారుల ప్రదర్శనలు

కొత్తపట్నం రెడ్డిపాలెంవాసులు ప్రతి ఏటా అమ్మవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించటం ఆ నవాయితీగా వస్తోంది.

ప్రతి గ్రామానికీ తాగునీరు ఇవ్వాలి

కలెక్టరు అన్సారియా

ముటుకుల పాఠశాలలో భోజనం నాణ్యత లేకపోవడంపై ఆగ్రహం

పుల్లలచెరువు , ఎర్రగొండపాలెం మండలాల్లో విస్తృత పర్యటన

పుల్లలచెరువు, జూలై 25: మూడు మండలాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ముటుకుల ప్రాజెక్టు నుంచి ప్రతి గ్రామానికి తాగు నీరు అందించాలని కలెక్టరు తమీమ్ అన్సారియా అధికారులకు స్పష్టం చేశారు. గురువారం పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం మండలాల్లో ఆమె పర్యటించారు. ముందుగా పుల్లలచెరువు మండలంలోని ముటుకుల తాగు నీటి ప్రాజెక్టును పరిశీలించారు. 15 ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసిన ముటుకుల తాగు నీటీ పథకాన్ని పరిశీలించి ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు.మొత్తం 43 గ్రామాలకు నీరు అందించాల్సి ఉండగా 23 గ్రామాలకు నీరు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు సాగర్ జలాలను నింపి ప్రతి గ్రామానికి నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తెల్లగట్ల సంప్‌ను పరిశీలించి స్థానికులను ప్రాజెక్టు పరిస్థితి గురించి వివరాలు అడిగారు. 15 ఏళ్ళ క్రితం ప్రాజెక్టును కట్టినా నేటికీ నిరుపయోగంగా ఉంది తప్ప సక్రమంగా నీరు ఇచ్చిన చరిత్ర లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సమయ పాలనలేకుండా నీరు ఇచ్చినా గ్రామాల్లోని కుళాయిలకు కనెక్షన్ లేకపోవడంతో అదంతా నిరుపయోగంగా పోతోందని కలెక్టర్‌కు తెలిపారు. ముటుకుల ప్రాజెక్టుకు కంచె లేకపోవడంతో పశువులు అందులో పడుతున్నాయని, ప్రాజెక్టు ట్యాంకు చూట్టూ కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.



ముటుకుల పాఠశాలలో విద్యార్థిని సామర్థ్యాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టరు అన్సారియా

నాణ్యమైన విద్య, ఆహారం అందించాలి

ముటుకుల ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థు సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. సమస్యలను స్వయంగా ఆమె పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం కోసం తయారు చేసిన పులిహోరను స్వయంగా రుచి చూశారు. నాణ్యత లేకపోవడంతో హెచ్ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజూ ముందుగా హెచ్ఎం రుచి చూచిన తరువాతే విద్యార్థులకు భోజనం వడ్డించాలని ఆదేశించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి వారి తరగతులకు తగినట్టు విద్య ప్రమాణాలు లేకపోవడంతో టీచర్లపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల డ్రాప్‌అవుట్‌లు లేకుండా చూడాలని కోరారు. స్థానికులు తమ పాఠశాలలో టీచర్ల కొరత ఉందని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పుల్లలచెరువు, చిన్న కండ్లేరు చెరువును పరిశీలించి చెరువు గురించి ఆరా తీశారు. రెండేళ్ల క్రితం చెరువుకు గండి పండిందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి శాశ్వత పనులు చేపట్టాలని కోరారు.



ముటుకుల ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టరు అన్సారియా

గిరిజన సమస్యలను పరిష్కరిస్తాం

అనంతరం ఎర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెం పంచాయతీలోని చెంచుగూడేల్లో ఆమె పర్యటించారు. అనంతరం చెంచులతో కుర్చొని వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంకటాద్రిపాలెం చెంచు పునరావాస కేంద్రంలో సాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చి భూములలో బోర్లు వేయించాలని కోరారు. అనంతరం టీడీపీ మండలాధ్యక్షుడు చేకూరి సుబ్బయ్య తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ఆమెకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టరు రాహుల్ మీనా, ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్ధన్ అలీ, డీఎల్‌డీవో సాయికుమార్, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.



గిరిజన సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టరు

డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సుపై ఉచిత శిక్షణ

అద్దంకిటౌన్, జూలై 25 : అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గురువారం ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఆపై చదువుకున్న 18-35 ఏళ్ల వయస్సు నిరుద్యోగులు అర్హులని, వివరాలకు 9542970871 నెంబరులో సంప్రదించాలన్నారు.

మా పెట్టుబడి నిధి మాటేంటి..?

సీఎంఎంని నిలదీసిన స్వయం సంఘాల సభ్యులు ● పొంతనలేని సమాధానాలపై మహిళల ఆగ్రహం

అద్దంకి, జూలై 25 : మెప్మా స్వయం సహాయక సంఘాల సభ్యుల పెట్టుబడి నిధిలో నిర్వహించిన మహిళా మార్ట్ మూత పడగా ఇంతవరకు సభ్యులకు పెట్టుబడి డబ్బులు పంపిణీ చేయలేదు. దీంతో ఆగ్రహించిన స్వయం సహాయక సంఘాల సభ్యులు గురువారం మెప్మా కార్యాలయానికి వెళ్లి సీఎంఎం ఫణికుమారిని నిలదీశారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో తిట్ల దండకం చేపట్టారు. అద్దంకి పట్టణంలోని సుమారు 8వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి రూ.150 చొప్పున వసూలు చేసి సుమారు రూ.11లక్షల పెట్టుబడి నిధితో మహిళా మార్ట్‌ను రెండున్నర సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇంతవరకు సభ్యులకు జమా ఖర్చులు చెప్పిన దాఖలాలు లేవు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మహిళా మార్ట్ నిర్వహిస్తున్న భవనం గతంలో అన్న క్యాంటీన్‌ను నిర్వహించారు. తిరిగి దానిలో అన్న క్యాంటీన్ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతుండడంతో మహిళా మార్ట్‌ను మూసివేశారు. అయితే మహిళా మార్ట్‌కు సంబంధించి నిధులు గోల్‌మాల్ జరిగాయన్న ఆరోపణలు రావడం, అందుకు సంబంధించి జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందడంతో ఇటీవల విచారణలు జరిగాయి. ఈ నేపథ్యంలో తమ పెట్టుబడి డబ్బుల పరిస్థితి ఏమిటని సమారు 200మంది సభ్యులు గురువారం మెప్మా కార్యాలయం వద్దకు వెళ్లి నిలదీశారు. సీఎంఎం సరైనా సమాధానం చెప్పడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి తమ పెట్టుబడి డబ్బులు తమకు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని సభ్యులు కోరుతున్నారు. వెంటనే పరిష్కార మార్గం చేపట్టకపోతే మిగిలిన సభ్యులంతా ఆందోళనకు దిగేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది.



సీఎంఎం ఫణికుమారిని ప్రశ్నిస్తున్న మెప్మా సంఘాల సభ్యులు

జడ్పీటీసీ సభ్యుడు అల్లుడు అదృశ్యంపై కేసు

● రాత్రికి ఇంటికి చేరిక

ఈపూరుపాలెం(చీరాలటౌన్) జూలై 25 : చీరాల మండలం జడ్పీటీసీ సభ్యుడు అల్లుడు మాజీ ఎంపీపీ కుమారుడు అదృశ్యంపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల వైసీపీ జడ్పీటీసీ సభ్యుడు ఆకురాతి పద్మిని కుమార్తె ప్రసన్నను మాజీ ఎంపీపీ కుమారుడు గంజి ప్రసాద్ కుమారుడు సుబ్బారావుతో వివాహం జరిగింది. రెండు కుటుంబాలు ఈపూరుపాలెంలోనే ఉంటున్నారు. కొద్ది రోజులుగా ఇంట్లో వివాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో సుబ్బారావు గత సోమవారం ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. అన్నిచోట్ల వెదికినా ఆచూకీ తెలియలేదు. గురువారం ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించారు. భార్య ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రాత్రి అయ్యేసరికి అతనే ఇంటికి తిరిగి వచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.

చేనేతల సమస్యలను పరిష్కరించాలి

● మంత్రి సవితకు విజ్ఞప్తి

చీరాల, జూలై 25 : రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవితను గురువారం అమరావతిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతో కలసి చీరాల చేనేత ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చీరాల నియోజకవర్గంలో నేతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. స్థానిక స్థితిగతులను వివరించారు. అందుకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. నేతన్నల పక్షాన ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ తమ నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు చీరాల ప్రాంత చేనేత ప్రతినిధులు పాల్గొన్నారు.

అద్దంకి ఊరచెరువుపై సమగ్ర సర్వే

అద్దంకి, జూలై 25 : అద్దంకి పట్టణంలో అంతర్భాగంగా మారిన ఊర చెరువు పెద్ద ఎ త్తున ఆక్రమణలకు గురైంది. గతంలో ఎన్‌టీఆర్‌నగర్ పేరుతో పలువురు పేదలకు ఇళ్ల స్థలాలను ఇచ్చారు. వైసీపీ పాలనలో పలువురు వైసీపీ నేతలు మరికొంత భాగాన్ని ఆక్రమించి ఇళ్ల స్థలాలుగా అమ్మకాలు చేశారు. ఆంధ్ర జ్యోతిలో కథనాలు రావడంతో ఇటీవల జాయింట్ కలెక్టర్ సుబ్బారావు పరిశీలించి పూర్తి స్థా యిలో సర్వే చేసి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం ఇన్‌చార్జి తహసీల్దార్ సుధారాణి ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. సర్వేయర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఉత్తర అద్దంకి రెవెన్యూ పరిధిలోని 95 సర్వే నెంబరులో ఉన్న సుమారు 120ఎకరాల ఊర చెరువు సరిహద్దుల నిర్ధారణ సర్వే నిర్వహిస్తున్నారు. ఆర్ఐ శంకర్ ఆధ్వర్యంలో 6 బృందాలు ఇంటింటి సర్వే చేస్తూ నివాస ప్రాంతాలు, కుటుంబాల వివరాలను సేకరిస్తున్నారు.

గ్రావెల్ తవ్వకం అడ్డగింత

అద్దంకి, జూలై 25 : మండలంలోని కలవకూరు చెరువులో గ్రావెల్ తవ్వకాన్ని గ్రామస్థులు గురువారం అడ్డుకున్నారు. చెరువులో మట్టిని అద్దంకి పట్టణంలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లకు టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేతల ఆధ్వర్యంలో గ్రామస్థులు అడ్డుకున్నారు. అయితే గతంలో మట్టి తరలింపు యథేచ్ఛగా జరిగినా మిన్నకున్న గ్రామస్థులు అడ్డుకోవటం పట్ల పలు అనుమానాలకు తావిస్తున్నది.

కోమలి ఫెర్టిలిటీ సెంటర్‌లో ఐవీఎఫ్ దినోత్సవం

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 25: ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం పురస్కరించుకుని ఒంగోలులోని కోమలి ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో సంతానం లేని దంపతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లోని కోమలి ఫెర్టిలిటీ సెంటర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కన్సల్టెంట్ డాక్టర్ ప్రతిమ మాట్లాడుతూ తక్కువ వ్యవధిలో పిల్లలు లేని దంపతులకు అధునాతన సాంకేతికతో సంతానోత్పత్తి చికిత్స పొందిన 200 మందికి పైగా జంటలకు పిల్లలును పుట్టించి వారి మోములో చిరునవ్వులు చూశామన్నారు. సంతానలేమి బాధ లేకుండా కోమలి ఫెర్టిలిటీ సెంటర్ ద్వారా దంపతులకు సంతానం కలగజేయడం కోమలి ఫెర్టిలిటీతోనే సాధ్యమని తెలిపారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ పి.రమేష్, వైద్యులు డి.దీపా, సీవో డాక్టర్ హరికుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

● సీఎంను కలిసి విన్నవించిన ఎరిక్షన్ బాబు

పుల్లలచెరువు, జూలై 26: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలతో పాటు ప్రధానంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీఎం చంద్రబాబును టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో సీఎం కలిసి నియోజకవర్గంలో సమస్యలు,చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ప్రధానంగా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉన్నదని, దాన్ని పరిష్కరించేందుకు నిధులు కేటాయించాలని విన్నవించారు. నియోజకవర్గంలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ప్రధానంగా ఎర్రగొండపాలెం-త్రిపురాంతకం,ఎర్రగొండపాలెం -పుల్లలచెరువు, గ్రామాల్లోని లింకు రోడ్డులు పాడైపోయాయని అన్నారు. సంక్షేమ హాస్టళ్ల అధ్వానంగా ఉన్నాయని విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు.పుల్లలచెరువు మండలానికి వరప్రదాయని అయిన వెలిగొండ తీగలేరును చిన్న కండ్లేరుకు అనుసంధానం చేయాలని సీఎంను కోరినట్లు ఆయన తెలిపారు.అన్ని విషయాలకు సీఎం సానుకూలంగా ఉన్నారని ఆయన తెలిపారు.

విద్యుత్ తీగలకు దూరంగా ఇళ్లు నిర్మించుకోవాలి

● ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

కనిగిరి, జూలై 25: నూతన గృహాలను తప్పనిసరిగా విద్యుత్ లైనుకు మూడు మీటర్లకు దూరంగా నిర్మించుకోవాలని గుంటూరు విద్యుత్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ (ఈఐ) ప్రసాద్ పేర్కొన్నారు. కనిగిరి ఈఈ కార్యాలయంలో గురువారం రాత్రి విద్యుత్ ప్రమాదాలపై అధికారుల, సిబ్బందితో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ శరీరం 50 వోల్టేజీ కంటే ఎక్కువ ఉన్న విద్యుత్‌ను తట్టుకోలేదన్నారు. విద్యుత్ సప్లయి అంతకంటే ఎక్కువ కావటంతో విద్యుత్ షాక్‌కు గురైనప్పుడు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ లైన్‌లకు తగిలే చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. వాణిజ్య సముదాయాల వద్ద విద్యుత్ తీగలు షాపులకు ఆనుకుని ఉన్న వాటిని గుర్తించి సంబంధిత యజమానికి అవగాహన కల్పించాలన్నారు. వర్షాల సమయంలో సప్లయి తొలగించినప్పటికి తెగిపడిన విద్యుత్ తీగలను తాకకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈఈ హరిబాబు, డీఈఈ ఉమాకాంత్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

పీసీపల్లి, జూలై 25: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణారావు మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పీసీపల్లి ఎంపీడీవో వెంకటసుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం పీసీపల్లి మండల పరిషత్ కార్యాలయంలో వెంకటరమణారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సంజీవి, ఆర్.శ్రీని వాసులు, ఆర్‌డబ్ల్యూసీ ఏఈ మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వాలంటూ కార్మికుల నిరసన

కొమరోలు, జూలై 25 : జీతాలు ఇవ్వాలని కొమరోలు గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తంచేస్తూ విధులు నిర్వహించకపోవడంతో పంచాయతీలో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్దిరోజుల కిందట గ్రీన్ అంబాసిడర్స్ వారం రోజులు పనిచేయకుండా నిరసన వ్యక్తం చేయగా డీపీవో ఉషారాణి ఆదేశాల మేరకు 10 నెలల జీతాలు ఇచ్చారు. మిగిలిన జీతాలు కూడా త్వరగా చెల్లిస్తామని చెప్పారు. వారం గడిచిన అనంతరం మళ్లీ కార్మికులు నిరసనకు దిగారు. దీంతో సోమవారం జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి స్వయంగా కొమరోలు గ్రామ పంచాయతీని సందర్శించి కార్మికులు, అధికారులతో మాట్లాడారు. సర్పంచ్‌తో వారంలోపు గ్రీన్‌అంబాసిడర్స్‌కు పూర్తిగా జీతాలు చెల్లించాలని, టెండర్ కార్మికులకు పన్నులు వసూలు చేసి వెంటనే ఇవ్వాలని తెలిపారు. అయినా కార్మికులు మాకు జీతాలు ఇచ్చేవరకు పనులకు రామని తేల్చి చెప్పారు. దీంతో గ్రామంలోని చెత్త కుప్పలు తెప్పలుగా ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి గ్రామానికీ తాగునీరు ఇవ్వాలి

● కలెక్టర్ అన్సారియా

ముటుకుల పాఠశాలలో భోజనం నాణ్యత లేకపోవడంపై ఆగ్రహం

పుల్లలచెరువు , ఎర్రగొండపాలెం మండలాల్లో విస్తృత పర్యటన

పుల్లలచెరువు, జూలై 25: మూడు మండలాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ముటుకుల ప్రాజెక్టు నుంచి ప్రతి గ్రామానికి తాగు నీరు అందించాలని కలెక్టరు తమీమ్ అన్సారియా అధికారులకు స్పష్టం



ముటుకుల పాఠశాలలో విద్యార్థి సామర్థ్యాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టరు తమీమ్ అన్సారియా

చేశారు. గురువారం పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం మండలాల్లో ఆమె పర్యటించారు. ముందుగా పుల్లలచెరువు మండలంలోని ముటుకుల తాగు నీటి ప్రాజెక్టును పరిశీలించారు. 15 ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసిన ముటుకుల తాగు నీటి పథకాన్ని పరిశీలించి ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు.మొత్తం 43 గ్రామాలకు నీరు అందించాల్సి ఉండగా 23 గ్రామాలకు నీరు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు సాగర్ జలాలను నింపి ప్రతి గ్రామానికి నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తెల్లగట్ల సంప్‌ను పరిశీలించి స్థానికులను ప్రాజెక్టు పరిస్థితి గురించి వివరాలు అడిగారు. 15 ఏళ్ళ క్రితం ప్రాజెక్టును కట్టినా నేటికీ నిరుపయోగంగా ఉంది తప్ప సక్రమంగా నీరు ఇచ్చిన చరిత్ర లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సమయ పాలనలేకుండా నీరు ఇచ్చినా గ్రామాల్లోని కుళాయిలకు కనెక్షన్ లేకపోవడంతో అదంతా నిరుపయోగంగా పోతోందని కలెక్టర్‌కు తెలిపారు. ముటుకుల ప్రాజెక్టుకు కంచె లేకపోవడంతో పశువులు అందులో పడుతున్నాయని, ప్రాజెక్టు ట్యాంకు చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.

నాణ్యమైన విద్య, ఆహారం అందించాలి

ముటుకుల ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థు సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. సమస్యలను స్వయంగా ఆమె పరిశీలించారు.అనంతరం మధ్యాహ్నం భోజనం కోసం తయారు చేసిన పులిహోరను స్వయంగా రుచి చూశారు. నాణ్యత లేకపోవడంతో హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజూ ముందుగా హెచ్‌ఎం రుచి చూచిన తరువాతే విద్యార్థులకు భోజనం వడ్డించాలని ఆదేశించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి వారి తరగతులకు తగినట్టు విద్య ప్రమాణాలు లేకపోవడంతో టీచర్లపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల డ్రాప్‌అవుట్‌లు లేకుండా చూడాలని కోరారు. స్థానికులు తమ పాఠశాలలో టీచర్ల కొరత ఉందని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పుల్లలచెరువు, చిన్న కండ్లేరు చెరువును పరిశీలించి చెరువు గురించి ఆరా



ముటుకుల ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టరు తమీమ్ అన్సారియా,అధికారులు



ఎర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలెం గిరిజనుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టరు తమీమ్ అన్సారియా

తీశారు. రెండేళ్ల క్రితం చెరువుకు గండి పండిందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి శాశ్వత పనులు చేపట్టాలని ఆమెను కోరారు.

గిరిజన సమస్యలను పరిష్కరిస్తాం

అనంతరం ఎర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెం పంచాయతీలోని చెంచుగూడేల్లో ఆమె పర్యటించారు. అనంతరం చెంచులతో కుర్చొని వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంకటాద్రిపాలెం చెంచు పునరావాస కేంద్రంలో సాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చి భూములలో బోర్లు వేయించాలని కోరారు. అనంతరం టీడీపీ మండలాధ్యక్షుడు చేకూరి సుబ్బయ్య తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ఆమెకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టరు రాహుల్ మీనా, ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్థన్ అలీ, డీఎల్‌డీవో సాయికుమార్, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

సుదర్శన క్రియతో సంపూర్ణ ఆరోగ్యం

గిద్దలూరు, జూలై 25 : నిత్యం యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ మాలకొండమ్మ అన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో యూత్ ఎంపవర్‌మెంట్ సెమినార్ కార్యక్రమం పాఠశాలలో జరిగింది. విద్యార్థినులతో యోగాసనాలు వేయించి నేర్పించారు. సుదర్శన క్రియ, ఇతర ప్రాణాయామాల ఉపయోగాలను వివరించి వారితో సాధన చేయించారు. నిత్యం యోగా సాధన చేస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని, ఒత్తిడిని అధిగమించవచ్చని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో యోగా గురూజీలు నారాయణ రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

బడ్జెట్‌లో మైనార్టీలను విస్మరించిన మోదీ

పొదిలి, జూలై 25 : కేంద్ర బడ్జెట్ కేటాయింపులో మోదీ ప్రభుత్వం మైనార్టీలను విస్మరించారని ఏపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ సైదా అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపులో తన సహజసిద్ధ వైఖరితో మైనారిటీలపై వివక్ష చూపారన్నారు. అనేక పథకాలకు కోతలు విధించి కోట్లాదిమంది మైనారిటీలకు అన్యాయం చేశారని విమర్శించారు. దేశంలో మైనారిటీలు అధికంగా నివశించే ప్రాంతాల్లో అభివృద్ధి లోటు పూడ్చేందుకు ఉద్దేశించిన కార్యక్రమం ప్రధానమంత్రి జనవికాస్ పథకానికి బడ్జెట్‌లో జరిగిన కేటాయింపులే ఇందుకు నిదర్శనమన్నారు. 2014- 2024 కేటాయింపులు చూస్తుంటే సుమారుగా 20శాతం కోతకు గురైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



ఆధార్ కార్డు అందజేస్తున్న కమిషనర్ కిరణ్

ఆధార్ సేవలు వినియోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 25: ప్రభుత్వం అందిస్తున్న ఆధార్ సేవలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్ అన్నారు. పట్టణంలోని 17, 18 సచివాలయాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోదలచిన వారు అప్డేట్ చేయించుకోవాల్సిన వారు ఈ ఆధార్ కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. విద్యుత్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసన్, సీనియర్ అసిస్టెంట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గిద్దలూరు, జూలై 25 : వర్షాలు పడుతున్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే దోమల ఉధృతి పెరిగి జ్వరాల బారిన పడాల్సి వస్తుందని వైద్యాధికారులు డాక్టర్ షరీఫ్, డాక్టర్ భార్గవ్ అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వైద్యాధికారులు పట్టణంలోని పలు ప్రాంతాలకు స్వయంగా వెళ్ళి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలలో దోమల నివారణ మందులను పిచికారీ చేయించారు. కాచివడపోసిన నీటిని మాత్రమే తాగాలని ప్రజలకు సూచించారు. వర్షం నీరు ఇళ్ళ చుట్టూ, వీధుల్లో నిలువ ఉండకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. అజాగ్రత్త వహిస్తే చికున్‌గున్యా, డెంగ్యూ, మలేరియా లాంటి తీవ్ర వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని ప్రజలకు సూచించారు. చిన్నపాటి అనారోగ్యం కలిగినా వెంటనే ఆసుపత్రులకు వెళ్ళి వైద్యుల సలహామేరకు చికిత్సలు పొందాలని సూచించారు.



కొమరోలులో చెత్తకుప్పల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జీతాలు ఇవ్వాలని కార్మికుల నిరసన

కొమరోలు, జూలై 25 : జీతాలు ఇవ్వాలని కొమరోలు గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తంచేస్తూ విధులు నిర్వహించకపోవడంతో పంచాయతీలో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్దిరోజుల కిందట గ్రీన్ అంబాసిడర్స్ వారం రోజులు పనిచేయకుండా నిరసన వ్యక్తం చేయగా డీపీవో ఉషారాణి ఆదేశాల మేరకు 10 నెలల జీతాలు ఇచ్చారు. మిగిలిన జీతాలు కూడా త్వరగా చెల్లిస్తామని చెప్పారు. వారం గడిచిన అనంతరం మళ్లీ కార్మికులు నిరసనకు దిగారు. దీంతో సోమవారం జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి స్వయంగా కొమరోలు గ్రామ పంచాయతీని సందర్శించి కార్మికులు, అధికారులతో మాట్లాడారు. సర్పంచ్‌తో వారం లోపు గ్రీన్‌అంబాసిడర్స్‌కు పూర్తిగా జీతాలు చెల్లించాలని, టెండర్ కార్మికులకు పన్నులు వసూలుచేసి వెంటనే ఇవ్వాలని తెలిపారు. అయినా కార్మికులు మాకు జీతాలు ఇచ్చేవరకు మేము పనులకు రామని తేల్చి చెప్పారు. దీంతో గ్రామంలోని చెత్త ఎక్కడికక్కడే కుప్పలు తెప్పలుగా ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది.ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

నీటి ట్యాంకర్ ఏర్పాటు

గిద్దలూరు, జూలై 25 : రాచర్ల మండలం అక్కపల్లి గ్రామంలో నీటిసమస్యకు పరిష్కారం చూపారు.3 నెలలుగా నీటిసమస్య ఏర్పడగా ఎవరూ పట్టించుకోలేదని, ఖాళీ బిందెలతో గ్రామస్థులు నిరసనకు దిగారు. దాంతో స్పందించిన సర్పంచ్ గోతం వెంకటనారాయణ, పంచాయతీ కార్యదర్శి వి.అనీల్‌కుమార్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. ట్యాంకర్ ద్వారా తగినంత నీటిని అందిస్తామని, నీటి సమస్య పరిష్కారం అయ్యే వరకు ట్యాంకర్ ఏర్పాటు చేస్తామని పేర్కొనడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

పెద్ద దోర్నాల,జూలై 25: దోర్నాల మండల నూతన ఇన్‌చార్జి తహసీల్దారుగా కే దాస్ గురువారం ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తహసీల్దారుగా వచ్చి ఇప్పటి వరకు పని చేసిన హమీద్ నెల్లూరుకు వెళ్లారు. పెద్దారవీడు మండల తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న కే దాస్‌ను ఇన్‌చార్జిగా నియమించడంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పట్టణానికి చెందిన పలువురు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు(విద్య), జూలై 25: ప్రభుత్వ, ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలల్లో పాలిసెట్-24 తుదిదశ కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ గురువారం తెలిపారు. ఏ కళాశాలలో ఎన్ని సీట్లు ఖాళీ ఉంది, బ్రాంచి వారీగా ఈనెల 27న నోటీసుబోర్డులో ప్రకటిస్తారు. నోటీసుబోర్డులోని ఖాళీల ఆధారంగా విద్యార్థులు ఏ కళాశాలలో, ఏ బ్రాంచిలో చేరతారో నిర్ణయించుకుంటారు. విద్యార్థులు ఈనెల 31న తమ ఒరిజనల్ విద్యార్హతల సర్టిఫికెట్లతో తాము చేరదల్చుకున్న కళాశాలలో హాజరుకావాలి. ప్రవేశ రుసుం లేకుండా అప్పుడే చెల్లించాలి. విద్యార్థులు ట్యూషన్ ఫీజుగా రూ.4700 చెల్లించాలి. కౌన్సెలింగ్ ఫీజు కింద ఓసీ, బీసీ విద్యార్థులు పాలిసెట్‌లో ర్యాంకు సాధించిన వారు రూ.700, ర్యాంకు సాధించని వారు రూ.1100, ఎస్సీ, ఎస్టీలు అయితే ర్యాంకు సాధించిన వారు రూ.250, ర్యాంకు సాధించని వారు రూ.350 ఫీజు చెల్లించాలి. స్పాట్ అడ్మిషన్లలో పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం పొందిన వారు ఫీజు రీఎంబర్స్‌మెంట్ వర్తించదని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

4లోపు డీఈఎల్ఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు(విద్య), జూలై 25 : జిల్లాలోని ప్రైవేటు డిప్లమో ఇన్‌ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) కళాశాలల్లో చదువుతున్న 2018-20 బ్యాచ్ మేనేజ్‌మెంట్ కోటా, స్పాట్ అడ్మిషన్ మొదటి సంవత్సరం విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు ఎటువంటి అపరాధరుసుం లేకుండా ఆగస్టు 4లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో సుబ్రద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 రుసుంతో ఆగస్టు 15 వరకు పరీక్ష ఫీజుచెల్లించవచ్చు. నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.140, రెండు సబ్జెక్టులకు రూ.120, ఒక సబ్జెక్టుకు రూ.100 పరీక్ష ఫీజు చెల్లించాలి. విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరుకావాలని డీఈవో కోరారు.

వెబ్‌సైట్‌లో పీఏటీ పరీక్షా ఫలితాలు

జిల్లాలో ఈ ఏడాది మార్చి 3న జరిగిన ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్ (పీఏటీ) పరీక్షా ఫలితాలు బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెబ్‌సైటలో ఉంచినట్లు డీఈవో సుబ్రద్ర తెలిపారు. అభ్యర్థులు తమ ఫలితాలను చూసుకోవాలని కోరారు.

అధ్వానంగా పారిశుధ్యం

● రోడ్డుపై నిలిచిన మురుగు నీరు
● దోమల వ్యాప్తితో రోగాలు

మార్కాపురం రూరల్, జూన్ 25: మండలంలోని మాల్యవంతునిపాడు గ్రామంలో రోడ్డుపై మురుగునీరు నిలిచిపోయింది. దీంతో గ్రామంలో రాకపోకలు సాగించాలంటే గ్రామస్థులు నానా అవస్థలు పడుతున్నారు. మురుగునీరు నిలిచిన ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతూ దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో పరిసర ప్రాంత ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు ప్రభుత్వం పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ప్రతిరోజు గ్రామస్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారులు ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో మురుగునీరు నెలలుగా నిల్వ ఉన్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



మాల్యవంతునిపాడు గ్రామంలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ఉరుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు

నీటిచెమ్మతో షాక్ కొడుతున్న గోడలు

కంభం, జూలై 25 : ఇటీవల కురిసిన వర్షాలకు కంభంలోని ఉద్యాన, మత్స్యశాఖ కార్యాలయం మొత్తం స్లాబ్, గోడల వెంట వర్షం నీరు కారుతూ పూర్తిగా చెమ్మపట్టింది. కార్యాలయంలోని బోర్డును, గోడలను ఎక్కడ పట్టుకున్నా కరెంటు షాక్ కొడుతున్నది. అధికారులు, సిబ్బంది, పని మీద వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం వరకు వ్యవసాయశాఖ గోడౌన్‌గా వినియోగిస్తున్న గదిని అధికారులు 5 సంవత్సరాల క్రితం ఓ వైపు ఉద్యానశాఖ, మరోవైపు మత్స్య శాఖలకు కేటాయించారు. ఈ గోడౌన్ శిథిలావస్థకు చేరి స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కార్యాలయం మొత్తం కారుతుండడం, గోడల వెంట కరెంటు సరఫరా అయి షాక్ కొడుతున్నది. బుధవారం ఉద్యానవన శాఖాధికారిణి శ్వేత స్విచ్ వేయగానే షాక్ తగిలింది. దీంతో ఆమె భయంతో బయటకు పరుగులు తీసింది. ఉన్నతాధికారులు స్పందించి మరోచోటికి కార్యాలయాలను మార్చాలని అధికారులు, సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.



కంభం ఉద్యానశాఖ కార్యాలయంలో స్లాబ్, గోడ వెంట దిగిన నీటిచెమ్మ

తాగునీటి సమస్యను పరిష్కరించండి

సీఎం చంద్రబాబును కలిసి విన్నవించిన ఎరిక్షన్ బాబు

పుల్లలచెరువు, జూలై 26: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలతో పాటు ప్రధానంగా తాగు నీటి సమస్యను పరిష్కరించాలని సీఎం చంద్రబాబును టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు.గురువారం అమరావతిలోని సచివాలయంలో సీఎం కలిసి నియోజకవర్గంలో సమస్యలు,చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ప్రధానంగా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉన్నదని, దాన్ని పరిష్కరించేందుకు నిధులు కేటాయించాలని విన్నవించారు. నియోజకవర్గంలోని రోడ్ లు అధ్వానంగా ఉన్నాయని, ప్రధానంగా ఎర్రగొండపాలెం-త్రిపురాంతకం,ఎర్రగొండపాలెం -పుల్లలచెరువు, గ్రామాల్లోని లింకు రోడ్డులు పాడైపోయాయని అన్నారు. సంక్షేమ హాస్టళ్ల అధ్వానంగా ఉన్నాయని విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. పుల్లలచెరువు మండలానికి వర ప్రదాయని అయిన వెలిగొండ తీగలేరును చిన్న కండ్లేరుకు అనుసంధానం చేయాలని సీఎంను కోరినట్లు ఆయన తెలిపారు.అన్ని విషయాలకు సీఎం సానుకూలంగా ఉన్నారని ఆయన తెలిపారు.



సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రాన్ని అందించి సమస్యను వివరిస్తున్న ఎరిక్షన్‌బాబు



ప్రధానోపాధ్యాయులకు చెక్కులు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి

తర్లుపాడు, జూలై 25: ఎస్సీ, బీసీ హాస్టల్లో ఉండి చదువుకునే విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓవీ వీరారెడ్డి అన్నారు. తర్లుపాడులో వసతి గృహాల్లో నివసిస్తున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆర్థిక సహాయం చెక్కును జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. సుధాకర్‌కు యూటీఎఫ్ నాయకులు అందజేశారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.చంద్రశేఖర్, ఆర్‌పీ నాసరయ్య, ఆర్.రంగనాయకులు, వి. కాశయ్య పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున రెడ్డి

ఎమ్మెల్యే చంద్రశేఖర్ వ్యాఖ్యలు హేయం

పెద్ద దోర్నాల, జూలై 25: ఎర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ అన్నక్యాంటీన్‌పై చేసిన వ్యాఖ్యలు హేయమైనవని టీడీపీ మండల అధ్యక్షులు ఏర్వ మల్లి కార్జునరెడ్డి ఆక్షేపించారు. ప్రజలు ఎంతో ఆశతో గెలిపించారని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాల్సింది పోయి, ప్రభుత్వం చేస్తున్న మంచి పథకాలను విమర్శించడం శోచనీయమన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే ఇక్కడ ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. వైసీపీ అధికారంలో ఉందని భ్రమలో ఉన్నట్లున్నారని ఆయన దెప్పిపొడిచారు. ఈ కార్యక్రమంలో బట్టు సుధాకర్ రెడ్డి, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య చంటి, చల్లా వెంకటేశ్వర్లు, కె రవికుమార్, గోవింద్, ఏసులు, కే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

పెద్దదోర్నాల,జూలై 25: మండల రెవెన్యూ శాఖల సంఘం నూతన కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయింది. మండల అధ్యక్షులుగా పూర్ణకంటి యాకోబ్, ఉపాధ్యక్షుడుగా నారాయణ, కార్యదర్శిగా చిన్న గురవయ్య కోశాధికారిగా పెద్ద కాశయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా బీ నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా తోకల వెంకటేశ్వర్లు, సభ్యులు పోలయ్య, సింగా రఘు, రవి, ప్రభుదాసు ఎన్నికయ్యారు.



ఎన్నికయిన కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే తాటిపర్తీ.. నోరు అదుపులో పెట్టుకో..

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 25 : అన్నక్యాంటీన్లపై అనుచిత వాఖ్యలు చేసిన యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌రెడ్డి నోరు అదుపు లో పెట్టుకోవాలని తెలుగు యువత నాయుకులు హెచ్చరించారు. గురువారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో వారు మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లో భో జనం చేసేవారంతా బిక్షగాళ్ళే అంటూ మాట్లాడటాన్ని పేద ప్రజలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు తప్పు పడుతున్నారని అన్నారు. బిర్యానీ హోటల్ పెట్టి వందల్లో దోచుకునే ఎమ్మెల్యే తన నోటికొచ్చినట్లు మాట్లాడితే ఆయన ఇల్లు ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ప్రజలకు చంద్రశేఖర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలుగుయువత ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావు, నల్లమోతు రమేష్ పాల్గొన్నారు.

ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు ముగిసిన కౌన్సెలింగ్

వేంపల్లె, జూలై 25: మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఒంగోలు ట్రిపుల్‌ఐటీ అడ్మిషన్ కౌన్సెలింగ్ గురువారం ముగిసింది. రెండవ రోజు డైరెక్టర్లు కుమారస్వామి గుప్త, భాస్కర్‌పటేల్ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరిగింది. మొత్తం 1035 మందికి కాల్‌లెటర్లు పంపగా 792 మంది హాజరై అడ్మిషన్లు పొందారు. మిగిలిన 242 సీట్లకు ఆగస్టు మొదటి వారంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్రకుమార్ సండ్ర తెలిపారు



ఇడుపులపాయ క్యాంపస్‌లో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న అధికారులు

యువకుడి హత్యకేసులో ముగ్గురికి జీవిత ఖైదు

ముద్దాయిలుగా హతుడి భార్య, అత్త, మరో యువకుడు

ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి

ఒంగోలు(క్రైం), జూలై 25: వివాహేతర సంబంధం కారణంగా యువకుడిని హత్య చేసిన ముగ్గురికి యావజ్జీవ కారగార శిక్ష విధిస్తూ ఒంగోలులోని ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి రాజా వెంకటాద్రి గురువారం తీర్పు నిచ్చారు. నిందితులు త్రిపురాంతకం మండల అన్నసముద్రం గ్రామానికి చెందిన శెట్టి బాలచెన్నయ్య, కురిచేడు మండలం దేకనకొండకు చెందిన చామల వెంకటసుబ్బులు, త్రిపురాంతకం మండలం గుట్టల ఉమ్మడివరానికి చెందిన మెడబలిమి నాగలక్ష్మిలపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు తోపాటుగా వెయ్యిరూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాషిక్యూషన్ కథనం మేరకు 2015 సంవత్సరంలో త్రిపురాంతకం మండలం గుంటల ఉమ్మడి వరంనకు చెందిన మె డబలిమి చిన అంజనేయులుకు, అన్నసముద్రం నకు చెందిన శెట్టి బాలచెన్నయ్య మద్యం తాగించి మండలబైలు వద్దకు తీసుకెళ్ళి హత్య చేశాడు. చిన అంజనేయులును హత్య చేసేందుకు అతని భార్య నాగలక్ష్మి, అత్త వెంకటసుబ్బులు, బాలచెన్నయ్యతో కలిసి పథకం రూపొందించారు. బాలచెన్నయ్యతో నాగలక్ష్మి, వెంకటసుబ్బులుకు ఉన్న వివాహేతర సంబంధానికి అడ్డులేకుండా చేసుకునేందుకు భర్తను హత్య చేసేందుకు కుట్ర పన్నారు. ఈక్ర మంలో నాగలక్ష్మి తన తల్లి, ప్రియుడుతో కలిసి ప్రణాళిక ప్రకారం భర్తను దారుణంగా హత్య చే యించింది. ఈ మేరకు హత్యా నేరం రుజువు కావడంతో న్యాయాధికారి ముగ్గురికి జీవిత ఖైదీ విధించారు. ప్రాషిక్యూషన్ తరుపున అదనపు పీపీ సి.శ్రీనివాస మూర్తి, న్యాయాధికారి జేహెచ్.జోషిన్ తమ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా హత్య కేసులో నిందితులకు శిక్షలు పడే విధంగా సాక్షాధారాలు సేకరించిన పోలీసు అధికారులు అప్పటి దర్శి డీఎస్పీ రాంబాబు, ప్రస్తుతం దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, అప్పటి దర్శి సీఐ రాఘవేంద్రరావులను ఎస్పీ అభినందించారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

» ఎస్పీ ఏఆర్ దామోదర్

దర్శి, జూలై 25: పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరిస్తామని, శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. గురువారం దర్శి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను పూర్తిగా అరికట్టేందుకు, దొంగతనాలు జరగకుండా నివారించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అమాయకులైన ప్రజలు న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో గౌరవంగా మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. సామాన్య ప్రజలకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసులమని, నేరస్తులకు, రౌడీలకు కాదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని పోలీసులను ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా టీడీపీ వర్గీయులపై దాడులు జరిగినప్పటికీ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి పట్టించుకోలేదని వస్తున్న విమర్శల గురించి విలేకరులు ప్రశ్నించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా జరిగిన అన్ని సంఘటనలను క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. భూ వివాదాలతో గొడవలు జరుగుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తేగా భూ వివాదాలు సివిల్ మ్యాటర్ అని అన్నారు. వాటివల్ల శాంతిభద్రతలకు సమస్య ఏర్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో దర్శి ఎస్సై సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.



దర్శి పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

తాళ్లూరు, జూలై 25: త్వరితగతిన పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సిబ్బందికి సూచించారు. గురువారం తాళ్లూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు విజుబుల్ పోలీసింగ్‌గా ఉండాలన్నారు. గ్రామాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగుచర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులు అధికంగా జరుగుతున్నందున పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. దుండగులను గుర్తించేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.విజయ్‌కుమార్, ఏఎస్ఐ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్లూరు స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న దామోదర్

నేరాల అదుపునకు పటిష్ట చర్యలు

ముండ్లమూరు, జూలై 25: నేరాల అదుపునకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో జరుగుతున్న గేదెల దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తిస్తామని చెప్పారు. దొంగతనాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్న నిందితులను పట్టుకొనేందుకు ఏఎస్పీ స్థాయి అధికారిని నియమిస్తామని చెప్పారు. నేరాల సంఖ్య గణనీయంగా తగ్గించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. రాత్రి సమయాల్లో గస్తీలు ముమ్మరం చేసి పూర్తిస్థాయిలో దొంగతనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మండలంలోని ఉల్లగల్లు పంచాయతీలోని రెడ్డినగర్‌లో 2019లో అదృశ్యమైన మేడం ఆరూష్‌రెడ్డి అదృశ్యం కేసు నమోదుపై సిబ్బందితో మాట్లాడారు. పోలీసులపై గౌరవం పెరిగే విధంగా పని చేయాలన్నారు.

కార్యక్రమంలో రైటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఎం.మరియబాబు, పి.పున్నారావు, సూరిబాబు, మహేష్, ప్రేమానిధి పాల్గొన్నారు.



లక్కవరం ఎస్సీ కాలనీలో మురుగు కాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ రాజు

లక్కవరంలో మురుగు కాలువల పూడికతీత పనులు

తాళ్లూరు, జూలై 25: మండలంలోని లక్కవరం ఎస్సీ కాలనీలో గత వైసీపీ పాలనలో మురుగుకాలువ పూడికతీత పనులు ముందుకు సాగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆ గ్రామ టీడీపీ నేతలు పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులను కోరారు. ఈక్రమంలో అధికార యంత్రాగం స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులకు శ్రీకారం చుట్టారు ముందుగా ఎస్సీ కాలనీలో మురుగు నీరు నిల్వ ఉండగా, సర్పంచ్ నన్నం వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అజయ్‌కీర్తిల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఈవోఆర్‌డీ కేజేఎస్ రాజు పరిశీలించారు.

నిబద్ధతతో పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు

ముండ్లమూరు, జూలై 25: నిబద్ధతతో పని చేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందని డిప్యూటీ తహసీల్దార్లు జి.పుల్లారెడ్డి, ఏ.స్రవంతి అన్నారు. ఈ ఏడాది జనవరిలో ఎన్నికల బదిలీల్లో పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం నుంచి వచ్చిన తహసీల్దార్ మధుబాబు తిరిగి బదిలీపై వెళుతున్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ మదుబాబును కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పి.శేషగిరిరావు, ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ విష్ణు, వీఆర్‌వోలు బి.గురవయ్య గన్నెపూడి కోటయ్య, పెద్దన్న, పున్నారావు, సుశీలారాణి, రమణమ్మ, నాయబ్ రసూల్, వేణుగోపాలరెడ్డి, వీఆర్‌వోల సంఘం మండల అధ్యక్షుడు కావూరి దయానందం, వేణుగోపాలరెడ్డి, జాన్‌లిపి తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా జి.పుల్లారెడ్డిని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు అందాయి. ఇప్పటివరకు పనిచేసిన తహసీల్దార్ జె.మధుబాబు పల్నాడు జిల్లాకు బదిలీ కావటంతో పుల్లారెడ్డిని ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు.

పంచాయతీ నిధులతో గ్రావెల్ రోడ్ల నిర్మాణం

పామూరు, జూలై 25: పామూరు పట్టణంలోని ఎన్జీవో కాలనీ, నేతాజీ నగర్ పువ్వాడి అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో మేజర్ పంచాయతీ నిధులతో గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డి తెలిపారు. గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి ఎత్తుపల్లాలుగాఉన్న ప్రాంతాలను డోజర్‌తో చదును చేస్తున్నట్లు తెలిపారు. ఆతర్వాత గ్రావెల్‌తో రోడ్డు నిర్మాణ పనులు చేడుతామని తెలిపారు.

దర్శి తహసీల్దార్ బదిలీ

దర్శి, జూలై 25: దర్శి తహసీల్దార్ కె.సుజాత గురువారం బదిలీ అయ్యారు ఉన్నతాధికారుల నుంచి ఆమెకు ఉత్తర్వులు అందటంతో రిలీవ్ అయ్యారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు ఆమెను గత ఫిబ్రవరి 7న దర్శి తహసీల్దార్‌గా నియమించారు. ఐదు నెలల ఆమె ఇక్కడ విధులు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తికావటంతో ఆమెను బదిలీ చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఏపీ రవిశంకర్ నియమితులయ్యారు.

దొనకొండ ఇన్‌చార్జ్‌గా శ్రీనివాసరావు

దొనకొండ, జూలై 25: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఎన్నికల సమయంలో బాపట్ల జిల్లా నుంచి దొనకొండ తహసీల్దార్‌గా జి.సుజాత నియమితులయ్యారు. ఎన్నికల ప్రక్రియ ముగియటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె తిరిగి బాపట్లకు బదిలీపై వెళ్లారు.

తాళ్లూరు ఇన్‌చార్జ్‌గా ఇమ్మానియేల్ రాజు

తాళ్లూరు, జూలై 25: ఎన్నికల సమయంలో ఇతర జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ గురువారం విధుల నుంచి రిలీవై డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్ రాజుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల సమయంలో వచ్చిన తహసీల్దార్లను తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వటంతో ఆయన రిలీవయ్యారు. ఈసందర్భంగా మహమ్మద్ హుస్సేన్‌ను కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

ఎంపీడీవో మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

పీసీపల్లి, జూలై 25: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణారావు మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పీసీపల్లి ఎంపీడీవో వెంకటసుబ్బారావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెంకటరమణారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో ఎంఈవోలు సంజీవి, ఆర్.శ్రీనివాసులు, ఆర్‌డ బ్లూసీ ఏఈ మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెం ట్లు, తదితరులు ఉన్నారు.

ఆటో, మినీ వ్యాన్ ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు

కనిగిరి, జూలై 25: ఆటో, మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈఘటన గురువారం పట్టణ సమీపంలోని కొత్తూరు వద్ద చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మర్రిపూడి మండలం వేమవరంకు చెందిన ఏడుగురు ఆటోలో నెల్లూరు జిల్లా నర్రవాడ దేవాలయానికి వెళ్ళి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో కొత్తూరు వద్ద చాకిరాల వైపు నుంచి వస్తున్న మినీవ్యాన్ డ్రైవర్ ఒక్కసారిగా పామూరు రోడ్డులోకి మళ్ళించాడు. దీంతో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఆటో డ్రైవర్ ప్రమాదాన్ని తప్పించేక్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మందాడి తిరుపతయ్య, శేషమ్మ, తిరుపతమ్మకు తీవ్రగాయాలుకాగా, మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో మందాడి తిరుపతయ్య, తిరుపతమ్మల పరిస్థితి విషయమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు విచారిస్తున్నారు.



బోల్తాపడిన వాహనం



ప్రమాదంలో తీవగాయాలైన వ్యక్తి

అధ్వానంగా రహదారులు

» గుంతలలో నిలిచిపోతున్న నీరు
» ఇబ్బందులు పడుతున్న ప్రజలు
» పట్టించుకోని అధికారులు

దర్శి, జూలై 25: మండలంలోని అనేక రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఈ వర్షాలకు నీరు నిల్వ ఉండి రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. ప్రధానంగా దర్శి-ఆరవల్లిపాడు రోడ్డులో బండివెలిగండ్ల వద్ద గత నాలుగు సంవత్సరాలుగా రోడ్డు మరమ్మతులు చేయలేదు. దీంతో వర్షాలు పడినప్పుడల్లా కుంటలా నీరు నిల్వ ఉంటుంది. మురుగు కాల్వలు లేకపోవటంతో వర్షంనీరు ప్రక్కకు వెళ్లే వీలులేక అలాగే నిల్వ ఉండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. నెలల తరబడి నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో రోడ్లుకు ఇరువైపులా నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు గత ఐదేళ్లుగా రోడ్డు మరమ్మతుల గురించి పట్టించుకోవటంలేదు. అధికారులకు పలుమార్లు గ్రామస్థులు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న నాథుడు లేడు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు మళ్లీ కుంటలా నీరు నిల్వ చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అధికారులు ఇప్పుడైనా స్పందిస్తారనే ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.



దర్శి-ఆరవల్లిపాడు రోడ్డులో బండివెలిగండ్ల వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

» 17 పోస్టులు ఖాళీ
» ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పామూరు, సెప్టెంబరు 25: గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం నేడు విద్యార్థులకు శాపంగా మారింది. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్య సంవత్సరానికి సుమారుగా 860 మంది విద్యార్థులు 6వ నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాలలో కీలకమైన లెక్కలు, ఇంగ్లీష్, తెలుగు, సోషల్, తదితర ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలలో 30 మంది ఉపాధ్యాయులకు గాను 17 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత ఆరు సంవత్సరాల నుంచి రెండు అటెండర్ పోస్టులు వాచ్‌మన్ పోస్టులు కూడా భర్తీ కాలేదు. హెచ్‌ఎం పోస్టు కూడా ఖాళీగా ఉండటంతో సీనియర్ ఉపాధ్యాయుడు రామస్వామి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో అడ్మిషన్‌లు ప్రారంభం సమయంలో సీట్లు దొరకక ఇబ్బందులు పడిన విద్యార్థులు, ప్రస్తుతం ఉపాధ్యాయుల పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో టీసీ లు తీసుకొని వెళుతున్నారు. కాగా, సర్దుబాటు కింద విద్యాశాఖ అధికారులు ఐదుగురు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై నియమించినట్టు హెచ్‌ఎం తెలిపారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీచేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

» సీహెచ్‌సీ సూపరింటెండెంట్ అబ్దుల్ కలాం

కనిగిరి, జూలై 25: లింగ నిర్ధారణ పరీక్షలు చేయటం చట్టరీత్యా నేరమని ప్రభుత్వాసుపత్రి (సీహెచ్‌సీ)సూపరింటెండెంట్ అబ్దుల్ కలాం అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గురువారం పట్టణంలోని వివిధ స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులతో పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారణ చేసేవారిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామన్నారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితి పేరుతో కొంతమంది ఈ పరీక్షలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. అందుకు ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. లింగనిర్ధారణ చేసినట్లు రుజువైతే సంబంధిత స్కానింగ్ సెంటర్, ప్రయివేటు ఆసుపత్రులను సీజ్ చేసి సంబందిత వైద్యుల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఈ విషయంలో ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ లేని స్కానింగ్ సెంటర్‌లపై చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బేటి బచావో కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలన్నారు.

కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యుడు చంద్రేష్, గుడ్‌హెల్ప్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ అబ్దుల్‌కలాం

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పీసీపల్లి, జూలై 25: వసతిగృహాల్లో ఉండే విద్యార్థులు ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్, వసతిగృహ అధికారి సురేంద్ర అన్నారు. గురువారం స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలోని 80మంది విద్యార్థులకు కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన వీరపనేని నవీన్ ఆర్థిక సహకారంతో మ్యాట్ లు పంపిణీచేశారు. కార్యక్రమంలో వేమూరి రామయ్య, గుంటగాని జోసేఫ్, బద్దిపూడి ఎబినేజరు, దేవండ్ల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

వెలిగండ్ల, జూలై 25: గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో రామచంద్రరావు అన్నారు. ఓడిఎఫ్ సర్వేలో భాగంగా గురువారం మండలంలోని రామగోపాలపురం సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామాల్లోని మురుగు కాల్వలను పరిశీలించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్తవేయరాదని సూచించారు. సీజన్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

పామూరు, జూలై 25: గ్రామాల్లోని ప్రజలు పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు పోస్టల్ ఏఎస్‌పీ మధురవాణి సూచించారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో జనంలోకి మనం అనే కార్యక్రమం గురువారం నిర్వహించారు. పోస్టల్ పథకాలైన ఎస్‌బీ, రికరింగ్ డిపాజిట్‌లు, సుకన్య సంవృద్ధి అకౌంట్, మహిళా సమ్మాన్, ఇన్సూరెన్స్ స్కీమ్, ఆన్‌లైన్ సర్వీస్‌ల సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక పోస్ట్‌మాస్టర్ షేక్ వలి, సర్పంచ్ వై.బాల, టీచర్ సుబ్బారావు, పోస్టల్ సిబ్బంది గోళ్ల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

తాళ్లూరు, జూలై 25+: దోమల ఉధృతితో సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందుతుండటంతో బొద్దికూరపాడు సర్పంచ్ మందా శ్యాంసన్, పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగం ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో ఫాగింగ్ చేపట్టారు. వర్షాలు కురుస్తున్న క్రమంలో మురుగుకాలువల్లో దోమలు వ్యాప్తి చెందుతూ సీజనల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో గ్రామ పంచాయతీ ముందస్తుచర్యలు చేపట్టింది. పంచాయతీ పరిధిలోని అన్నివీధుల్లో దోమల నివారణ మందు ఫాగింగ్ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యాంసన్, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవీ మాత ఆషాడ మాస పూజలు

పామూరు, జూలై 25: స్థానిక వాసవీ మాత ఆలయంలో శుక్రవారం ఆషాడ మాస శుద్ధ షష్టి పూజలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన చైర్మన్ యేల్చూరి బాల కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం వాసవీ మాతను వివిధ రకాల కూరగాయలతో శాకాంబరి మాత అలంకరణలో దర్శనమిస్తున్నట్టు తెలిపారు. అనంతరం జరిగే పల్లకిసేవ, నవహారతులతో కార్యక్రమంలో భక్తులు పా ల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

పామూరు, జూలై 25: స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో శిక్ష సప్తహ కార్యక్రమాల్లో భాగంగా గురువారం పలు క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. చిత్రలేఖనం, పలురకాల ఆటపోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కటకం సృజన మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థినులచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

దర్శి, జూలై 25: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు గురువారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఏపీ రవిశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 117 జీవో ను రద్దు చేసి జీవో నెంబర్ 55 ప్రకారం టీచర్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు డి.వెంకటరెడ్డి, టి.రాజశేఖర్, మీనుగ శ్రీనివాసరావు, ఖాశీం, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు దూరంగా ఇళ్లు నిర్మించుకోవాలి

కనిగిరి, జూలై 25: నూతన గృహాలను తప్పనిసరిగా విద్యుత్ లైనుకు మూడు మీటర్లకు దూరంగా నిర్మించుకోవాలని గుంటూరు విద్యుత్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ (ఈఐ) ప్రసాద్ అన్నారు. స్థానిక ఈఈ కార్యాలయంలో గురువారం రాత్రి విద్యుత్ ప్రమాదాలపై అధికారుల, సిబ్బందితో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ శరీరం 50 వోల్టేజీ కంటే ఎక్కువ ఉన్న విద్యుత్‌ను తట్టుకోలేదన్నారు. విద్యుత్ సప్లయి అంతకంటే ఎక్కువ కావటంతో విద్యుత్ షాక్‌కు గురైనప్పుడు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ లైన్‌లకు తగిలే చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. వాణిజ్య సముదాయాల వద్ద విద్యుత్ తీగలు షాపులకు ఆనుకుని ఉన్న వాటిని గుర్తించి సంబంధిత యజమానికి అవగాహన కల్పించాలన్నారు. వర్షాల సమయంలో సప్లయి తొలగించినప్పటికి తెగిపడిన విద్యుత్ తీగలను తాకకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈఈ హరిబాబు, డీఈఈ ఉమాకాంత్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు(విద్య), జూలై 25: ప్రభుత్వ, ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలల్లో పాలిసెట్-24 తుదిదశ కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ గురువారం తెలిపారు. ఏ కళాశాలలో ఎన్ని సీట్లు ఖాళీ ఉంది, బ్రాంచి వారీగా ఈనెల 27న నోటీసుబోర్డులో ప్రకటిస్తారు. నోటీసుబోర్డులోని ఖాళీల ఆధారంగా విద్యార్థులు ఏ కళాశాలలో, ఏ బ్రాంచిలో చేర తారో నిర్ణయించుకుంటారు. విద్యార్థులు ఈనెల 31న తమ ఒరిజనల్ విద్యార్హతల సర్టిఫికెట్లతో తాము చేరదల్చుకున్న కళాశాలలో హాజరుకావాలని కోరారు.



కక్షలు.. కేసులు

కదిలితే కేసు.. ప్రశ్నిస్తే అరెస్టు.. వైసీపీ ఐదేళ్ల పాలన సాగిన తీరు, టీడీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా కేసులు, అరెస్టులతో ఇబ్బందులు ఎదుర్కొన్న వైనం గురువారం విడుదల చేసిన శ్వేతపత్రంలో బహిర్గతమైంది. పోలీసులను అడ్డంపెట్టుకుని నాటి ప్రభుత్వ దమనకాండను కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు వివరించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గడిచిన ఐదేళ్లు టీడీపీ శ్రేణులను తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురి చేసిన తీరు తెలిసి పలువురు ఆశ్చర్యపోయారు. నియోజకవర్గ ఇన్చార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు ఇలా ముఖ్య నేతలు మొదలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉండే నాయకులు, కార్యకర్తల వరకు కేసులతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినా, సోషల్ మీడియాలో పోస్టు పెట్టినా కేసులు పెట్టి వేధింపులకు గురిచేశారని తేలింది.



కేసులు.. ఇలా

ఉమ్మడి గుంటూరు జిల్లా టీడీపీ నేతలపై వైసీపీ ప్రభుత్వం పెట్టిన కేసుల గురించి సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటించారు.

నారా లోకేశ్	- 17
జీవీ ఆంజనేయులు	- 17
చదలవాడ అరవింద్‌బాబు	- 17
ధూళిపాళ్ల నరేంద్ర	- 16
ప్రత్తిపాటి పుల్లారావు	- 13
తెనాలి శ్రావణ్‌కుమార్	- 8
యరపతినేని శ్రీనివాసరావు	- 5
జూలకంటి బ్రహ్మారెడ్డి	- 5

- కదిలితే కేసు.. ప్రశ్నిస్తే అరెస్టు
- ఎమర్జెన్సీని తలపించిన వైసీపీ పాలన
- 8 మంది ఎమ్మెల్యేలపై 100కుపైగా కేసులు
- పోలీసుల తీరుతో టీడీపీ నేతల ఉక్కిరిబిక్కిరి
- వైసీపీ కార్యకర్తలను తలపించేలా ఖాకీల విధులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ శ్రేణులపై వేలాది కేసులు
- శాంతిభద్రతలపై శ్వేతపత్రంలో నాటి ప్రభుత్వ దమనకాండ బహిర్గతం

గుంటూరు, నరసరావుపేట, జూలై 25: ప్రశ్నించ కూడదు.. మాట్లాడకూడదు.. కాదంటే కేసులు.. అడ్డుపడితే అరెస్టు.. ప్రజా సమస్యలపై ఆందోళలకు సిద్ధపడితే గృహ నిర్బంధాలు.. అన్నట్లుగా వైసీపీ ఐదేళ్ల పాలన సాగింది. రాజకీయ కక్ష సాధింపు చర్యల కోసం చట్టా న్ని దుర్వినియోగం చేసింది. తప్పుడు కేసులతో టీడీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేసింది. ఎమర్జెన్సీని తలపించే విధంగా రాష్ట్రంలో పరిస్థితులను తీసుకువ చ్చి చీకటి పాలన సాగించింది. తప్పుడు కేసులు బనా యించడంలో పోలీసులు పోటీలు పడ్డారు. ఒక్క ఉమ్మ డి గుంటూరు జిల్లాలోని టీడీపీ నాయకులు, కార్యకర్త లపై వేలాది కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని 17 మంది ఎమ్మెల్యేల్లో కేవలం 8 మందిపైనే 100కు పైగా కేసులు నమోదయ్యాయి. టీడీపీ ముఖ్య నేతలను లక్ష్యంగా చేసుకుని వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధించడం ఒక ఎత్తు అయితే పార్టీ శ్రేణుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా కేసులు బనాయించడం మరో ఎత్తుగా చెప్పవచ్చు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మొదలు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, యరపతినేని శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, తెనాలి శ్రావణ్‌కుమార్, నక్కా ఆనందబాబు, జీవీఎస్ ఆంజనేయులు, చదలవాడ అరవింద్‌బాబు ఇలా ఎమ్మెల్యేలపై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎడాపెడా కేసులు బనాయించారు. మారణాయుధాలతో దాడులకు తెగబడి చంపడానికి ప్రయత్నించినా హత్యాయత్నం కేసు నమోదుకి సవాలక్ష ఆధారాలు అడిగే పోలీసులు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై మాత్రం అడ్డగోలుగా హత్యాయత్నం కేసులు బనాయించి వేధించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పోలీసులు పావులుగా మారారు. ఇక టీడీపీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులు, హత్యాయత్నాలకు లెక్కలేదనే చెప్పాలి. ఆయా నేతలు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసినా ఆలకించే దిక్కు లేకుండా పోయింది. అంతేగాక బాధితులపైనే తిరిగి తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారు. నేతల హౌస్ అరెస్టులు, గృహనిర్బంధాలు నిత్యకృత్యమయ్యాయి. మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలపై కూడా పెద్ద ఎత్తున తప్పుడు కేసులు బనాయించారు. మొత్తం మీద గడిచిన ఐదేళ్లలో జిల్లాలో చోటు చేసుకున్న పరిణామాలను తలచుకుంటే పార్టీ నేతలతో పాటు కార్యకర్తలు సైతం వణికిపోయారు.

32 రోజులు రిమాండ్‌లో ఎమ్మెల్యే నరేంద్ర

వైసీపీ ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, అరాచకాలను నిలదీసి ప్రభుత్వ దుర్మార్గాలను ప్రజల్లో ఎండగడుతున్న నేతలను గత ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని పోలీసులతో తప్పుడు కేసులు పెట్టి వేధించింది. ఈ క్రమంలో ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర వేధింపులకు గురి చేసింది. గతంలో సంఘం డెయిరీ ఛైర్మన్‌గా కిలారి రాజన్‌బాబు ఉన్న సమయంలో ఏర్పాటైన ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి చారిటబుల్(డీవీసీ) ట్రస్ట్‌కు సంఘం డెయిరీకి చెందిన 10 ఎకరాలను బదలాయించింది. ఆ తరువాత సంఘం ఛైర్మన్‌గా ధూళిపాళ్ళ నరేంద్ర ఎన్నికైన తర్వాత డెయిరీకి చెందిన పొలాలను కాజేశాడంటూ కేసు నమోదు చేసి అర్ధరాత్రి అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైల్‌కు తరలించారు. జైలులో 32 రోజులు రిమాండ్ ఖైదీగా నిర్బంధించారు. అప్పటి స్థానిక ఎమ్మెల్యే అక్రమ క్వారీయింగ్, అనుమర్లపూడిలో దళితుల భూముల కబ్జా, గుంటూరులో దళిత యువతి రమ్య హత్య నేపథ్యంలో కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన సందర్భం, రాజధాని ఉద్యమంలోనూ నరేంద్రపై తప్పుడు కేసులు బనాయించారు. ఓ దశలో ఆయన తీవ్ర మానసిక ఒత్తిడితో అనారోగ్యం పాలైన పరిస్థితి కూడా ఉంది.

యరపతినేని, బ్రహ్మారెడ్డిలపై హత్యాయత్నం కేసులు

గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిలపై కూడా పెద్దఎత్తున తప్పుడు కేసులు బనాయించారు. పల్నాడులో వైసీపీ దురాగతాలపై ఎమ్మెల్యే యరపతినేని మొదటి నుంచి పోరాడుతున్న ఆయనను టార్గెట్ చేసి కేసులతో వేధించింది. తొలుత అక్రమ మైనింగ్ అంటూ వేధించే ప్రయత్నం చేసింది. పిడుగురాళ్లలో జరిగిన ఓ ఘర్షణలో వైసీపీ నాయకుడి ఫిర్యాదు మేరకు యరపతినేని శ్రీనివాసరావుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దీనితోపాటు మరికొన్ని నిబంధనల ఉల్లంఘన పేరుతోనూ కేసులు నమోదు చేశారు. ఫ్యాక్షన్ నియోజకవర్గమైన మాచర్లలో అరాచకాలు సృష్టించిన పిన్నెల్లి సోదరులు టీడీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేశారు. పార్టీ జెండా పట్టుకోడానికి టీడీపీ కార్యకర్తలు భయంతో వణికిపోయే పరిస్థితులు తీసుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో జూలకంటి బ్రహ్మారెడ్డి రంగంలోకి దిగగా పిన్నెల్లి సోదరులు ఆయనపై తప్పుడు కేసులు బనాయించడమే గాక పలు దఫాలు హత్యాయత్నానికి కూడా ప్రయత్నించారు. బ్రహ్మారెడ్డి టీడీపీ ఇన్‌చార్జిగా ఉంటే తమ ఆటలు సాగవని భావించిన పిన్నెల్లి సోదరులు పోలీసులను అడ్డం పెట్టుకుని దారుణాలకు తెగబడ్డారు. రెండు మూడు నెలలు బ్రహ్మారెడ్డిని నియోజకవర్గంలోకి అడుగుపెట్టనివ్వకుండా వేధించారు. ఓ ప్రమాదంలో పిన్నెల్లి సోదరులు బాధితులపై ఒత్తిడి తీసుకొచ్చి బ్రహ్మారెడ్డిపై అట్రాసిటీ కేసులు బనాయించారు. బ్రహ్మారెడ్డి వెల్దుర్తిలో దళితవాడకు వస్తున్నారనే కారణంగా అక్కడ యువకులు బైక్ ర్యాలీ నిర్వహిస్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇదేమిటని అడగడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ఎస్ఐ శ్రీహరి ఏకంగా బ్రహ్మారెడ్డి పై హత్యాయత్నం కేసు బనాయించారు.

శ్రావణ్ కుమార్‌పై ఎస్సీ ఎస్టీ కేసు

టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ గూండాలు దాడికి పాల్పడి విధ్వంసం సృష్టించిన సందర్భంలో అక్కడ అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తిని పార్టీ శ్రేణులు అటకాయించాయి. ఆ సమయంలో అక్కడే ఉన్న తెనాలి శ్రావణ్‌కుమార్ అతడ్ని నిలదీశారని అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఆ తర్వాత శ్రావణ్‌కుమార్‌పై ఆ సెక్షన్ తొలగించినా మిగిలిన సెక్షన్ల కింద కేసు కొనసాగుతూనే ఉంది. అంతేగాక రాజధాని మహిళలు కనకదుర్గమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు వెళుతుండగా వారికి సంఘీభావంగా ఉన్న శ్రావణ్‌కుమార్ నాటి ఎస్పీ విజయారావు, ఇతర పోలీస్ అధికారులపై దౌర్జన్యం చేశారంటూ మరో కేసు బనాయించారు. రాజధాని ఉద్యమం తో పాటు చట్ట నిబంధనలు ఉల్లంఘించారంటూ మరికొన్ని కేసులు కూడా బనాయించారు.

జీవీ ఆంజనేయులుపై చోరీ కేసు

గత ప్రభుత్వంలో పోలీస్ యంత్రాంగం ఏ స్థాయిలో అధికార దుర్వినియోగానికి పాల్పడిం దో ప్రస్తుత వినుకొండ ఎమ్మెల్యే జీవీఎస్ ఆంజనేయులుపై నమోదైన కేసే నిదర్శనం. వినుకొం డ నియోజకవర్గంలో నాటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రభుత్వ భూముల్లో వేలాది ట్రక్కుల గ్రావెల్ ను అక్రమంగా తరలించా రని ఆధారాలను మీడియాకు చూపేందుకు వెళ్లిన జీవీపై ఫ్యాక్టరీలో సామాగ్రి దొంగలిం చారంటూ చోరీ కేసు నమోదు చేశారు. కరోనా బాధితులను పరామర్శించేందుకు వెళితే దానిపై కూడా కేసులు బనాయిం చారు. ఇక ప్రస్తుత నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబుపైన పెద్ద ఎత్తున కేసులు నమో దు చేశారు. చిలకలూరిపేటలో మాజీ మంత్రి ప్రతిపాటి పుల్లారావు పైన అనేక తప్పుడు కేసులు బనాయించి వేధించారు. ఇక పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌పై అనేక రకాలైన సెక్షన్ల కింద రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో పెద్దసంఖ్యలో కేసులు నమోదు చేసారు.

ఐపీసీ స్థానంలో వైసీపీ

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవ ల ఐపీసీకి బదులుగా నూతన చట్టాలను అమల్లోకి తీసుకువస్తే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లకు ముందే వైసీపీ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. టీడీపీ నేతలను, గతంలో చురుగ్గా పనిచేసిన వారిని ఇలా ఏ ఒక్కరినీ వదలకుండా వారి స్థాయిలను బట్టి జాబితాలను సిద్ధం చేసి మరీ కేసుల మీద కేసులు పెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారు. ఐపీసీకి బదులు వైసీపీని అమలు చేయగా వైసీపీ కార్యకర్తలను మరిపించేలా ఖాకీ ముసుగు ధరించిన పోలీసులు కేసులతో విరుచుకుపడ్డారు.

గ్రావెల్ మైనింగ్‌పై విజిలెన్స్



- అక్రమ తవ్వకాలపై విచారణకు ఆదేశాలు
- నాడు జరిగిన అక్రమాలపై వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- రూ.2వేల కోట్లకుపైగా తవ్వకాలు జరిగి ఉంటాయని అంచనా
- వైసీపీ నేతలు, వారికి సహకరించిన అధికారుల్లో ఆందోళన

గుంటూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో వందల ఎకరాల్లో అనుమతులు లేకుండా గ్రావెల్‌ని తవ్వేసి రూ.కోట్లు వెనకేసుకున్నారు. చేబ్రోలు పరిధిలో నిబంధనలకు పాతరేసి కొన్ని చోట్ల 25 మీటర్ల వరకు కూడా వెళ్లి గ్రావెల్‌ని తవ్వేశారు. టీడీపీ పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెద్ద ఉద్యమమే నడిపారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం తాజాగా గ్రావెల్ అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఇంచుమించుగా రూ.2 వేల కోట్లకు పైగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిగి ఉంటాయని అంచనా. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా విచారణకి ప్రభుత్వం సిద్ధపడినట్లు సమాచారం. దీంతో నాడు అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలు, వారికి సహకరించిన అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.


96 ఎకరాలకు అనుమతి.. 700 ఎకరాల్లో తవ్వకాలు

గ్రావెల్ నిక్షేపాలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో చేబ్రోలు మండలం పెట్టింది పేరు. ఇక్కడ వడ్లమూడి, వీరనాయునిపాలెం, శేకూరు, శలపాడు, కొత్తరెడ్డిపాలెం, అనమర్లపూడి తదితర గ్రామాల్లో గ్రావెల్ భూముల విస్తీర్ణం ఎక్కువగా ఉన్నది. గతంలో నిబంధనల మేరకు మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకుని తవ్వకాలు జరిపించేవారు. తద్వారా మినరల్ రెవెన్యూ కూడా ప్రభుత్వానికి వచ్చేది. ఎప్పుడైతే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిందో ఇక్కడి గ్రావెల్‌పై వారి కన్ను పడింది. కరోనా లాక్‌డౌన్‌లోనూ ఇక్కడ తవ్వకాలను ఆపకుండా రాత్రింబవళ్లు కొనసాగించారు. గత ఐదేళ్లలో ఇక్కడ గ్రావెల్ తవ్వకాల కోసం ఎన్‌వోసీలు తీసుకున్నది కేవలం 96 ఎకరాలు మాత్రమేనని సమాచారం. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం సుమారు 700 ఎకరాల వరకు వేర్వేరు గ్రామాల్లో తవ్వకాలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతి పొందిన భూమిలో 18 అడుగులు(ఆరు మీటర్లు) లోపు మాత్రమే గ్రావెల్ తీయాలి. ఇలా చేస్తే ఎకరం పరిధిలో 2 వేల లారీల గ్రావెల్‌కు మించి రాదు. అయితే 25 మీటర్లు(75 అడుగుల) కంటే ఎక్కువ లోతుకు వెళ్లి గ్రావెల్ తవ్విన ఉదంతాలు వైసీపీ పాలనలో వెలుగు చూశాయి. ఇలా చేయడం వల్ల ఎకరానికి సుమారు 9వేల లారీల వరకు మట్టిని తవ్వారు. దీని వల్ల ఎకరానికి సుమారు రూ.4.50 కోట్ల మేరకు ఆదాయం సమకూరుతుంది. లారీ గ్రావెల్ బహిరంగ మార్కెట్‌లో రూ.5,500 వరకు ఉండటంతో నిత్యం రూ.లక్షల్లో దోచేసుకున్నారు. కొంతమంది వైసీపీ నాయకులు చేబ్రోలు మండల పరిధిలో భూములు కొనుగోలు చేసి గ్రావెల్ తవ్వకాల కోసం ఎన్‌వోసీలకు దరఖాస్తు చేసుకుంటే వారి వద్ద కూడా వైసీపీ కీలకనేత తన పర్సంటేజీని డిమాండ్ చేశారు.



చేబ్రోలు ప్రాంతంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపిన క్వారీ

ఎకరానికి రూ.25 లక్షల వరకు డిమాండ్ చేయడంతో భూములు తీసుకున్న వారు బెంబేలెత్తిపోయారు. లేకుంటే గ్రావెల్‌లో 50 శాతం వాటా డిమాండ్ చేసేవారు. తన అక్రమాలకు అడ్డుచెప్పిన పలువురు అధికారులపై సస్పెన్షన్లు, బదిలీల వేటు వేయించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే రోజు వరకు కూడా ఇక్కడ అక్రమ తవ్వకాలు ఆగలేదంటే పరిస్థితి ఎలా ఉండేదో కళ్లకు కడుతున్నది. చేబ్రోలులో ప్రైవేటు భూములే కాకుండా ఇనాం, అసైన్‌మెంట్, స్వాతంత్ర్య సమర యోధులకు కేటాయించినవి, దేవదాయ శాఖ భూములు కూడా ఉన్నా యి. వీటిల్లో ఏ ఒక్క వాటిని వదిలి పెట్టలేదు. ఎవరైనా అధికారులు అడ్డు చెబితే వారిపై లేనిపోని ఫిర్యాదులను చేసి సస్పెన్షన్ చేయించేవారు. ఒక తహసీల్దార్‌ని ఇలానే సస్పె న్షన్ చే యించడం అప్పట్లో కలకలం రేకె త్తించింది. అడ్డు చెప్పిన సొంత పా ర్టీ వారిపై కూడా కేసులు పె ట్టించారంటే పరిస్థితి అ ర్థం చేసుకోవచ్చు.



రషీద్ హత్యలో వైసీపీ పాత్ర

- అద్దంకిలో వినుకొండ పోలీసుల సోదాలు
- వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి సహా పలువురు పరారీ
- అనుమానితులకు ఓ వైసీపీ నేత ఆశ్రయం కల్పించినట్లు ఆరోపణలు

అద్దంకి, వినుకొండటౌన్, జూలై 25: వినుకొండలో ఈ నెల 17న జరిగిన రషీద్ హత్యలో వైసీపీ శ్రేణుల పాత్ర ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రషీద్‌ను టీడీపీ వర్గీయులే హత్య చేశారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్న క్రమంలో వైసీపీ యువకుల సంబంధం చర్చనీయాంశమైంది. ఇద్దరి స్నేహితుల మధ్య పాతకక్షల నేపథ్యంలో జరిగినట్లు పోలీసులు చెప్తున్నా కాదంటూ వైసీపీ నేతలు టీడీపీ నేతలపై ఆరోపిస్తుండగా అసలు రషీద్ హత్య సంఘటనతో అద్దంకి ప్రాంత వైసీపీ నేతల పాత్ర ఉందన్న విషయం బయటకు పొక్కడం స్థానికంగా సంచలనంగా మారింది. అదే సమయంలో హత్యతో సంబంధం ఉందని భావిస్తున్న యువకులు సంఘటన జరిగినప్పటి నుంచి పరారీలో ఉండటం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. హత్య చేసిన యువకుడు గతంలో వైసీపీ కార్యకర్తగా ఉన్న సమయంలో అద్దంకికి చెందిన వైసీపీ కార్యకర్తలతో సంబంధాలున్నట్లు సమాచారం. అదే సమయంలో అద్దంకి ప్రాంత కార్యకర్త ఒకరు వైసీపీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండి వినుకొండకు చెందిన యువకులతో సంబంధాలు ఏర్పర్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ బంధంతోనే వినుకొండలో హత్య జరిగిన సమయంలో అద్దంకి ప్రాంతానికి చెందిన యువకులు కూడా తమ వంతు సహకారం అందించినట్లు అనుమా నాలున్నాయి. ఈ క్రమంలో రషీద్ హత్యలో అద్దంకి ప్రాంత యువకుల పాత్ర ఉన్నట్లు వినుకొండ పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే పోలీసులు అద్దంకి పట్టణంతో పాటు, యువకుల స్వగ్రామం కూడా వెళ్లి విచారణ చేసినట్లు తెలుస్తుంది. హత్య చేసిన యువకుడితో సంబంధం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకులకు అద్దంకిలోని ఓ వైసీపీ నేత ఆశ్రయం కల్పించినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే వినుకొండ పోలీసుల విచారణలో ఆ యువకుల సెల్‌టవర్ లోకేషన్ సదరు నేతకు చెందిన భవనం వద్ద చూపించడంతో అక్కడ కూడా సోదాలు చేసినట్లు తెలుస్తుంది. అయితే అప్పటికే ఆ యువకులు మకాం మార్చినట్లు తెలుస్తుంది. అద్దంకికి చెందిన వైసీపీ కార్యకర్తల ప్రమేయం ఉందన్న విషయంతోపాటు వినుకొండ పోలీసులు సోదాలతో పట్టణ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధిగా చెప్పుకునే యువకుడు శింగరకొండ దేవస్థానంలో అవుట్ సోర్సింగ్ సిబ్బందిగా కూడా పనిచేస్తుండగా హత్య జరిగిన రోజు నుంచి అతడు విధులకు హాజరుకావడం లేదని తెలిసింది. శింగరకొండలోనే ఏడాదిగా వడ్రంగి పని చేసుకుంటూ జీవనం సాగించే మరో యువకుడు, మరో ఇద్దరు యువకులకు కూడా రషీద్ హత్యతో సంబంధాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హత్య చేసిన యువకుడు టీడీపీ సానుభూతిపరుడని వైసీపీ నేతలు గగ్గోలు పెడుతున్న సమయంలో హత్య చేసిన యువకుడితో పూర్తి సంబంధాలు కొనసాగిస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకులు అందరూ అద్దంకి నియోజకవర్గ వైసీపీలో యాక్టివ్‌గా ఉండే కార్యకర్తలు కావడం హాట్ టాపిక్‌గా మారింది.

మరో ఆరుగురి అరెస్టు

రషీద్ హత్య కేసులో ఆరుగురినిను అరెస్టు చేసినట్లు వినుకొండ సీఐ సాంబశివరావు తెలిపారు. ఎస్ఐ కృష్ణారావుతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన ప్రకటించారు. నరసరావుపేట బరంపేటకు చెందిన పఠాన్ అబూబకర్ సిద్ధిక్, వినుకొండ సీతయ్యనగర్ చెందిన కొమ్ము వెంకట సాయి, నిమ్మలభావి బజార్‌కు చెందిన కొమ్ము ఏడుకొండలు, బైలబోయిన అనిల్, ఇస్లాంపేటకు చెందిన షేక్ రోహిత్(షోహెల్), ప్రకాశం జిల్లా పంగులూరు మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన పల పార్తి సుమంత్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించినట్లు తెలిపారు.



రషీద్‌పై దాడి చేస్తున్నప్పటి దృశ్యం (ఫైల్)



బెండ తోటను పరిశీలిస్తున్న అధికారి హనుమంత్‌నాయక్

బెండ తోటను పరిశీలించిన అధికారులు

బల్లికురవ, జూలై 25: బెండ కాయలు తెల్లగా, వచ్చి కాయలు వంకరగా వచ్చిన విషయాన్ని సైంటిస్టుల దృష్టికి తీసుకు వెళతామని మార్టూరు ఉద్యాన శాఖ అధికారి హనుమంత్‌నాయక్ తెలిపారు. రెండు రోజుల కిందట ఆంధ్రజ్యోతిలో నాసిరకం బెండ విత్తనాలతో రైతు బెంబేలు అన్న వార్తపై ఉద్యాన అధికారులు స్పందించారు. గురువారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో రైతు నాగండ్ల పున్నయ్య సాగు చేసిన బెండ తోటలను అధికారులు పరిశీలించారు. బెండ తోట తెల్లగా, కాయలు వంకరగా, ఎదుగుదల లేకపోవడాన్ని రైతు అధికారులకు చూపించారు. మార్టురులోని ఓ దుకాణంలో విత్తనాలను కొనుగోలు చేసిన్నట్లు రైతు బిల్లులను అధికారులకు ఇచ్చారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు. తనకు న్యాయం చేయాలని రైతు మొరపెట్టుకున్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి చేయాలి

ఇంకొల్లు, జూలై 25: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సెల్ఫ్ అధికారి సత్యభామ అధికారులకు సూచించారు. ఇంకొల్లు వెలుగు కార్యాలయంలో విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి అధికారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఇంకొల్లు గ్రామైక్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి కుటుంబ పరిస్థితుల గురించి నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం మోహనరావు, సీసీలు పాల్గొన్నారు.

డొమెస్టిక్ డేటా ఎంట్రీ కోర్సుపై ఉచిత శిక్షణ

అద్దంకిటౌన్, జూలై 25: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇతమ్మాజీ రావు గురువారం ప్రకటనలో తెలిపారు. 10 ఆపై చదువుకున్న 18 నుంచి 35 ఏళ్ల వయస్సు నిరుద్యోగ యువతీయువకులు మూడు నెలల పాటు శిక్షణ ఇ వ్వడం జరుగుతుందని, ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్, ఉపాధి కల్పన జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు జె.గోపీనాథ్ 9542970871 నెంబరు సంప్రదించి పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

సామాజిక అంశాలపై దృష్టి సారించాలి

పర్చూరు, జూలై 25 : విద్యతోపాటు సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని నవోదయ పాఠశాలల విశ్రాంతి ఉపాధ్యాయులు సాంబశివరావు అన్నారు. గురువారం వైఆర్ హైస్కూల్‌లో బ్యాంకుల జాతీయకరణం, సామాన్య మానవునికి బ్యాంక్ సేవలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ కార్యక్రమం నిర్వహించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజశేఖర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్ల సిఫార్సు బదిలీలు రద్దు

ఒంగోలు(విద్య), జూలై 25: సాధారణ ఎన్నికల ముందు గత ప్రభుత్వం హడావుడిగా జారీచేసిన ఉపాధ్యాయుల బదిలీలు రద్దయ్యాయి. ఈ మేరకు పాఠశాల విద్యా ముఖ్యకార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజులు ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులతో జిల్లాలో 108మంది ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు రద్దయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీచర్ల అక్రమ బదిలీలపై దృష్టిపెట్టింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొద్దిరోజుల ముందు గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధుల సిఫార్సులతో టీచర్ల బదిలీలకు తెరలేపింది. రాజకీయ నాయకుల సిఫార్సులతో పాటు కొందరు ముఖ్య దళారులు బదిలీకి ఒక్కొక్క టీచర్ నుంచి రూ.4 లక్షల వరకు అక్రమంగా వసూలు చేశారు. ఈ బదిలీల్లో పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయంలో కీలకంగా వ్యవహరించే ఒక అధికారిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. అప్పటి విద్యాశాఖ మంత్రి, ఈ కీలక అధికారి టీచర్ల బదిలీల్లో కోట్లు కొల్లగొట్టారన్న విమర్శలు వెల్లువెత్తాయి. కొందరైతే మంత్రి, ఆ అధికారిపై నేరుగానే ఆరోపణలు గుప్పించారు. సాధారణ బదిలీల్లో దూరం పోవాల్సి వస్తుందన్న భయంలో సిఫార్సుల కోసం కక్కుర్తిపడితే డబ్బులకు డబ్బులు పోయినా ఫలితం దక్కకుండాపోయింది. జిల్లాలో హెచ్ఎంలు, స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు మొత్తం 108మంది ఈ బదిలీల అక్రమ దందాలో ఉన్నారు.

కౌన్సెలింగ్ లేకుండా...

నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ విధానంలోనే బదిలీ చేయాలి. దానికి తూట్లు పొడిచి గత ప్రభుత్వం ఇష్టారీతిన టీచర్లను బదిలీ చేసింది. దీనిపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ఈ బదిలీలన్నింటిని రద్దుచేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు గురువారం ఇక్కడి డీఈవో కార్యాలయానికి అందాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టీచర్ల బదిలీ ఉత్తర్వులు రద్దయిన విషయాన్ని సంబంధిత మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, హైస్కూలు హెడ్మాస్టర్లకు ఉత్తర్వుల నకలును పంపినట్లు డీఈవో సుభద్ర తెలిపారు. తాము గతంలో జారీచేసిన నియామక ఉత్తర్వులను నిలిపివేయాలని అధికారులను డీఈవో ఆదేశించారు.

పింఛన్ దొంగలు!

- ప్రభుత్వ సాయం ఫలహారంలా భోజ్యం
- నియోజకవర్గంలో భారీగా దొంగపింఛన్లు
- ఆధార్‌కార్డులో వయస్సు మార్చి మరి లబ్ధి
- గత ప్రభుత్వంలో వైసీపీ నేతల సంక్షేమ దోపిడీ
- విచారించి అనర్హులను తొలగించాలని డిమాండ్

అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించడమే కాకుండా సహజవనరులతోపాటు అన్నింటినీ దోచేసిన వైసీపీ నాయకులు చివరకు పేద అభాగ్యుల ఆసరా కోసం ఇస్తున్న పింఛన్లను వదలకుండా తినేశారు. ఏకంగా వేల సంఖ్యలో వృద్ధాప్య, వితంతు పింఛన్లతోపాటు విభిన్న ప్రతిభావంతుల కోటాను కొట్టేశారు. ఆధార్ కార్డులో వయసు మార్పించుకొని కొందరు ఐదేళ్లుగా సాయాన్ని స్వాహాచేశారు. ఆస్పత్రులలో సిబ్బందికి మామూళ్లు ఇచ్చి దొంగ ధ్రువీకరణ పత్రాలు, సదరమ్ సర్టిఫికెట్లు పొందారు. వాటితో నెలనెలా పింఛన్లు పొందుతున్నారు. ఒక్క ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోనే 7వేల దొంగ పింఛన్లు ఉన్నాయంటే ఇక జిల్లావ్యాప్తంగా ఎంతమంది ఉన్నారో తేలాల్సి ఉంది. అధికారులు స్పందించి పరిశీలన చేసి దొంగ పింఛన్‌దారులను ఆట కట్టించాల్సి ఉంది.



పుల్లలచెరువు మండలం సిద్ధన్నపాలెంలో మానసికస్థితి బాగలేదని పింఛన్ తీసుకుంటున్న వైసీపీ నాయకుడు రాచగొర్ల అచ్చయ్య(ఫైల్)

పుల్లలచెరువు, జూలై 25: వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా దొంగ పింఛన్లు పుట్టుకొచ్చాయి. ఆధార్ కార్డులో వయసు మార్చి కొందరు, వైద్యశాలల్లో భారీగా మామూళ్లు ఇచ్చి సదరమ్ సర్టిఫికెట్లు పొంది మరికొందరు.. ఇలా అనర్హులు వృద్ధాప్య, విభిన్న ప్రతిభావంతుల పింఛన్లు పొందుతున్నారు. ఒక్క ఎర్రగొండపాలెంలోనే ఇలాంటి వారు 7వేల మందికిపైగా ఉన్నట్లు సమాచారం. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, మార్కాపురం, వినుకొండ, గుంటూరు కేంద్రంగా ఆధార్‌సెంటర్లలో ఆధార్ కార్డుల్లో వయసు మార్చారు. తద్వారా 40ఏళ్ల వయసు ఉన్న అనర్హులు యథేచ్ఛగా పింఛన్లు పొందుతున్నారు. ఆధార్ నిర్వాహకులు వారి నుంచి రూ.5వేలు వసూలు చేసి వయసు మారుస్తున్నారు. మరికొందరు యువకులు ఎర్రగొండపాలెం, మార్కాపురం, గుంటూరు, ఒంగోలు, తెనాలి వైద్యశాలల్లో వైద్యులకు రూ.30వేలకుపైగా మామూళ్లు ఇచ్చి మానసిక, ఇతర దివ్యాంగులుగా సదరమ్ సర్టిఫికెట్లు పొంది అక్రమంగా పింఛన్లు పొందుతున్నారు.

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 36,581 మంది పింఛన్‌దారులు ఉన్నారు. పుల్లలచెరువు మండలంలో 7,867, ఎర్రగొండపాలెం మండలంలో 8,411, దోర్నాల మండలంలో 5,615, త్రిపురాంతకం మండలంలో 8,642, పెద్దారవీడు మండలంలో 6,046 మంది నెలనెలా పింఛన్లు తీసుకుంటున్నారు. వీరిలో సూమారు 20 శాతం అంటే ఇంచుమించు 7,000 దొంగ పింఛన్లు ఉన్నాయి. దీంతో నెలకు సూమారు రూ.2.80 కోట్లు అనర్హులు మెక్కేస్తున్నారు. అయితే అడ్డుకోవాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా యథేచ్ఛగా నిధులు మంజూరు చేస్తున్నారు.

పింఛన్ మంజూరుకు వెల్ఫేర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోల సర్టిఫికెట్‌తోపాటు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇవ్వాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా ఆధార్‌లో వయసు మార్చుకున్న అనర్హులు, నకిలీ ధ్రువీకరణ పత్రాలు పొందినవారి నుంచి రూ.10 వేల తీసుకొని ఈ అడ్డగోలుగా పింఛన్లు మంజూరు చేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఒక్క ఐటీవవరం పంచాయతీలోనే సూమారు 50కి పైగా దొంగ పింఛన్లు ఉన్నాయి.

వై.కొత్తపల్లిలో 20కుపైగా..

ఎర్రగొండపాలెం పంచాయతీ పరిధిలోని వై.కొత్తపల్లిలో 20కిపైగా దొంగ పింఛన్లు ఉన్నాయి. అందులో 10మందికిపైగా తక్కువ వయస్సు ఉన్న వ్యక్తులు వృద్ధాప్య పింఛన్లు, మరో 10 మంది నకిలీ దివ్యాంగుల సర్టిఫికెట్స్ పుట్టించి యథేచ్ఛగా పొందుతున్నారు.

- సిద్దన్నపాలేనికి చెందిన 35ఏళ్ల రాచగొర్ల అచ్చయ్య అనే వైసీపీ నాయకుడు తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో మానసిక వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణపత్రం పొందాడు. దాని ద్వారా రెండేళ్లగా పింఛన్ పొందుతున్నాడు.
- ఐటీవరానికి చెందిన గంపనబోయిన ఆంజనేయులు(30) మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో అంగ వైకల్యం(51 శాతం) ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకున్నాడు. రెండేళ్లగా పింఛన్ పొందుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన మరో నాయకుడి భార్యకు ఒంటరి మహిళ పింఛన్ అందుతోంది.
- పుల్లలచెరువు మండలంతోపాటు ఎర్రగొండపాలెం నియోజకర్గంలోని ప్రతి మేజర్ పంచాయతీలో 100 పైగా దొంగ పింఛన్లు ఉన్నాయి. అధికారులు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా యథేచ్ఛగా పింఛన్లు ఇస్తున్నారు.

వీరభద్రాపురం వారికి మల్లాపాలెంలో పింఛన్లు

ఎర్రగొండపాలెం మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందిన ముగ్గురు పుల్లలచెరువు మండలం మల్లాపాలెంలో దొంగ పింఛన్లు పొందుతున్నారు. అందులో ఒకటి వితంతు, మరో రెండు వృద్ధాప్య పింఛన్లు తీసుకుంటున్నారు. ఒక్క మల్లాపాలెంలోనే సుమారు 50కిపైగా దొంగ పింఛన్లు పొందుతున్నారు. వైపాలెం నియోజకవర్గంలోనే 7వేల దొంగ పింఛన్‌లు ఉంటే.. జిల్లాలో ఇలాంటివి ఎన్ని ఉన్నాయోనన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా కలెక్టరు, ఉన్నతాధికారులు స్పందించి విచారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా డెయిరీని పునరుద్ధరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 25 : ఒంగోలు పాల డెయి రీ పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులు కేటాయించి వెంటనే ప్రారంభించాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సీపీఐ జిల్లాసమితి ఆధ్వర్యంలో గురువారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఈ శ్వరయ్య మాట్లాడుతూ పాడిరైతులు రూపాయి రూపాయి కూడబెట్టి ఒంగోలు డెయిరీని ఏర్పాటు చేసుకున్నారన్నారు. 1987లో పాల పొడి ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరగ్గా స్థలానికి పాడిరైతులు రూ. 19 లక్షలు విరాళం కూడా ఇచ్చారన్నారు. 2014వరకు లాభాల బాటలో నడిచిన డెయిరీని సహకారరంగం నుంచి కంపెనీ యాక్టులోకి తీసుకరావడంతో సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఆ తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నాశనం చేసిందని విమర్శించారు. డెయిరీని ప్రభుత్వం నిర్వహించాలని అందుకో సం సీఎం చంద్రబాబు వద్దకు రాయబారానికి సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. వెయ్యి కోట్ల ఆస్తుల కు రక్షణ కల్పించాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఒంగోలు డె యిరీ పూర్వాధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ డెయిరీ పాలన సహకారం నుంచి కంపెనీ యాక్టులోకి వెళ్లిన నాటి నుంచి వ్యక్తుల చేతుల్లోకి పోయి పూర్తిస్థాయిలో నాశనమైందన్నారు. రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్‌లు మాట్లాడుతూ ఒంగోలు డెయిరీ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో డీవీఎస్ స్వామి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పీవీఆర్ చౌదరి, ఎస్.లలితకుమారి, కొత్తకోట వెంకటేశ్వర్లు, పమిడి వెంకట్రావు, వల్లంరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు

వైద్యారోగ్యశాఖలో విచారణ

- హెల్త్ అసిస్టెంట్ల నియామకంపై ఆరోపణలు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 25: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 2002 నుంచి ఇప్పటివరకు జరిగిన హెల్త్ అసిస్టెంట్ల నియామకాలపై గుంటూరు జోనల్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి విచారణ చేపట్టారు. 2002లో జరిగిన హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో భారీ అక్రమాలు జరిగాయని ఐదేళ్ల క్రితం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో గుంటూరు జోన్ పరిధిలోని గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఆ నియామకాలపై విచారణకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గుంటూరు, నెల్లూరు జిల్లాల విచారణ పూర్తయింది. గురువారం కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ల నియామకాలపై విచారణ చేశారు. ఉద్యోగాలు ఎప్పుడు ఇచ్చారు, ఎన్ని పోస్టులకు ఇచ్చారు, ఆ ఉద్యోగికి అర్హత ఉందా లేదా తదితర అంశాలను పరిశీలించారు. జిల్లాలో పనిచేస్తున్న 160మంది హెల్త్ అసిస్టెంట్లు పనిచేస్తుండగా వారిలో వందమంది రెగ్యులర్ కాగా మిగిలిన వారు కాంట్రాక్టు పద్ధతిని పనిచేస్తున్నారు. వారందరిని విచారణకు హాజరుకావాలని డీఎంహెచ్ఓ ఆదేశాలు జారీచేయడంతో అందరూ వచ్చారు. విచారణలో అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. అనంతరం డిక్లరేషన్ పత్రాలను తీసుకున్నారు. మూడు జిల్లాల్లో నిర్వహించిన విచారణ నివేదికను త్వరలో వైద్యశాఖకు సమర్పిస్తామని ఆర్‌డీ శోభారాణి తెలిపారు. ఈ విచారణలో గుంటూరు డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మజ, డాక్టర్ వాణిశ్రీ, వైద్యశాఖ పరిపాలనాధికారి గీతాంజలి, రాజేష్ తదితరులు ఉన్నారు.

పాఠశాల విద్యా పరీక్షల షెడ్యూల్

ఒంగోలు(విద్య), జూలై 25 : ఈ విద్యా సంవత్సరం పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 1 నుంచి 10వతరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నిర్వహించనున్న పరీక్షల తేదీలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది.

ఫార్మెటివ్-1: ఆగస్టు 1 నుంచి 5 వరకు నిర్వహిస్తారు.

ఫార్మెటివ్-2: సెప్టెంబరు 26 నుంచి 30 వరకు జరుగుతాయి.

సమ్మెటివ్-1: పరీక్షలు నవంబరు 1 నుంచి 15 వరకు జరుగుతాయి

ఫార్మెటివ్-3: 2025 జనవరి 2నుంచి 6 వరకు జరుగుతాయి

పదవతరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు: 2025 ఫిబ్రవరి 10నుంచి 20 వరకు జరుగుతాయి.

ఫార్మెటివ్-4 : వచ్చే ఏడాది మార్చి 3నుంచి6 వరకు జరుగుతాయి

సమ్మెటివ్-2: ఏప్రిల్ 7నుంచి18 వరకు జరుగుతాయి

విద్యార్థులకు దసరా సెలవులు అక్టోబరు 4నుంచి 13 వరకు ఉంటాయి.

మైనార్టీ విద్యాసంస్థలకు దసరా సెలవులు అక్టోబరు 11 నుంచి 13 వరకు ఉంటాయి.

పాఠశాలలకు సంక్రాంతి సెలవులు 2025 జనవరి 11 నుంచి 19 వరకు, క్రిస్మస్ సెలవులు డిసెంబరు 20 నుంచి 29 వరకు వరకు ఉంటాయి.

నేటి నుంచి వేలంకేంద్రాలు పునఃప్రారంభం

ఒంగోలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది వేలంకేంద్రాలలో పొగాకు కొనుగోళ్లు శుక్రవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి అధికంగా ఉత్పత్తి అయిన పంట కొనుగోలుకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ అనుమతించిన నేపథ్యంలో తిరిగి వేలాన్ని బోర్డు అధికారులు చేపడుతున్నారు. దీంతో దాదాపు మూడు వారాలుగా ఆగిపోయిన పొగాకు వేలం తిరిగి ప్రారంభం కానుంది. ప్రస్తుత ఏడాది దక్షిణాదిలో 88.69 మిలియన్ కిలోలు పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా రైతులు దాదాపు 140 మిలియన్ కిలోలు పంట పండించిన విషయం విదితమే. వాతావరణం అనుకూలతతో పాటు మార్కెట్‌లో అంతకు ముందు ఏడాది పంటకు ఉన్న డిమాండ్, లభించిన ఆదాయం ఇతరత్రా అంశాలతో సాగు విస్తారంగా జరిగింది. ఆ మేర ఉత్పత్తి కూడా పెరగ్గా ఫిబ్రవరి 29న తొలి విడత, మార్చి 6 న రెండవ విడత వేలం ప్రారంభమైంది. గతంలో ఎన్నడూ లేనంతగా మార్కెట్లో డిమాండ్‌తో పాటు భారీగా ధరలు లభించాయి. గరిష్ఠంగా కిలో రూ.366 ధర లభించడంతోపాటు మీడియం, మేలు రకంతేడా లేకుండా కొన్నారు. అలా ఈనెల తొలివారానికి 91 మిలియన్ కిలోలు కొనుగోళ్లు జరగ్గా కిలోకు సగటున రూ.252 ధర లభించింది. ఇది పొగాకు బోర్డు చరిత్రలో దక్షిణాదిలో ఆల్‌టైమ్‌ల రికార్డు. ఆ విషయం అలా ఉంచితే అప్పటికి ఆయా వేలం కేంద్రాలలో అనుమతించిన కొనుగోళ్లు పూర్తికాగా అదనపు పంట విక్రయాలకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ నుంచి ముందుగా అనుమతిని బోర్డు అధికారులు తీసుకోలేకపోయారు. అధిక పంట ఉత్పత్తిపై అపరాధ రుసుం విషయంలో కేంద్రం నిర్ణయం జాప్యం జరగడంతో ఆ పరిస్థితి ఏర్పడగా వేలం కేంద్రాలలో కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఆసమయానికి రైతుల వద్ద 49 మిలియన్ కిలోల పంట ఉంది. మూడు వారాల నుంచి వేలం ఆగిపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది. ఈ విషయాన్ని పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చొరవతో రాష్ట్రానికి చెందిన ఎంపీలు శ్రీకృష్ణదేవరాయులు, పురందేశ్వరిలు బుధవారం కేంద్రమంత్రి పియూష్ గోయల్ దృష్టికి తీసుకెళ్లారు. అధిక పంట కొనుగోలు ఉత్తర్వుల తోపాటు అపరాధ రుసుం కూడా గతంలో వలే రద్దుచేయాలని కోరారు. ఆ వెంటనే ఉన్నతాధికారులలో కదలిక వచ్చి అపరాధరుసుం రద్దుచేయడంతోపాటు కొనుగోళ్లకు అనుమతిస్తూ అర్ధరాత్రికి గెజిట్ విడుదలైంది. దీంతో తక్షణం వేలంకేంద్రాలు పునఃప్రారంభానికి బోర్డు అధికారులు చర్యలు చేపట్టారు.శుక్రవారం నుంచి దక్షిణాది వేలంకేంద్రాలలో కొనుగోళ్లు తిరిగి ప్రారంభం కానున్నాయి.

నిరుపయోగంగా ఇండోర్ స్టేడియం

- టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.60కోట్లతో నిర్మాణం
- ఏడాదిన్నర పాటు నిర్వహణ
- గత వైసీపీ ప్రభుత్వంలో కోచ్‌ల తొలగింపు
- షటిల్ బ్యాడ్మింటన్‌కు మాత్రమే పరిమితం



నిరుపయోగంగా ఉన్న స్టేడియం ఆవరణలోని షాప్‌లు

అద్దంకి, జూలై 25 : ఆటలలో యువతను ప్రోత్సహించేందుకు వీలుగా గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అద్దంకి పట్టణానికి సమీపంలో శింగరకొండ వద్ద సుమారు రూ.2.60కోట్లతో ఇండోర్ స్టేడియం (క్రీడా వికాస కేంద్రం)ను అప్పటి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. కాం ట్రాక్ట్ పద్ధతిపై కోచ్‌లను నియమించారు. సుమారు ఏడాదిన్నర పాటు క్రీడాకారులకు అందుబాటులో ఉండి ఉపయోగపడింది. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి కోచ్‌లను తొలగించారు. దీంతో మొక్కుబడిగా ఇతర ప్రాంతాల నుంచి డిప్యూటేషన్‌పై నియమించారు. ఎంతో విలువైన జిమ్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అదే సమయంలో క్యారమ్స్, చెస్ మరికొన్ని ఇండోర్ ఆటలకు వీలుగా వసతులు ఉన్నాయి.



నిరుపయోగంగా జిమ్ పరికరాలు

అద్దంకి పట్టణంలో షటిల్ క్రీడాకారులు ఎక్కువగా ఉండడం, డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు షటిల్ కోర్టు పైఒకింత శ్రద్ధ పెట్టడడంతో షటిల్ కోర్టు ను మాత్రం వినియోగిస్తున్నారు. మిగిలిన అన్ని పరికరాలు నిరుపయోగంగా మారాయి. అదే సమయంలో కోచ్‌లు అందుబాటులో లేకపోవడం తో మరికొన్ని క్రీడా పరికరాల కల్పనపై కూడా దృష్టి సారించలేదు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, స్థానిక ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా కూడా ఉండడంతో ఇండోర్‌స్టేడియానికి మరలా మహర్దశ వస్తుందన్న ఆశతో క్రీడాకారులు ఉన్నారు. ప్రస్తుతం వాచ్‌మన్ మాత్రమే ఉన్నారు. కోచ్‌లను నియమించి, ఇతర క్రీడా వస్తువులను సమకూర్చితే విద్యార్థులు, యువతకు మరింత ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. సమీపంలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు కూడా ఉండడంతో విద్యార్థులు వినియోగించుకునే అవకాశం ఉంటుందని పలువురు క్రీడాకారులు అభిప్రాయపడుతున్నారు.

పెట్టుబడి నిధి మాటేంటి..!

- సీఎంఎంని నిలదీసిన స్వయం సంఘాల సభ్యులు
- పొంతనలేని సమాధానాలపై మహిళల ఆగ్రహం



సీఎంఎం ఫణికుమారిని ప్రశ్నిస్తున్న మెప్మా సంఘాల సభ్యులు

అద్దంకి, జూలై 25: మెప్మా స్వయం సహాయక సంఘాల సభ్యుల పెట్టుబడి నిధిలో నిర్వహించిన మహిళా మార్ట్ మూతపడగా ఇంతవరకు సభ్యులకు పెట్టుబడి డబ్బులు పంపిణీ చేయలేదు. దీంతో ఆగ్రహించిన స్వయం సహాయక సంఘాల సభ్యులు గురువారం మెప్మా కార్యాలయానికి వెళ్లి సీఎంఎం ఫణికుమారిని నిలదీశారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో తిట్ల దండకం చేపట్టారు. అద్దంకి పట్టణంలోని సుమారు 8వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి రూ.150 చొప్పున వసూలు చేసి సుమారు రూ.11లక్షల పెట్టుబడి నిధితో మహిళా మార్ట్‌ను రెండున్నర సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఇంతవరకు సభ్యులకు జమా ఖర్చులు చేప్పిన దాఖలాలు లేవు.

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మహిళా మార్ట్ నిర్వహిస్తున్న భవనం గతంలో అన్న క్యాంటీన్‌ను నిర్వహించారు. తిరిగి దానిలో అన్న క్యాంటీన్ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతుండడంతో మహిళా మార్ట్‌ను మూసివేశారు. అయితే మహిళా మార్ట్‌కు సంబంధించి నిధులు గోల్‌మాల్ జరిగాయన్న ఆరోపణలు రావడం, అందుకు సంబంధించి జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందడంతో ఇటీవల విచారణలు జరిగాయి. ఈ నేపథ్యంలో తమ పెట్టుబడి డబ్బుల పరిస్థితి ఏమిటని సమారు 200 మంది సభ్యులు గురువారం మెప్మా కార్యాలయం వద్దకు వెళ్లి నిలదీశారు. సీఎంఎం సరైనా సమాధానం చెప్పడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి తమ పెట్టుబడి డబ్బులు తమకు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని సభ్యులు కోరుతున్నారు. వెంటనే పరిష్కార మార్గం చేపట్టకపోతే మిగిలిన సభ్యులంతా ఆందోళనకు దిగేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది.

108లో ఈఎంటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చీరాలటౌన్, జూలై 25: 108 అంబులెన్స్ వాహనాలల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ), డ్రైవర్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలల్లో డ్రైవర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు బాపట్ల జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈఎంటీకి జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు చేసిన వారు అర్హులని, డ్రైవర్/పైలెట్‌కు టెన్త్ ఉత్తీర్ణత, హెవీ డ్రైవింగ్ లైసెన్స్, 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు, ఇంగ్లీష్ చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. అర్హులైనవారు 27వ తేదీలోపు చీరాల గవర్నమెంట్ ఏరియా హస్పిటల్ లోని 108 కార్యాలయంలో ఆరకాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 8885107040, 8309530078 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

చిన్నారులకు ఉచిత ఆధార్ సేవలు

బల్లికురవ, జూలై 25 : అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న అయిదేళ్లలోపు చిన్నారులకు ప్రభుత్వ ఆదేశాలతో ఉచితంగా ఆధార్ సేవలను అందిస్తున్నట్లు అంబడిపూడి కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకురాలు బొట్లగుంట దేవి తెలిపారు. ఈ నెల 27వ తేదీలోపు గ్రామాలలో ఉన్న అంగన్‌వాడీల విద్యార్థులకు ప్రత్యేక క్యాంప్‌లు పెట్టి ఆధార్ కార్డులు తీస్తామని, తల్లి దండ్రులు వినియోగించుకోవాలని కోరారు.

నిలిచిన కాపు కల్యాణ మండప నిర్మాణాలు

- పిల్లర్ల దశలోనే శిథిలావస్థకు
- పట్టించుకోని అధికారులు
- టీడీపీ రాకతో ఆ వర్గాల్లో ఆశలు

బల్లికురవ, జూలై 25 : గతంలో టీడీపీ ప్రభుత్వం కాపు కార్పొరేషన్ ద్వారా కాపు సామాజిక వర్గానికి మేలు జరిగేలా పలు గ్రామాలలో కాపు కల్యాణ మండపాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కాపు కల్యాణ మంపడపాల నిర్మాణ పనుల ఊసే లేకుండా పోయింది. దీంతో గతంలో మంజూరు అయిన నిధులతో అరకొరగా పనులు పూర్తి అయిన కాపు కల్యాణ మండపాల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పుడు మరలా టీడీపీ ప్రభుత్వం రావడంతో కాపు కల్యాణ మండపాలపై ఆ వర్గంలో ఆశలు చిగురిస్తున్నాయి. కల్యాణ మండపాల నిర్మాణ పనుల కోసం వారు ఎదురు చూపులు చుస్తున్నారు.

గతంలో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కాపు సామాజిక వర్గం అధికంగా ఉన్న గ్రామాలలో కాపు కల్యాణ మండపాల కోసం కాపు కార్పొరేషన్ ద్వారా ఒక్కో భవనానికి 2017 లో రూ.15లక్షల వరకు మంజూరు చేశారు. బల్లికురవ మండలంలోని వైదన, ముక్తేశ్వరం, రామాంజనేయ


వైదనలో పిల్లర్ల దశలోనే ఉన్న మండపం

పురం, కొణిదెన, సంతమాగులూరు మండలం ఏల్చూరు, బండివారిపాలెం గ్రామాలలో కాపు కల్యాణ మండపాల ఏర్పాటుకు అప్పట్లో ప్రభుత్వం నిధులను మంజురు చేసింది. పై గ్రామాలలో కల్యాణ మండపాల పనులు ప్రారంభం అయిన కొద్ది కాలానికే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాపు కల్యాణ మండపాల పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచి పోయాయి. కొన్ని గ్రామాలలో పిల్లర్ల దశలో పనులు ఆగి పోగా కొన్ని గ్రామాలలో స్లాబులు వేసి పనులు పూర్తి చేయకుండా అలానే నిలిచిపోయాయి. దీంతో కాపు సామాజిక వర్గం వారు కల్యాణ మండపాల కోసం ఎదురు చుపులు చూస్తున్నారు. అధికారులు సైతం వైసీపీ పాలకుల ఒత్తిడితో టీడీపీ ఏర్పాటు చేసిన మండపాలను పూర్తి చేయించేందుకు వెనకడుగు వేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం మరలా అధికారంలోకి రావడంతో గ్రామాలలో పనులు పూర్తి చేయకుండానే శిథిలావస్థకు చేరుతున్న కాపు కల్యాణ మండపాలను పూర్తి చేస్తారనే నమ్మకం కాపులలో నెలకుంది. అధికారులు, పాలకులు వెంటనే గ్రామాలలో అసంపూర్తిగా ఉన్న కాపు కల్యాణ మండపాల పనులను పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ముక్తేశ్వరంలో నిలిచిన మండపం


మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, చేనేత నాయకులు

చేనేతల సమస్యలను పరిష్కరించాలి

మంత్రి సవితకు ఎమ్మెల్యే కొండయ్యతో కలిసి విన్నవించిన ప్రతినిధులు

చీరాల, జూలై 25 : రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవితను గురువారం అమరావతిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతో కలసి చీరాల చేనేత ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చీరాల నియోజకవర్గంలో నేతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై కొంతసేపు చర్చించారు. స్థానిక స్థితిగతులను వివరించారు. అందుకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. నేతన్నల పక్షాన ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ తమ నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు చీరాల ప్రాంత చేనేత ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలను రక్షించాలని విద్యార్థుల ర్యాలీ

మార్టూరు, జూలై 25 : ప్రతి ఒక్కరూ మొక్కలను రక్షించడంతోపాటు ప్లాస్టిక్‌ను నిషేధించాలని గురువారం మార్టూరు సెంటర్లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఉదయం స్కూల్ ప్రాంగణం నుంచి ప్రిన్సిపాల్ కే సంపత్‌కుమార్ జెండాను ఊపి ప్రారంభించగా నాగరాజుపల్లి సెంటర్, పెద్ద అండర్ పాస్ వరకూ ర్యాలీగా వెళ్లిన అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో ఏలూరి శేషగిరిరావు, డీన్ రాఘవ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ నాయకుల హర్షం

చీరాల, జూలై 25 : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రయోజనాలకు సముచితంగా నిధులు కేటాయించారని, ఇది అందరూ హర్షించదగ్గ విషయమని నాయకులు హర్షం వ్యక్తం చేశారు పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తికి, రైల్వేకు సంబంధించి రాష్ట్రానికి రూ.9,151కోట్లు కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మువ్వల వెంకటరమణారావు, అర్వపల్లి కుమార్, గౌరబత్తుని జైశంకర్, నాశిక శివాజీ, బిట్రా శ్రీను, తడవర్తి చంద్రశేఖర్, రత్నం, మనోహరరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయండి

ఇంకొల్లు, జూలై 25 : ఇంకొల్లులో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలసీతారామన్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఇంకొల్లు మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహనకృష్ణ ఈ మెయిల్ ద్వారా వినతిపత్రం పంపినట్లు తెలిపారు. తొలుత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలిసి వినతిపత్రం అందజేసామన్నారు.


పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో, డీఎల్‌పీవో

వేగంగా చెరువులు నింపండి

మార్టూరు, జూలై 25 : గ్రామాలలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా వస్తున్న సాగర్ జలాలతో వీలైనంత త్వరితంగా చెరువులను నింపుకోవాలని డీపీవో రవికుమార్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలో సాగర్ జలాలను చెరువులకు నింపుకునే విషయంపై పరిశీలన చేయడానికి డీపీవో రవికుమార్, డీఎల్‌పీవో హనుమంతరావులు మార్టూరు వచ్చారు. సాగర్ జలాలు చేరుతున్న మంచినీటి చెరువును వారు పరిశీలించారు. గ్రామాలలో చెరువులకు చేరుతున్న సాగర్ జలాలపై వివరాలను అడిగితెలుసుకున్నారు. మార్టూరు చెరువుకు నాలుగు మోటార్లు ఏర్పాటు చేశామని తద్వారా వేగంగా నీళ్లు చేరుతున్నాయని పంచాయతీ అధికారి తన్నీరు శ్రీనివాసరావు అధికారులకు తెలిపారు. అనంతరం అధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ హర్షవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

కలవకూరులో గ్రావెల్ తవ్వకం అడ్డగింత

అద్దంకి, జూలై 25 : మండలంలోని కలవకూరు చెరువులో గ్రావెల్ తవ్వకాన్ని గ్రామస్థులు గురువారం అడ్డుకున్నారు. కలవకూరు చెరువులో మట్టిని అద్దంకి పట్టణంలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లకు టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం వైసీపీ నేతల ఆధ్వర్యంలో గ్రామస్థులు అడ్డుకున్నారు. అయితే గతంలో పలు సందర్భాలలో మట్టి తరలింపు యథేశ్చగా జరిగినా మిన్నకున్న గ్రామస్థులు గురువారం అడ్డుకోవటం పట్ల పలు అనుమానాలకు తావిస్తుంది.

పేదరిక నిర్మూలనకు కృషి చేయాలి

ఇంకొల్లు, జూలై 25 : పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సెల్ప్ అధికారి సత్యభామ అధికారులకు సూచించారు. ఇంకొల్లు వెలుగు కార్యాలయంలో విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి అధికారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఇంకొల్లు గ్రామైక్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి కుటుంబ పరిస్థితుల గురించి నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం మోహనరావు, సీసీలు పాల్గొన్నారు.

నారపురెడ్డికి నివాళి

ఇంకొల్లు, జూలై 25 : మండలంలోని పావులూరు గ్రామానికి చెందిన పావులూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తాటిపర్తి నారపరెడ్డికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన దశదినకర్మ గురువారం పావులూరులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. నారపరెడ్డి కొంతకాలం పావులూరు పొలిమేర ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానసత్రాన్ని నిర్వహించి భక్తుల మన్ననల పొందినట్లు గుర్తు చేశారు.

నేడు ప్రగడ కోటయ్య జయంతి

చీరాల, జూలై 25 : ప్రజాబంధు ప్రగడ కోటయ్య కాంస్య విగ్రహం వద్ద శుక్రవారం ఆయన జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహక ప్రతినిధి దామర్ల శ్రీకృష్ణ గురువారం తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. అందురు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఊరచెరువుపై సమగ్ర సర్వే

- ఇన్‌చార్జి తహసీల్దార్ ఆధ్వర్యంలో ప్రారంభం

అద్దంకి, జూలై 25 : అద్దంకి పట్టణంలో అంతర్భాగంగా మారిన ఊరచెరువు పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురైంది. గతంలో ఎన్‌టీఆర్‌నగర్ పేరుతో పలువురు పేదలకు ఇళ్ల స్థలాలను ఇచ్చారు. వైసీపీ పాలనలో పలువురు వైసీపీ నేతలు మరికొంత భాగాన్ని ఆక్రమించి ఇళ్ల స్థలాలుగా అమ్మకాలు చేశారు. ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడంతో ఇటీవల జాయింట్ కలెక్టర్ సుబ్బారావు పరిశీలించి పూర్తి స్థాయిలో సర్వే చేసి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం ఇన్‌చార్జి తహసీల్దార్ సుధారాణి ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. సర్వేయర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఉత్తర అద్దంకి రెవెన్యూ పరిధిలోని 95 సర్వే నెంబరులో ఉన్న సుమారు 120ఎకరాల ఊర చెరువు సరిహద్దుల నిర్ధారణ సర్వే నిర్వహిస్తున్నారు. ఆర్‌ఐ శంకర్ ఆధ్వర్యంలో 6 బృందాలు ఇంటింటి సర్వే చేస్తూ నివాస ప్రాంతాలు, కుటుంబాల వివరాలను సేకరిస్తున్నారు.


ఎన్‌టీఆర్‌నగర్‌లో పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ సుధారాణి, సర్వేయర్, ఆర్‌ఐ


పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

చినగంజాం, జూలై 25 : గ్రామాల్లో నూతనంగా నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను వెంటనే వినియోగంలోనికి తేవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన చెత్త సంపద కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఆగస్టు 15వ తేదీ నాటికి గ్రామాల్లో ఉన్న చెత్త చెంపద కేంద్రాలను వినియోగంలోనికి తీసుకొని రావాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు కొత్తపాలెంలోని చెత్త సంపద కేంద్రం పరిసర ప్రాంతాలలో ఉన్న చిల్ల చెట్లను జేసీబీ ద్వారా తొలగించే పనులు, కేంద్రానికి వచ్చే రోడ్డు పనులను ఆయన పరిశీలించి గ్రామ కార్యదర్శి బాబూరావుకి పలు సూచనలు అందజేశారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్త, ఇతర వ్యర్థపదార్థాలను ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద వేరు చేయాలని సూచించారు. కేంద్రాల వద్ద సేకరించిన చెత్తను తగలు బెట్టరాదని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో సాంస్కృతిక దినోత్సవం

అద్దంకిటౌన్, జూలై 25 : మండలంలోని తిమ్మాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భిన్నత్వంలో ఏ కత్వమే ప్రధాన లక్ష్యంగా భారతీయ సంస్కృతిని విద్యార్థులు కలిగి ఉండాలని, భావిభారత పౌరులుగా ఎదగాలన్నారు. వివిధ భాషలు మాట్లాడేటట్టుగా పిల్లలను ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో వీ సుధాకర్, విద్యా కమిటీ చైర్మన్ తేలక రమాదేవి, సీఆర్ఎంటీ ఎం.రమేష్ పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

కారంచేడు(పర్చూరు), జూలై 25 : ప్రకృతి వ్యవసాయంతో అతిక్కువ ఖర్చుతోపాటు నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మాస్టర్ ట్రైనర్ అప్పారావు అన్నారు. గురువారం కారంచేడు సమైక్య కార్యాలయం ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తక్కువ భూమిలో సైతం ప్రకృతి వ్యవసాయం చేపట్టి నిరంతర ఆదాయం పొందవచ్చన్నారు. ప్రస్తుత వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం అధికంగా నిర్వహించడం వల్ల భూమి నిస్సారంగా మారుతుందన్నారు. అమృతాలు, కషాయాలతో భూమిని సారవంతం చేసే విధంగా ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు, ఇతర సభ్యులు, వీవోఏలు ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, జూలై 25 : విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా అద్దంకి పట్టణంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. రేణింగవరం రోడ్డు, నామ్ రోడ్డు, కొత్త దామావారిపాలెం, బంగ్లా రోడ్డులలో కొత్త విద్యుత్ లైన్లను కలుపుతున్నందున ఉదయం 7-30 నుంచి 9గంటల వరకు సరఫరా ఉండదన్నారు. దర్శి రోడ్డు ఉత్తరం భవానీ సెంటర్ నుంచి పెరికపాలెం వరకు పాత స్తంభాలు మార్చేందుకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, రామశాస్త్రి వీధి, మీనాక్షీ రెస్టారెంట్ వెనుక కొత్తలైన్‌లు ఏర్పాటుకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాలను పంపిణీచేస్తున్న రైతు వెంకటేశ్వర్లు

మార్టూరు, జూలై 25 : గ్రామ పంచాయతీ సమీపంలోని ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు చిమట వెంకటేశ్వర్లు అనే రైతు గురువారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు 18ఏళ్లుగా స్కూళ్లల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా మార్టూరులో కూడా 200 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. గత కొన్నేళ్లుగా ఈ పాఠశాలలో ఆయన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో అమ్మ ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందు, ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ జడ్పీటీసీ అల్లుడు అదృశ్యంపై కేసు

రాత్రికి ఇంటికి చేరిక

ఈపూరుపాలెం(చీరాలటౌన్) జూలై 25 : చీరాల మండలం జడ్పీటీసీ సభ్యుడు అల్లుడు మాజీ ఎంపీపీ కుమారుడు అదృశ్యంపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల వైసీపీ జడ్పీటీసీ సభ్యుడు ఆకురాతి పద్మిని కుమార్తె ప్రసన్నను మాజీ ఎంపీపీ కుమారుడు గంజి ప్రసాద్ కుమారుడు సుబ్బారావుతో వివాహం జరిగింది. రెండు కుటుంబాలు ఈపూరుపాలెంలోనే ఉంటున్నారు. కొద్ది రోజులుగా ఇంట్లో వివాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో సుబ్బారావు గత సోమవారం ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. అన్నిచోట్ల వెదికినా ఆచూకీ తెలియలేదు. గురువారం ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించారు. భార్య ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రాత్రి అయ్యే సరికి అతనే ఇంటికి తిరిగి వచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.

కుక్కల దాడితో బెంబేలెత్తుతున్న ప్రజలు

మేదరమెట్ల, జూలై 25 : కుక్కల భయంలో పిల్లలు ఒంటరిగా పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి మేదరమెట్లలో నెలకొంది. రాత్రిపూట కుక్కలు భయంకంగా అరుస్తూ గ్రామస్థులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. రోడ్డుపక్కన వేస్తున్న చెత్తను కుక్కలు చిందరవందర చేస్తున్నాయి. స్కూల్‌కు వెళ్లి వస్తున్న బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. గ్రామంలో పలు చోట్ల రాత్రి పూట ట్యూషన్‌కు వెళ్లి వస్తున్న పిల్లలపై దాడి చేసిన సంఘనలు ఉన్నాయి. ఇంటి బయట ఉన్న చెప్పులు, ఇతర వస్తువులను లాక్కు పోతున్నాయని గ్రామస్థులు చెప్తున్నారు. మాంసం దుకాణాల వద్ద గుంపులుగా ఒక్కసారిగా బైకులపై పడడంతో చాలా మంది ప్రమాదాలకు గురయ్యారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల దాడుల నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు. ఎక్కడైన దూరంగా కుక్కలను వదలివేసే కార్యక్రమం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శ్మశాన అభివృద్ధికి రూ.1.25లక్షల విరాళం

పర్చూరు, జూలై 25: గ్రామాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని మాజీ ప్రిన్సిపాల్ మంగళగిరి కోటేశ్వరరావు అన్నారు. పర్చూరులో గ్రామస్థుల సహకారంతో రూపుదిద్దుకుంటున్న శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు రొటేరియన్ కోటా శ్రీనివాసరావు, ప్రసన్న దంపతులు రూ.1.25లక్షల ఆర్థిక సహాయాన్ని నిర్వాహకులకు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. శ్మశాన వాటికలో చిల్లచెట్లు, ముళ్లపొదలతోపాటు, వ్యర్థాలతో డంపింగ్ యార్డును తలపిస్తున్న తరుణంలో గ్రామస్థులు స్పందించారు. దీనికి సంబంధించి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు జట్టుగా ఏర్పడి శ్మశాన వాటికి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం లక్షల రూపాయల నిధులతో ప్రాంగణం రూపుదిద్దుకుంటుంది. కార్యక్రమంలో ఒగ్గిశెట్టి గోవిందరాజులు, కృష్ణంశెట్టి శ్రీనివాసరావు, రంగిశెట్టి అంజనేయులు, తులసి శివనాగేశ్వరరావు, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.


నిర్వాహకులకు నగదు అందజేస్తున్న కోటా

హంగులు మిన్న.. సేవలు నామమాత్రం..!

- అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ప్రారంభమై ఏడాది
- నేటికీ ఒక్క శాంపిల్‌కూ జరగని టెస్ట్
- ఏడీ కార్యాలయం తెలియదంటున్న మత్స్యకారులు
- గుడ్డిలో మెల్లలా ఆక్వా పరీక్షలు

వేటపాలెం(చీరాల), జూలై 25 : అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తమ పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు. ఖరీఫ్ కాలం ప్రారంభమైంది. రైతులు వివిధ రకాల పైర్లను సాగుచేసేందుకు ఉన్న వనరులపై దృష్టి సారించారు. మత్స్యకారులకు సంధికాలపు భత్యం అందలేదు. ఆక్వా రైతులు ఆటుపోట్లు ఎదుర్కొంటున్నారు. తాజాగా వెల్లడించిన కేంద్ర బడ్జెట్‌లో దాణా ధరలు తగ్గిస్తున్నట్లు చేసిన ప్రకటనపై సాగుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలో ఉన్న అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ల భవన సముదాయం అన్ని హంగులతో ఉంది. ఏడాది క్రితం ప్రారరంభించారు. పరికరాలు వచ్చి 5 మాసాలు అవుతుంది. వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్యశాఖ, ఆక్వాకు సంబంధించిన అధికారులు ఉంటారు. ఆయా రంగాలకు చెందిన వ్యక్తులు తమ సాగుకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవచ్చు. సలహాలు పొందవచ్చు. క్షేత్రస్థాయిలో అక్కడ అందుతున్న సేవలలో ఆక్వాకు సంబంధించి తప్ప, మిగిలిన విభాగాలకు సంబంధించిన సేవలు నామమాత్రంగా కూడా అందడం లేదు. ఆయా పరీక్ష కేంద్రాలకు సంబంధించిన పరికరాలలో కొన్నింటిని నేటికీ ప్రారంభించలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

చీరాల నియోజకవర్గ స్థాయి ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను వేటపాలెం మండలం దేశాయిపేటలో నిర్మించారు. ఏడాది కిందట ఆ ల్యాబ్‌ల భవన సముదాయాన్ని ప్రారంభించారు. వ్యవసాయ, పశుసంవర్థక, ఆక్వా మత్స్యశాఖలకు సంబంధించి సాగులో వచ్చే ప్రతికూల పరిస్థితులను ముందుగానే తెలుసుకుని, పలు రకాల పరీక్షలు చేయించుకు కోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు ఇది ఉపయోగపడుతుంది.


దేశాయిపేటలోని అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ల భవనం..కవర్లు కూడా తీయని కుర్చీలు, పరికరాలు.. ఖాళీగా కన్పిస్తున్న ఫిషరీష్ ఏడీ కుర్చీ

వ్యవసాయశాఖ అధికారుల మాయాజాలం...!

ఏడాది క్రితం ప్రారంభమైన ఈ ల్యాబ్‌లకు సుమారు 5 మాసాల కిందట పరికరాలు, ఇతర సామగ్రిని సమకూర్చారు. సేద్యం చేసే రైతులకు సంబంధించి (విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు) ఇంత వరకు ఒక్క పరీక్ష కూడా జరగలేదు. సాధారణంగా రైతుల సాగులో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నాణత్యపై దిగుబడి ఆధారపడి ఉంటుంది. దీనికి సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు ఎరువులు, పురుగమందులు, విత్తనాల దుకాణాలలో ప్రతి ఏడాది వారికి ఇచ్చిన టార్గెట్ మేరకు శాంపిల్స్ తీస్తుంటారు. వాటిని ఆర్‌సీసీ (రీజనల్ కోడింగ్ సెంటర్)కు పంపుతుంటారు. శాంపిల్స్ తీసేముందు సదరు దుకాణదారులకు వ్యవసాయశాఖ స్థానిక అధికారుల నుంచి ముందస్తుగా సమాచారం వెలుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమంలో తాము తీసిన శాంపిల్స్ ఒకటి, రెండు ఫెయిలైనట్లు చూపి తనిఖీలు, శాంపిల్స్ పరీక్షలు పారదర్శకంగా జరిగినట్లు ఉండేవిధంగా అడుగులు వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించి ఏమాత్రం సందేహం వచ్చినా ముందుగా ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షలు చేయించుకుని తద్వారా మేలైన సాగు చేసుకోవచ్చు. అందుకు అనుగుణంగా పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పారదర్శకంగా శాంపిల్స్ తీస్తాం

ఎరువులు, పురుగుమందులు, విత్తనాలకు సంబంధించి ఏటా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీలు నిర్వహించి, శాంపిల్లను తీస్తాం. ఇది పారదర్శకంగా జరిగే ప్రక్రియ. ఆ శాంపిల్స్ రీజనల్ కోడింగ్ సెంటర్స్‌కు పంపిస్తాం. ఫలితాల అనంతరం చర్యలు తీసుకుంటాం. దేశాయిపేటలోని ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో రైతులు ఉచితంగా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవచ్చు.

- సుమతి, ఏవో, చీరాల మండలం


మత్స్యశాఖ ఏడీ కార్యాలయం ఎక్కడో తెలీదంటున్న మత్స్యకారులు

సముద్రంలో వేట నిషేధం సమయంలో మత్స్యకారులకు భృతి కోసం అందించే సంధికాలపు భత్యం ఇంతవరకు వారి ఖాతాల్లో జమకాలేదు. దీనికి సంబంధించి అధికారులను అడుగుదామంటే వారు ఎప్పుడు, ఎక్కడ ఉంటారో తెలియదని పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేటపాలెం మండలం దేశాయిపేటలోని అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ల భవన సముదాయంలోని పై అంతస్తును మత్స్యశాఖకు కేటాయించారు. అక్కడకు ఎప్పుడు వెళ్లినా ఏడీ, ఎఫ్‌డీవోలు అందుబాటులో ఉండరని, వారిని ఎప్పుడు కలవాలలో ప్రకటన చేస్తే ఆ రోజుల్లో, ఆ సమయాల్లో కలుస్తామని వారు అంటున్నారు.

పర్చూరులో జరుగుతున్నాయి.. ఇక్కడ ప్రారంభం కాలేదు

దేశాయిపేటలోని అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో పరీక్షలు ఇంకా ప్రారంభం కాలేదు. పరికరాలు వచ్చాయి. వాటిని ఇంకా ఇన్‌స్టాల్ చేయలేదు. త్వరలోనే చేస్తారు. రైతులు వస్తే వారికి ఉచితంగా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలకు సంబంధించిన పరీక్షలు చేసి రిపో ర్టు ఇస్తాం. ప్రస్తుతం పర్చూరులో ప్రారంభమైంది. అక్కడ కూడా నేనే ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను.

- సరిత, టెక్నికల్ ఏవో, అగ్రిటెస్టింగ్ ల్యాబ్, దేశాయిపేట



ఐక్యతను చాటేలా గణేష్ ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) : దేశభక్తి, ఐక్యతను చాటేలా సెప్టెంబరు 7నగణేష్ ఉత్సవాలు నిర్వహించాలని విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిట్టు నాగేశ్వరరావు తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 7 నుంచి 5రోజులు ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆయన తెలిపారు. 11వ తేదీన స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్‌లో వినాయక విగ్రహాల నిమజ్జం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 4 ఉత్సవ నిర్వాహకులతో సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీ.సురేంద్రరెడ్డి, వేలూరి మహేష్, నవీన్, శ్రీకాంత్, మండ్ల ఈశ్వరయ్య, ఏపీఆర్ మోహన్‌రావు, రంగరాజన్, హర్షవర్ధన్, కేవీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

నాటి పాపాల దస్త్రాలు భద్రమేనా!?

మదనపల్లి ఘటనతో ఉలికిపాటు

- గత ప్రభుత్వంలో అనేక భూకుంభకోణాలు
- అనర్హులకు అసైన్డ్‌భూములు ఇచ్చినట్లు ఆరోపణలు
- నాడు జాబితా కూడా బయటపెట్టని అధికారులు
- ఇప్పటికే పలు ఆర్డీవో కార్యాలయాల్లో కనిపించని ఫైళ్లు
- కొన్నింటిని మాయం చేసినట్లు ప్రచారం
- రికార్డుల భద్రతపై కలెక్టర్ ఆరా
- ఒక్క రికార్డూ బేజారకూడదంటూ ఆదేశాలు

అన్నమయ్య జిల్లా మదనపల్లి సబ్‌కలెక్టర్ తగలబడటం వెనుక 'కుట్ర' ఇప్పటికే బహిర్గమైంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి సంబంధించిన భూముల వ్యవహారాలతో ముడిపడిన ఫైళ్లు అక్కడే ఉండటం... అత్యంత కీలకమైన నిషేధిత భూముల జాబితా సెక్షన్‌లోనే అగ్గి రాజుకోవడంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ ఘటన నేపథ్యంలో మన జిల్లాలోని రెవెన్యూ రికార్డులు భద్రంగానే ఉన్నాయా!? గత ప్రభుత్వంలో జరిగిన అనేక భూ వ్యవహారాలకు సంబంధించిన రికార్డులు కార్యాలయాల్లోనే ఉన్నాయా!? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విచ్చలవిడిగా రెవెన్యూ రికార్డులను మార్చేసి అనేక మంది రెవెన్యూ సిబ్బంది సస్పెండ్ అయిన ఉదంతాలు ఇప్పుడు గుర్తుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఓ ఆనంద్ కూడా ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లోని రికార్డుల భద్రతపై ఆరా తీశారు. ఒక్క రికార్డు కూడా కార్యాలయం నుంచి బయటకు వెళ్లడానికి వీల్లేదంటూ సదరు అధికారులకు ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.





వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ అవినీతిలో కూరుకుపోయింది. అప్పటి అధికార పార్టీ నేతలు రెవెన్యూ కార్యాలయాలను తమ సొంత జాగీరుగా మార్చుకొని ఇష్టానుసారంగా రికార్డులు తారుమారు చేయించారు. రెవెన్యూ సిబ్బంది కూడావారిక వత్తాసు పలికారు. పొదలకూరు, వెంకటాచలం, సైదాపురం, రాపూరు, నెల్లూరు రూరల్, బుచ్చి, ఏఎస్‌పేట, సీతారామపురం, ఉదయగిరి, కావలి, దగదర్తి వంటి అనేక మండలాల్లో భారీ ఎత్తున భూ వివాదాలు తలెత్తాయి. ఇష్టానుసారంగా రికార్డులు మార్చేయడమే కారణమని నాటి అధికారులు తేల్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు వంద మంది వరకూ తహసీల్దార్ నుంచి వీఆర్వో స్థాయి వరకు రెవెన్యూ సిబ్బంది సస్పెండ్ అయ్యారు. కొంతమంది అక్రమార్కులు జైలుకు కూడా వెళ్లారు. ప్రభుత్వ భూముల స్థానంలో ప్రైవేటు వ్యక్తుల పేర్లు చేర్చారు. వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు పరులపాలయ్యాయి. అప్పటి ప్రతిపక్ష పార్టీ అయిన టీడీపీ నేతలు వైసీపీ భూ కుంభకోణాలపై ఆరోపణలు చేస్తూ వచ్చారు. గతంలో జరిగిన భూరికార్డుల మార్పులపై విచారణ జరిపితే అక్రమాల పుట్ట బద్ధలవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● పేదల మాటున అక్రమాలు

అసైన్‌మెంట్ భూముల పేరుతో భారీ కుంభకోణానికి తెరలేపారు. దాదాపు 8 వేల ఎకరాలను అసైన్‌మెంట్ కింద పేదలకు పంపిణీ చేసినట్లు నాటి ప్రజాప్రతినిదులు ప్రకటించారు. కానీ ఆ జాబితాను ఎక్కడా బయటపెట్టలేదు. ఆఖరుకు టీడీపీ నేతలు సమాచార హక్కు చట్టం ద్వారా ఈ వివరాలను అడిగినా ఇవ్వలేదు. నిబంధనల ప్రకారం అసైన్‌మెంట్ భూముల అర్హులను ఎంపిక చేసేందుకు గ్రామసభలు నిర్వహించాలి. అప్పుడు సదరు దరఖాస్తుదారు అర్హుడా.. కాదా.. అన్నది తేలుతుంది. కానీ జిల్లాలో ఎక్కడా గ్రామసభలు నిర్వహించలేదు. చివరకు అసైన్‌మెంట్ కమిటీ సమావేశాన్ని కూడా నిర్వహించలేదు. ఇన్‌చార్జ్ మంత్రి నుంచి కింది స్థాయి తహసీల్దార్ వరకూ ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్దనే సంతకాలు పెట్టి అసైన్‌మెంట్ జాబితాను ఆమోదించారు. ఈ జాబితాలో అనర్హులే ఎక్కువగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ప్రభుత్వ భూములను భూస్వాములైన వైసీపీ నేతలకు కట్టబెట్టినట్లు ప్రచారం ఉంది. నాడు కొందరు ఎమ్మెల్యేలు కూడా బినామీల పేర్ల మీద వందల ఎకరాలను అసైన్‌మెంట్ రూపంలో కొట్టేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. చాలా గ్రామాల అసైన్‌మెంట్ జాబితాలు ఆర్డీవో కార్యాలయాల్లో లేవని తెలుస్తోంది.

● అనర్హులకు ఫ్రీహోల్డ్ హక్కులు

ఇక అసైన్‌మెంట్ భూములకు ఫ్రీహోల్డ్ (పట్టాగా మార్పు చేయడం) హక్కులు కల్పించిన వ్యవహారంలో కూడా భారీ కుంభకోణం జరిగినట్లు సమాచారం. అసైన్‌మెంట్ పట్టా ఇచ్చి 20 సంవత్సరాలు దాటిన వారికి ఒరిజినల్ పట్టాగా మార్పు చేస్తూ గతేడాది చివర్లో ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అందుకు సంబంధించి జిల్లాలో వేల ఎకరాలకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు. కానీ ఈ వివరాలన్నింటినీ రెవెన్యూ అధికారులు ఇప్పటికీ గోప్యంగా ఉంచారు. కానీ జిల్లాలో యాభై శాతానికిపైగా అసైన్‌మెంట్ భూములు చేతులు మారిపోయాయి. ఇలా ఒరిజనల్ అసైనీదారులు భూమ్మీద లేకపోయినా వైసీపీ నాయకులు మేలు చేసేలా కొన్ని వేల ఎకరాలకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించినట్లు ఆరోపణలున్నాయి. ఇలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించిన దాదాపు 500 ఎకరాలు గడిచిన ఆరు నెలల్లో రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోయాయి. ఈ జాబితాపై కూడా విచారణ జరిపితే అనేక వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి.

● చుక్కల భూముల పేరుతో...

నిషేధిత జాబితాలో ఉన్న కొన్ని వేల ఎకరాల భూములను ఆ జాబితా నుంచి అధికారులు తొలగించారు. 2023, జనవరిలో ఒకే జీవోతో దాదాపు 40 వేల ఎకరాలను ఆ జాబితా నుంచి తీసేశారు. అంతకముందే జిల్లా ఉన్నతాధికారులు వేల ఎకరాలను 22-ఏ జాబితా నుంచి తప్పించారు. ఈ వ్యవహారంలో కూడా భారీ ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములను కూడా వైసీపీ నాయకుల కోసం నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ల్యాండ్ సీలింగ్‌లో ప్రభుత్వానికి అప్పగించిన భూములను కూడా ఆర్‌హెచ్‌లో పట్టాగా నమోదై ఉంది కాబట్టి దానిని 22-ఏ నుంచి తొలగించి ఆ భూములను అప్పగించిన వారసులకు మేలు చేసిన ఘటనలూ ఉన్నాయి. నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు రెవెన్యూ పరిధిలోని కోడూరుపాడులో జరిగిన ఉదంతమే ఇందుకు ఉదాహరణ. ఇక ప్రభుత్వ భూములు, కాలువ భూములు, సర్కారు తోపు, తోపు పోరంబోకు భూములను కూడా 1954కు ముందు పట్టాలు ఇచ్చినట్లుగా చూపిస్తూ వాటికి ఎన్‌వోసీలు జారీ చేసిన ఘటనలూ జిల్లాలో ఉన్నాయి. వీటన్నింటిపై లోతుగా విచారణ జరిపిస్తే అనేక అక్రమ భాగోతాలు బయటకు వస్తాయి. ఇవన్నీ జరగాలంటే ఆ రికార్డులు రెవెన్యూ కార్యాలయాల్లో భద్రంగా ఉండాల్సిన అవసరముంది.

నాడు సివిల్ సప్లయీస్ కార్యాలయం..

నెల్లూరు(హరనాథపురం) : పరిపాలనా సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో సివిల్ సప్లయిస్ డీఎం, డీఎస్‌ఓ కార్యాలయాలు ఉండేవి. అయితే, 2013, నవంబరు ప్రాంతంలో కార్యాలయాలు తగలబడిపోయాయి. అందులోని ఫైళ్లు బూడిద అయ్యాయి. ఈ ఘటనకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అని అప్పటి అధికారులు తెలిపారు. అయితే, ఆనాడు సివిల్ సప్లయిస్ ద్వారా భారీగా ధాన్యం కొనుగోళ్లు రూ.కోట్లలో జరిగాయి. అధికారులకు కూడా బాగా ముట్టినట్లు ప్రచారం నడిచింది. ధాన్యం కొనుగోళ్లు, అక్రమ సంపాదన వెనుక వ్యవహారం బయటకు పొక్కింది. దీంతో ఉన్నతస్థాయిలో విచారణ జరిగుతుందనే ప్రచారం విస్తృతంగా నడిచింది. దొంగ లెక్కలు బయట పడతాయనే అనుమానంతో ఆ కార్యాలయాన్ని ఆనాడు తగలబెట్టారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. ఒక్క ఫైలు కూడా దక్కించుకోలేకపోయారు. దీనివెనుక సూత్రధారులు, పాత్రధారులు ఎవరో ఇప్పటికీ తేల్చలేదు. అయితే, సివిల్ సప్లయిస్ డీఎం కార్యాలయానికి ఆనాటి నుంచి సొంత భవనం లేకుండా పోయింది. అద్దెభవంతిలోనే కాలం వెళ్లదీస్తున్నారు.



అద్దె భవనంలో నడుస్తున్న సివిల్ సప్లయీస్ కార్యాలయం

వచ్చే నెల 10 వరకు పంచాయతీల్లో
ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు : డీపీవో

నెల్లూరు (జడ్పీ), జూలై 25 : జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గురువారం నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీపీవో సుస్మితారెడ్డి తెలిపారు. గురువారం తన చాంబర్‌లో ఆమె అధికారులతో సమావేశమై మాట్లాడారు. కలెక్టరు ఆదేశాల మేరకు వచ్చే నెల 10 వరకు పంచాయతీలలో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు పారిశుధ్యం మెరుగు పరిచి కలుషిత నీరు అరికట్టడం వంటి పనులను చేపట్టాలన్నారు. ఎక్కడైన విషజ్వరాలు అధికంగా ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 9100121702కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

● వాంతులు, విరేచనాలతో మహిళ మృతి?

అనంతసాగరం : బొమ్మవరం ఎస్సీ కాలనీకి చెందిన పల్లవోలు బుజ్జమ్మ (31) వాంతులు, విరేచనాలతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గురువారం గ్రామంలో జరిగిన గ్రామసభలో ఈ విషయాన్ని అధికారులకు తెలియజేశారు. పారిశుధ్య లోపం, వైద్యసిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించక పోవడంతోనే డయేరియా సోకుతున్నట్లు ఎంపీడీవో తాజ్‌మస్రూర్‌కు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకొన్న అనంతసాగరం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి గ్రామానికి చేరుకొని బుజ్జమ్మ మృతిపై విచారించారు.

'బూడిద' సమస్యకు
శాశ్వత పరిష్కారం లేదా!?

- తరచూ పైపులైన్ల లీకేజీతో వెదజల్లుతున్న కాలుష్యం
- పంటలకు తీవ్ర నష్టం.. రొయ్యల చెరువులూ కలుషితం
- రైతుల గోడు పట్టించుకోని జెన్‌కో అధికారులు

ముత్తుకూరు, జూలై 25 : శ్రీ దామోదరం సంజీ వయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం (జెన్‌కో) యాష్ పాండ్ పైపులైన్ల లీకేజీతో కాలుష్యం వెదజల్లుతోంది. పదే పదే థర్మల్ కేంద్రం నుంచి బూడిద చెరువులకు వెళ్లే పైపులైన్లు లీకేజీ కారణంగా పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారు. సమస్య ఏర్పడినప్పుడు జెన్‌కో అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి సరిపెట్టేస్తున్నారు. దీంతో కొద్దిరోజుల్లో మళ్లీ పైపులైన్లు యథాప్రకారం లీకేజీ అవుతున్నాయి. ఈ పైపుల నుంచి వచ్చే బూడిద నీరు చుట్టుపక్కల పంట పొలాల్లో చేరి తీవ్ర నష్టం కలగజేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యల చెరువుల్లోనూ బూడిద నీరు ప్రవహించడంతో నీరు కలుషితమై రొయ్యలు చనిపోతున్నాయి. జెన్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము పంటలను నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన 4 నెలల కాలంలో యాష్ పాండ్ పైపులైన్లు ఐదుసార్లు లీకేజీ అయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. గతంలో జెన్‌కో సీఈ రైతులతో మాట్లాడుతూ పైపులైన్లకు శాశ్వత మరమ్మతులు చేయించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ ఇచ్చిన వారంలోపే యథాప్రకారం పైపులైన్ల లీకేజీతో బూడిద నీరంతా రోడ్లపై ప్రవహించింది. యాష్‌పాండ్ బూడిదతో నిండిపోయి ఇప్పటికే పరిసర గ్రామాల్లో సమస్యలు తలెత్తుతుండగా, ఈ లీకేజీ సమస్య మరింత భారంగా మారింది. ఇప్పటికైనా జెన్‌కో అధికారులు స్పందించి తక్షణం యాస్ పాండ్ పైపులైన్లకు పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి లీకేజీ లేకుండా చూడాలని పరిసర గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.





పైపులైన్ లీకేజీతో బయటకు వచ్చిన బూడిద నీరు

కమిషనర్ సంతకం ఫోర్జరీ కేసులో
పోలీసుల విచారణ వేగవంతం

- రంగంలోకి మూడు ప్రత్యేక బృందాలు
- కార్పొరేషన్ కార్యాలయంలో ఫైళ్లు పరిశీలించిన డీఎస్పీ



నెల్లూరు (క్రైం), జూలై 25 : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సంతకాల ఫోర్జరీ కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. నగర డీఎస్పీ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈ కేసులో ఆరుగురిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేందుకు చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో గాలిస్తున్నారు. మరోవైపు ఈ కేసులో ఆరుగురితోపాటు మరికొందరి ప్రమేయం ఉందన్న అంశంపై పోలీసుల విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో నగర డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం పలు ఫైళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నగర డీఎస్పీ మాట్లాడుతూ అప్పటి కమిషనర్ వికాస్ మర్మత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు తెలిపారు.

బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

మర్రిపాడు, జూలై 25 : ఎర్రచందనం దుంగల తరలింపులో పట్టుబడ్డ బీట్ ఆఫీసర్‌పై వేటు పడింది. కదిరినాయుడుపల్లి బీట్ ఆఫీసర్ సంపత్‌కుమార్‌ను గురువారం డీఆర్వో చంద్రశేఖర్ సస్పెండ్ చేశారు. ఇటీవల ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తూ టాస్క్‌ఫోర్స్ అధికారులకు దొరికిన వారితో తమ శాఖకు ఎటువంటి సంబంధం లేదని, వారిలో రసూల్, పెంచల ప్రసాద్ గతంలో బేస్కేల్ క్యాంప్‌లో పని చేస్తుండగా వారితోపాటు మరో ముగ్గురిని ఈ ఏడాది జూలై 1వ తేదీన విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

విద్యుత్ అక్రమాలపై కఠిన చర్యలు : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ), జూలై 25 : జిల్లాలో విద్యుత్ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ హెచ్చరించారు. గురువారం ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు దొంగలించినా, మీటర్లు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక అధికారులుగా ఏపీటీఎస్ సీఐలుగా శ్రీనివాసులురెడ్డి, 9440811787, పీవీ సుబ్బారావు 9490615816 నెంబర్లకి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

సైజు చూస్తే
గుడ్లు తేలేయాల్సిందే!

● అంగన్‌వాడీలకు చిన్నసైజు, కుళ్లిన ఎగ్స్ సరఫరా ● చిన్నపిల్లలు, బాలింతల ఆరోగ్యంతో చెలగాటం

నెల్లూరు (హరనాథపురం), జూలై 25 : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు చిన్నవిగాను, కుళ్లినవి సరఫరా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలలో పోషక విలువలు బాగుండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేయిస్తోంది. అయితే, సరఫరా బాధ్యతలు తీసుకున్న కాంట్రాక్టరు ముందుగా చేసుకున్న ఒప్పందాలను కాలరాసి ఇష్టానుజారం గుడ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా నెలకు 24 నుంచి 26 చొప్పున నెలలో రెండుసార్లు కోడిగుడ్లు ఇస్తారు. వీటిని రెండు దఫాలుగా అందచేయడం వల్ల గుడ్లను తీసుకెళ్లిన వారు చిన్నవి ఇచ్చారని, నల్లగా మారిన గుడ్లు ఇచ్చారని అంగన్‌వాడీ కార్యకర్తలకు వాపసు చేస్తున్న సంఘటనలు, వారితో వాదులాటకు దిగుతున్న సంఘటనలు జిల్లాలో పెరుగుతున్నాయి.

● ట్రేకు 30 కోడిగుడ్లు

అంగన్వాడీ కేంద్రాలకు ఇచ్చే ట్రేలో 30 గుడ్లు పడతాయి. ఆ ట్రే బరువు 1500 గ్రాములు ఉండాలి. ఒక గుడ్డు బరువు 50 గ్రాములకు మించి ఉండాలి. అయితే, ఒక్కో గుడ్డు 30 గ్రాముల బరువు కూడా ఉండటం లేదని గర్భిణులు, బాలింతలు వాపోతున్నారు. అంతేగాక నల్లగా మారిన గుడ్లను ఇస్తున్నట్లు ఆరోపించారు. ఈ గుడ్లను తింటే పోషకాహారం మాట అటుంచి ఆసుపత్రి పాలవుతామని వాపోయారు. అయితే, అధికారులు మాత్రం చిన్న, పెద్ద గుడ్లు అని కాకుండా ట్రేలో గుడ్ల బరువు 1500 గ్రాములు ఉంటే చాలన్నారు. బరువు విషయంలో పొంతనలేని సమాధానం ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి బరువు కలిగిన, నాణ్యత ఉన్న గుడ్లు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బాలింతలు కోరుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా అయిన చిన్న సైజు కోడిగుడ్లు

ఒప్పందం ప్రకారం సరఫరా ఉండాలి

ఒప్పందం ప్రకారం కాంట్రాక్టరు కోడిగుడ్లను సరఫరా చేయాలి. అందుకు ఐసీడీఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలి. ట్రే బరువుతోపాటు గుడ్డుబరువు కూడా 50 గ్రాములకు మించి ఉండేలా చూడాలి ఐసీడీఎస్ అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహించి గుడ్ల నాణ్యత, సైజు, పరిమాణం సరిగా ఉన్నాయా లేవా అని చూడాలి. కాంట్రాక్టరు కూడా ఒప్పందం ప్రకారం కోడిగుడ్లు సరఫరా చేయాలి.

- సునీత, రెహనాబేగం, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ల సంఘం నేతలు

తనిఖీలు నిర్వహిస్తాం

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న గుడ్లను తనిఖీ చేస్తాం. నాణ్యతతోపాటు, గుడ్డు 50 గ్రాముల బరువు ఉందా లేదా అనే విషయం చూస్తాము. చిన్నగుడ్లు సరఫరా అవుతున్నట్టు తెలిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

- హేనా సుజన్, ఐసీడీఎస్ పీడీ

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), జూలై 25 : పాలిసెట్-2024 స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 31వ తేదీన డిప్లొమో కోర్సుల్లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు టెన్త్ మార్కుల జాబితా, టీసీ, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రంతోపాటు పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. అలాగే పాలిసెట్-24 ప్రవేశపరీక్షలో ర్యాంకు సాధించిన విద్యార్థుల్లో బీసీ, ఓసీలు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 చెల్లించాలన్నారు. అలాగే అర్హత సాధించిన విద్యార్థుల్లో ఓసీ, బీసీలు రూ.1100, ఎస్సీ, ఎస్టీలు రూ.350 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలన్నారు. అనంతరం సీటు పొందిన విద్యార్థి ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జెరాక్స్ కాపీలతోపాటు రూ.4,700 కళాశాల ఫీజును వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఎలాంటి స్కాలర్‌షిప్ రాదని తెలిపారు.

● రేపు ఐటీఐ కళాశాలలో ఎంపికలు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో చేరదలచుకున్న విద్యార్థులకు ఈ నెల 27న ఎంపికలు నిర్వహిస్తామని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ కె.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని ఉదయం 9 గంటలకు తమ కళాశాలలో హాజరుకావాలని పేర్కొన్నారు.

అన్నివర్గాల ప్రజలకు ఆర్థిక సేవలు అందాలి


సెమినార్‌లో పాల్గొన్న యూనివర్సిటీల ప్రొఫెసర్లు

కందుకూరు, జూలై 25: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) ఆధ్వర్యంలో గురువారం జాతీయ సెమినార్ నిర్వహించారు. దేశంలోని వివిధ యూనివర్సిటీలలో ఆర్థికశాఖ ప్రొఫెసర్లు, పలు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని భారతదేశంలో ఆర్థిక సేవలు, అవకాశాలు, సమస్యలు, సవాళ్లు అనే అంశంపై చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సెమినార్‌లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డి కామయ్య మాట్లాడుతూ వివిధ రకాలైన ఆర్థిక సేవలు అన్నివర్గాల ప్రజలకు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బి శ్రీనివాస్ ఆర్థిక కార్యకలాపాల యొక్క వివిధ దశలను వివరించారు. నూతన ఆర్థిక విధానాలు, డిజిటల్ ఇండియాలో జరుగుతున్న పరిణామాలు నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థిక కార్యకలాపాలను మరింత దగ్గర చేయాల్సిన ఆవశ్యకత, మహిళల్లో ఆర్థికాంశాల పట్ల అవగాహన పెరగాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ ఈ సెమినార్ శుక్రవారం కూడా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్ డీపీ డీపీఎం కె కల్యాణ్, యూనియన్ బ్యాం కు ఏజీఎం కె హరిబాబు, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వీవీ మధుసూదనరావు, దేశంలోని వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు డాక్టరు సీహెచ్ శంకరరావు, డాక్టరు జి. జగదీష్, కళాశాల అధ్యాపకులు ఏడుకొండలు నరేంద్ర, డాక్టరు పి. రాజగోపాల్ బాబు, డాక్టరు తిరుపతిస్వామి, డాక్టరు కె సుజాత, కేవీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వెంగమాంబకు నెల పొంగళ్లు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఉదయగిరిరూరల్, జూలై 25: నర్రవాడ వెంగమాంబ పేరంటాల నెల పొంగళ్ల ఉత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అలాగే సంతానంలేని మహిళలు అమ్మవారి ఎదుట వరపడడంతో పాటు హోమగుండం వద్ద ఉన్న చెట్టుకు ముడుపులు కట్టారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు భద్రయ్య ప్రత్యేక పూజలు, కల్యాణం హోమ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

అనంతసాగరం, జూలై 25: స్థానిక అంజనేయస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ముగింపు వేడుకల్లో భాగంగా గురువారం ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి సీతారాముల వారి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భానుప్రకాష్‌తో పాటు వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

అధినేతల చిత్రపటాల బహూకరణ


సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేల చిత్ర పటాలను అందజేస్తున్న నాయకులు

సీతారామపురం, జూలై 25: జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి సింగల నాగేశ్వరరావు గురువారం స్థానిక సీతారామపురం బిట్-1, బిట్-2 సచివాలయాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ చిత్రపటాలను బహూకరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జామవా, మండల సీనియర్ నాయకులు చెన్నకేశవులు, దేవర వెంకటేశ్వర్లు, తురక వెంకటేశ్వర్లు, మత్స్యకార అధ్యక్షుడు రాజశేఖర్, ఏడవ వార్డు నెంబర్ తోట మనోజ్, 8బూత్ ఇన్‌చార్జి తోట మాల్యాద్రి, జయరాములు, చంద్ర, పెద్దగౌస్, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా గుర్రప్పస్వామికి పూజలు

వింజమూరు, జూలై 25: పట్టణంలోని నడిమూరులో ఉన్న గుర్రప్పస్వామి 11వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై హర్షం

కలిగిరి, జూలై 25: 'కలిగిరిలో ట్రాఫిక్ కష్టాలు' అని గురువారం ప్రచురితమైన 'ఆంధ్రజ్యోతి' కథనానికి పోలీసు శాఖ సత్వరమే స్పందించింది. ఇద్దరు సిబ్బందిని నియమించడంతో వారు గురువారం ఉదయం, సాయంత్రం వేళల్లో కలిగిరమ్మ కూడలి వద్ద విధులు నిర్వహించడం కనిపించింది. పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలియజేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు


స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు, జూలై 25: పీసీ, పీఎన్‌డీటీ చట్టం నియమ నిబంధనలకు లోబడి ఆసుపత్రిలో స్కానింగ్ కేంద్రాలు పనిచేయాలని డివిజనల్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎస్‌వీ సుధీర్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో గురువారం పీసీ, పీఎన్‌డీటీ చట్టం అమలుపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని తెలిపారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం మాట్లాడారు. అనంతరం పట్టణంలోని పలు స్కానింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ఉషాసుందరీ, ఐసీపీఎస్ సూపర్‌వైజర్ ఎం రత్నమ్మ, ఏఎస్ఐ జే వెంకయ్య, ఎన్‌జీవో డీ రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

ఆత్మకూరు, జూలై 25: ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి తెలిపారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఆత్మకూరు డివిజన్ స్థాయిలో జరుగుతున్న సపోర్టింగ్ ఆంధ్రస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమంలో భాగంగా టీచ్ టూల్ శిక్షణ తరగతులను గురువారం ఆమె పరిశీలించారు. ఉపాధ్యాయులు తమ బోధనలో బహుళ నైపుణ్యాలను కలిగి ఉండాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేసి విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కే.గోపాల్, ఎంఈవో కే. చలపతి, సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాతావరణ ఆధారిత పంటల సాగుపై శిక్షణ


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రిన్సిపాల్ క్రిష్ణారెడ్డి

సీతారామపురం, జూలై 25: వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ నెల్లూరు వారి ఆధ్వర్యంలో మండలంలోని అయ్యవారిపల్లిలో గురువారం వాతావరణ ఆధారిత పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉదయగిరి వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణారెడ్డి హాజరయ్యారు. క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం తిరుపతిలో ఆముదం ఐసీహెచ్-5 హైబ్రిడ్ రకం మేలైనదని, అలాగే కంది, సజ్జ గుర్తించడం జరిగిందన్నారు. పై పంటలను సాగు చేసుకొని తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివాన్నారాయణ, మండల వ్యవసాయధికారి పీ.చెన్నారెడ్డి, మరిపాడు ఎంఏవో రామామోహన్, వీఏఏ నరేంద్ర, సర్పంచ్‌లు దుర్గాప్రసాద్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాలి

ఉదయగిరిరూరల్, జూలై 25: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చే రోగులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందేలా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య అన్నారు. గురువారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వసతులు ఏర్పాటు చేసినప్పటికీ వైద్యుల కొరత తీవ్రంగా ఉండడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు. 50 పడకల వైద్యశాలగా గుర్తింపు సాధించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. అరకొర ఉన్న వైద్యులను సైతం డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయమ్మ, నాయకులు ఫరుద్దీన్‌బాషా, రమణయ్య, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు


గంబూసియా చేపలు వదులుతున్న సిబ్బంది

ఉదయగిరిరూరల్, జూలై 25: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గండిపాళెం ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి ఎం శివకల్పన అన్నారు. గురువారం పట్టణంలో కోనేరు, ఆనకట్ట, బాలాజీనగర్ ప్రాంతాల్లో నీటి నిల్వ ఉన్న ప్రదేశాల్లో గంభూసియా చేపలను వదిలి పెట్టారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి షేక్ నౌషాద్‌బాబు, ఆరోగ్య బోధకులు కలసిపాటి వెంకటసుబ్బయ్య, అంకమ్మ, నూర్జహాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఉదయగిరిరూరల్, జూలై 25: మండలంలోని నేలటూరులో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఎంపీడీవో ఈశ్వకమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల ప్రభావంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, ముందస్తు జాగ్రత్తగా పారిశుధ్యాన్ని మెరుగుపరిచి రోగాల బారినుంచి ప్రజలను కాపాడాలన్నారు. అలాగే సచివాలయంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలోనూ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, కార్యదర్శి నాగూర్‌బీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు


భూ ఆక్రమణపై సర్వేయర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

అనంతసాగరం, జూలై 25: మండలంలోని బొమ్మవరం చెరువులో భూఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బొమ్మవరం టీడీపీ నాయకులు సచివాలయ సర్వేయర్ సమరసింహారెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. గడిచిన మూడు రోజులుగా చెరువులో సుమారు ఐదు ఎకరాల భూమిలో మొక్కలు తొలగించి బోరు వేసి సాగుకు సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కలువాయి వెంకటేశ్వర్లురెడ్డి, కలువాయి మనోహర్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై గోకులాలు

కలిగిరి, జూలై 25: గోకులం పథకం కింద పాడిపశువులకు 90శాతం, గొర్రెలు, మేకలు, కోళ్లకు 70 శాతం రాయితీపై షెడ్డు నిర్మించుటకు మండలానికి 25 యూనిట్లు మంజూరైనట్లు పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు డా. కే సురేష్‌బాబు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు వారి పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో పశుసంవర్థక సహాయకుల ద్వారా దరఖాస్తులు సమర్పించాల్సి ఉందన్నారు. షెడ్డుకు అవసరమైన మేర స్వంత భూమి కలిగి ఉండటంతోపాటు ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. సన్న, చిన్నకారు రైతులతోపాటు ఎస్సీ, ఎస్టీలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. వివరాలకు సంబంధిత పశువైద్యశాలలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ


ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్నఏపీవో

సీతారామపురం, జూలై 25: మండల కేంద్రమైన సీతారామపురంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను ఏపీవో సుహాసిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కూలీలతో మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయాన్నే 6.30 నుంచి 11 గంటల వరకు పని చేయాలని, మీకు కేటాయించిన పనిని మాత్రమే చేస్తూ రోజుకు రూ.300లు వరకు సంపాదించవచ్చని తెలిపారు. అనంతరం రిజిస్టర్‌లోని పేర్లు చదివి వారికి హాజరు వేశారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఘనంగా కల్చరల్ డే

చేజర్ల, జూలై 25: శిక్షా సప్తహ్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం కల్చరల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నృత్యాలు, జానపదాలు, హరికథలు, బుర్రకథలు, వివిధ భాషల సంస్కృతిని విద్యార్థులకు తెలియపరిచేలా కార్యక్రమాలు నిర్వహించారు.

సేవాభావంతో వైద్యులు ముందుకు సాగాలి

కావలి వైద్యబృందానికి మంత్రి సత్కారం


సుబ్బారావును సత్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

కావలి, జూలై 25: డాక్టర్స్ డే సందర్భంగా జూలై 1న రక్తసేకరణలో 1273 యూనిట్లు సేకరించి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించిన కావలి వైద్య బృందాన్ని అభినందిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సత్కరించారు. ఐఎంఏ కావలి శాఖ ఆధ్వర్యంలో వైద్యబృందం గురువారం కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి చొరవతో మంత్రి సత్యకుమార్‌ను అమరావతిలోని ఆయన ఛాంబర్‌లో కలిసారు. ఐఎంఏ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సహకారంతో కావలిలో రక్తదానశిబిరాలు చేపట్టి ఒక్కరోజున దేశంలోనే అత్యధికంగా రక్తసేకరణ చేసిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తమ సేవలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వారు చేసిన సేవలకు సంభందించిన వినతిపత్రాన్ని మంత్రికి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని సత్కరించి సేవాభావంతో ముందుకు సాగాలన్నారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో ఏర్పాటుచేసిన తలసేమియా యూనిట్ ప్రారంభోత్సవానికి తాము త్వరలో ఆహ్వానిస్తామని, ఆకార్యక్రమానికి రావాలని రెడ్‌క్రాస్ సీనియర్ వైద్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ కావలిశాఖ అధ్యక్షుడు డాక్టర్ కే సుబ్బారావు, కార్యదర్శి గోపి, కోశాధికారి పామూరు శివప్రసాద్‌తో పాటు టీడీపీ రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, నేత తిరువీధిప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడా కిట్ల వితరణ


క్రీడా కిట్లు బహూకరిస్తున్న కృష్ణారావు

కావలిటౌన్, జూలై 25: కావలి పట్టణ వెంగళరావు నగర్‌లోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ హైస్కూల్ పూర్వ ప్రధానోపాధ్యాయిని దివంగత పద్మతులసి జ్ఞాపకార్థం విద్యార్థులకు క్రీడా కిట్లు బహూకరించారు. గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు హయ్యాల్‌హయ్యామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పద్మతులసి భర్త కృష్ణారావు పాల్గొని విద్యార్థులకు క్రీడాపరికరాలు బహూకరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ కొండారెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు శాంతకుమారి, శర్వాణి, అంజాద్‌అలి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన పీవీ

ఉదయగిరిరూరల్, జూలై 25: మంత్రి నారా లోకేష్‌ను గురువారం రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థల సమాఖ్య అధ్యక్షులు పీవీ రమణయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోనే విలీనం చేయాలని, దీంతో డ్రాపౌట్స్ సంఖ్య పెరుగుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో మాదిరిగానే ప్రాథమిక విద్య కొనసాగించాలని కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జలదంకి, జూలై 25: మండలంలోని అన్నవరానికి చెందిన టీడీపీ కార్యకర్త నీలం మల్లేశ్వరరావు (38) బుధవారం గుండెపోటుతో ప్రైవేటు వైద్యశాలలో మృతిచెందాడు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకురావడంతో టీడీపీ నాయకుడు పూనూరు రామక్రిష్ణారెడ్డి గురువారం మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం తరపున చంద్రన్న భీమా సాయం అందేలా కృషిచేస్తామని, అంతేగాక పార్టీ తరపున, వ్యక్తిగతంగా కూడా ఆర్థిక సాయం అందేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట అన్నవరం ఎంపిటిసి కోర్శిపాటి మాదవరెడ్డి, టీడీపీ నేత దేవరపల్లి రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

కావలిటౌన్, జూలై 25: కావలి రూరల్ మండల చలంచర్ల ప్రాథమిక పాఠశాలకు గ్రామస్థులు విశాఖపట్నంలో నివాసముంటున్న ఇరువూరు మాల్యాద్రి ఫర్నిచర్ వితరణ చేశారు. గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఇప్పగుంట సావిత్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇరువూరు మాలాద్రి పాల్గొని ఫర్నిచర్ బహూకరించగా గ్రామ పెద్దలు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో చాగంటి వెంకటేశ్వర్లు గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం

బిట్రగుంట, జూలై 25: సార్వత్రిక ఎన్నికల విధుల నిమిత్తం బోగోలు మండలం వచ్చిన తహసీల్దారు వెంకటరత్నం బుధవారం రాత్రి బదిలీ కావడంతో ఆయన్ను డిప్యూటీ తహసీల్దారు జూలియాభాయ్, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించినట్లు వీఆర్వోల యూనియన్ నాయకుడు కిరణకుమార్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని పంచాయతీల వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ఉదయగిరిరూరల్, జూలై 25: మండలంలోని వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఎంఈవో మస్తాన్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అమలవుతున్న శిక్ష సప్తహ్ కార్యక్రమాలతో పాటు విద్యార్థుల నైపుణ్యాలు, మధ్యాహ్న భోజనం, అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన భిన్నత్వంలో ఏకత్వం, మనదేశ సంస్కృతి, జానపద గేయాలు, నృత్య ప్రదర్శనలను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం బలరామయ్య, పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఆత్మకూరు, జూలై 25: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించబడుతుందని ఎంపీడీవో బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ సభకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

లింగసముద్రం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ప్రసాద్ నియామకం

లింగసముద్రం, జూలై 25 : లింగసముద్రం మండల ఇన్‌చార్జ్ తహసిల్దార్‌గా (పూర్తి అదనపు బాధ్యతలు) కార్యాలయంలోని డిప్యూటీ తహసిల్దార్ తానికొండ ప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ ఆనంద్ నియమించారు. దీంతో గురువారం ఆయన విధుల్లో చేరారు.

29 నుంచి పొగాకు కొనుగోలు

మర్రిపాడు, జూలై 25: రైతు వద్ద అదనంగా మిగిలిన పొగాకును సోమవారం నుంచి డీసీపల్లి బోర్డులో కొనుగోలు చేస్తున్నట్లు వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ తెలిపారు. రైతు అనుమతి పొందిన మేర పొగాకును బోర్డు కొనుగోలు చేసి వేలాన్ని ఇటీవల ముగించారు. రైతు వద్ద అదనంగా ఉన్న పొగాకు మిగిలి ఉండటంతో కేంద్ర వాణిజ్య శాఖను అనుమతులు కోరారు. దీంతో రైతు నుంచి ఎటువంటి అపరాధ రుసుం లేకుండా కొనుగోలు చేసేందుకు ఆ శాఖ నుంచి అనుమతులు వచ్చాయని, అదనంగా ఉన్న పొగాకును ముందుగా బోర్డులో తెలియజేసి అమ్మకానికి రైతు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

నిధులు మంజూరుకు చర్యలు : సబ్ కలెక్టర్


కాలనీవాసుల నుంచి అర్జీలు తీసుకుంటున్న సబ్ కలెక్టర్ విద్యాధరి

లింగసముద్రం, జూలై 25: మండలంలోని వీఆర్ కోటలో 2013లో ఎస్టీలకు (యానాదులు) పక్కాగృహాల నిర్మాణానికి ఓ రైతు నుండి ప్రభుత్వం సేకరించిన భూమికి పరిహారం ఇవ్వకపోవడంతో ఆభూమిని కందుకూరు సబ్‌కలెక్టర్ జి విద్యాధరి పరిశీలించారు. 2013లో అప్పటి ప్రభుత్వం ఎస్టీ కాలనీలోని యానాదులు 32 మందికి ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించేందుకు గ్రామానికి చెందిన కాటా మనోజ్ అనే రైతుకు చెందిన సర్వే నంబరు 96/2లోని 1.05 సెంట్ల భూమిని సేకరించింది. అయితే రైతు నుండి భూమిని సేకరించి ఎస్టీలకు పక్కా గృహాలు నిర్మించిన ప్రభుత్వం రైతుకు పరిహారం మంజూరు చేయలేదు. దీంతో ఆ రైతుకు పరిహారం మంజూరు నిమిత్తం గురువారం ఉదయం సబ్ కలెక్టర్ విద్యాధరి ఆ భూమిని పరిశీలించి, అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎస్టీ కాలనీవాసులు తమకు ఆధార్‌కార్డులు లేవని తగిన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ విద్యాధరిని కోరారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు వినతి పత్రాలను అందజేశారు. రెండు వారాల్లో గ్రామంలో ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసిల్దార్ టి ప్రసాద్, వీఆర్ఓ పి అమానుల్లాఖాన్, స్థానిక టీడీపీ నేతలు మాజీ సర్పంచు ముప్పరాజు లక్ష్మీనరసింహం, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్లూరు, జూలై 25: కలెక్టరు ఆదేశాల మేరకు అల్లూరు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో జ్యోతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 15 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు, చిరునామా, ఫోన్ నెంబరు, ఫోటోలు, తదితర అంశాల్లో మార్పులు, చేర్పులకు ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నార్తుమోపూరులో ఆధార్ కేంద్రాన్ని కమిషనర్ ఫణికుమార్ పరిశీలించగా కార్యదర్శి వరప్రసాద్ పర్యవేక్షణలో కొనసాగింది.

- సంగం : స్థానిక సచివాలయం -1లో శిశు ఆధార్ ప్రత్యేక నమోదు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ తీస్తారని, ఇప్పటికీ ఆధార్ పొందని చిన్న పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవోఆర్డీ అప్పాజీ తెలిపారు.

ఆధార్ శిబిరం తనిఖీ

వరికుంటపాడు: మండలంలోని కాంచెరువు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని గురువారం ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం 50 మందికి తగ్గకుండా సేవలు అందించాలన్నారు. అలాగే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి శిబిరాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జిలానీ, డిజిటల్ అసిస్టెంట్ మహేష్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం : సీపీఎం



నిరసన తెలియజేస్తున్న సీపీఎం శ్రేణులు

కావలిటౌన్, జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ప్రత్యేక హోదా ప్రకటించలేదని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ట్రంకురోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో మన రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని, ప్రధాని మోడి విభజన హామీలు, ప్రత్యేక హోదా ఏఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. 15వేల కోట్ల అప్పు ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో అధికారంలోనున్న కూటమి ప్రభుత్వం కేంద్రంపై వత్తిడి తెచ్చి ప్రత్యేక హోదా ప్రత్యేక ప్యాకేజి, విభజన హామీలు సాధించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు టీ మాల్యాద్రి, పట్టణ నాయకులు తిరుపాల్, కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవో నెం.117 రద్దు చేయాలి : యుటీఎఫ్

కావలిటౌన్, జూలై 25: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, జీవో నెంబర్ 117 రద్దు చేయాలని యుటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఎంఈవో, ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందించి నిరసన తెలిపారు. మండల యుటీఎఫ్ అధ్యక్షుడు ముజీబ్‌అహమద్ మాట్లాడుతూ యుటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యాశాఖాధికారులకు, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందించామన్నారు. పాఠశాలలు తెరచి రెండునెలలు కావస్తున్నా యాప్‌ల వలన విద్యాయేతర పనుల వలన బోధనకు ఆటంకం కలుగుతోందని, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ప్రసాద్, లక్ష్మీ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు


ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్‌డీవో మధులత

చేజర్ల, జూలై 25: గ్రామాల్లోని ప్రభుత్వ పోరంబోకు భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు ఆర్‌డీవో మధులత తెలిపారు. గురువారం మండలంలోని పెళ్లేరు, తూర్పు కంభంపాడు గ్రామాల్లో గ్రామ కంఠం, పెన్నా పోరంబోకు భూముల ఆక్రమణలపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దారు అశోక్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయలలితకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుమతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌కు స్పాట్ అడ్మిషన్లు

కావలి రూరల్, జూలై 25: కావలి మండలం రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నుండి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లలో భాగంగా జూలై 31న ధ్రువపత్రాల పరిశీలన, ఫీజు చెల్లింపులు ఉంటాయన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులు, ఇంటర్మీడియట్ పాస్ ఆర్ ఫెయిల్ లేదా ఐటిఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ల ద్వారా రుద్రకోటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరుటకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సమాచారం కోసం సెల్: 7989799136, 9908299081, 9912983434 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలి

వరికుంటపాడు, జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మంజూరు చేసిన మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలని పెద్దిరెడ్డిపల్లి పశువైద్యాధికారి రాఘవేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1300 షెడ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా మండలానికి 25 కేటాయించడం జరిగిందన్నారు. రైతు వాటాతో సహా ఉపాధి హామి నిధులను కలిపి వాటిని నిర్మించడం జరుగుతుందన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారితో పాటు మహిళా యజమానులు, ఎస్సీ ఎస్టీ, వలసవాసులు, చిన్న, సన్నకారు రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.